ఈనాడు
కుమురం భీం
బుధవారం 23 ఆగస్టు 2017
16 పేజీలు

## ఉత్సాహాన్ని పెంచాయి.. విజ్ఞానాన్ని పంచాయి



షాట్‌పుట్ వేస్తున్న విద్యార్థిని

కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న తెలంగాణ నవోదయ విద్యాలయాల క్లస్టర్ స్థాయి అథ్లెటిక్స్ ఎగ్జిబిషన్ 2017-18 పోటీలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. తెలంగాణలోని అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు తమ ప్రతిభకు పట్టం కట్టారు. ఆటపాటలతో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసాపత్రంతో పాటు, బహుమతులను అందజేశారు.

వివరాలు లోపలి పేజీల్లో..

# జీవితాలను చిదిమేసింది..

**ఆటో - లారీ ప్రమాదంలో ఆరుగురు మృతి, అయిదుగురికి గాయాలు**

**కుటుంబాల్లో విషాదం    మృతులంతా 23 ఏళ్లలోపు వారే..**



ప్రమాద స్థలం

**అప్పటి వరకు ఆనందంగా సాగిన వారి ప్రయాణం ఊహించని మలుపు తిరిగింది. రెప్పపాటులో జరిగిన రోడ్డు ప్రమాదం ఆరుగురి జీవితాలను చిదిమేసింది. దైవ దర్శనానికి వెళ్లొస్తూ అనంత లోకాలకు సాగిపోయారు. కుటుంబ సభ్యులను కన్నీటి సంద్రంలో ముంచారు. కుమురంభీం జిల్లా వాంకిడి మండలం బెండార సమీపంలోని మూల మలుపు బస్సును అధిగమించే క్రమంలో జరిగిన ప్రమాదంలో లారీ ఢీకొన్న ఘటనలో కెరమెరి వాసులు ఆరుగురు మృత్యువాత పడ్డారు. అయిదుగురు గాయపడ్డారు.**





మృతి చెందిన సంతోష్, జ్ఞానేశ్వర్ (పాతచిత్రాలు)



నుజ్జునుజ్జయిన ఆటో

**రోడ్డు ప్రమాదంలో ఆరుగురు దుర్మరణం**
**మృతులంతా కెరమెరి వాసులే**

**ఆసిఫాబాద్, వాంకిడి, కెరమెరి, న్యూస్‌టుడే:** వారంతా ఉదయం సంతోషంగా దైవ దర్శనం కోసం జాతరకు వెళ్లారు. మొక్కులు తీర్చుకొని ఆటోలో ఇంటికి తిరుగు పయనమయ్యారు. కానీ ఊహించని రీతిలో వాంకిడి మండలం బెండార మూలమలుపు వద్ద రహదారి ప్రమాదంలో అసువులు బాశారు. కుటుంబాల్లో అంతులేని విషాదాన్ని నింపింది. ఇద్దరు ప్రమాద స్థలంలోనే మృతి చెందగా మరో నలుగురు ఆసుపత్రికి తరలించాక మరణించారు. ఆరుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు వ్యవసాయయే ప్రధాన ఆధారం. ప్రమాద విషయాన్ని తెలుసుకొని 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుల బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు చూపరులకు కన్నీటిని తెప్పించాయి. మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కెరమెరి జడ్పీటీసీ సభ్యుడు అబ్దుల్ కలాం, డీసీసీ ప్రధాన కార్యదర్శి విశ్వప్రసాద్ రావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంధం శ్రీనివాస్ ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలపై పరిశీలించారు. క్షత గాత్రులను వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. వాంకిడి సీఐ శ్రీనివాస్, అదనపు ఎస్ఐ తుకారాం, కెరమెరి ఎస్ఐ సత్యనారాయణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. కెరమెరి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 11 మంది (డ్రైవర్‌తో కలిపి) ఆటోలో ఉదయం వాంకిడి మండలం సరండిలోని భవానీ జాతరకు వెళ్లారు. మొక్కులు తీర్చుకొని మధ్యాహ్నం తిరిగి ఇంటికి వస్తున్నారు. వాంకిడి మండలం బెండార సమీపంలోని మూల మలుపు వద్ద బస్సును అధిగమించే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీ కొట్టి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఆటో పూర్తిగా దెబ్బతిని అందులోని ప్రయాణికులు చెల్లాచెదురుగా పడిపోయారు. వీరిలో కెరమెరి మండలం అగర్వాడకు చెందిన వెడ్మ అంబారావు(14), లీమ్‌గూడకు చెందిన ఆదె తిరుపతి(22)లు అక్కడికక్కడే ప్రాణాలొదిలారు. డ్రైవర్‌తో కలిపి 9 మంది క్షతగాత్రులను 108 లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో లీమ్‌గూడకు చెందిన మొహర్లె సంతోష్(16) ఆసిఫాబాద్ ఆసుపత్రిలో మృతి చెందాడు. మిగతా వారికి వైద్య పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు. మార్గ మధ్యలో ఝరి గ్రామానికి చెందిన లెండుగురె రమేశ్(13) మృతి చెందాడు. మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అగర్వాడకు చెందిన మొహర్లె జ్ఞానేశ్వర్(13), లీమ్‌గూడకు చెందిన ఇగురపు నవీన్(21)లు మృతి చెందారు. లీంగూడకు చెందిన ఎం.తిరుపతి, సంతోష్, వడాయి గణేష్, సాంగ్వికి చెందిన ఆటో డ్రైవర్ ఎం.రాంచందర్, ఝరి గ్రామానికి చెందిన కాక్రె రవీందర్‌లు తీవ్రంగా గాయపడ్డారు. వారు మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగి క్షతగాత్రులను ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చిన అర గంట వరకు (మిగతా 7లో)

# బీమా సంస్థలకే ప్రయోజనం



2016లో అతివృష్టి వల్ల ఆదిలాబాద్ జిల్లాలో మునిగిన పత్తి పంట(దాచిన చిత్రం)





**పట్టించుకోని ప్రైవేట్ కంపెనీలు లోపభూయిష్టంగా నిబంధనలు**
**కేంద్ర వ్యవసాయశాఖ తాజా నివేదికలో వెల్లడి**

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే

**ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు బీమా పథకాన్ని అమలు చేస్తోంది. పంటల బీమా పథకం రైతుల కన్నా సంస్థకే ఎక్కువ ప్రయోజనం చేకూరుస్తుందని కేంద్ర వ్యవసాయశాఖ నిర్వహించిన తనిఖీల్లో వెల్లడైంది. గతంలో రైతులు చెల్లించిన ప్రీమియం కంటే వారికి వచ్చిన బీమా పరిహారం తక్కువగా ఉంది. గతంలో ఉండే బీమా పథకాలను రద్దు చేసి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పథకాన్ని తీసుకొచ్చింది. రెండేళ్లుగా పథకం అమలు చేస్తున్నారు. దీంతో కలిగే ప్రయోజనాలపై కేంద్ర వ్యవసాయశాఖ తనిఖీ చేయగా, బీమా సంస్థలకు కాసుల వర్షం కురిపించిందని గుర్తించారు. ఉమ్మడి జిల్లాలో పంట బీమా, పరిహారం చెల్లింపులపై 'న్యూస్‌టుడే' కథనం.**

జిల్లాల విభజన తర్వాత ప్రధాన మంత్రి ఫసల్‌బీమా యోజన పథకం ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం జిల్లాలకు సోయాబీన్‌ను గ్రామం యూనిట్‌గా బీమా పథకం కింద, పత్తిని వాతావరణ ఆధారిత బీమా కింద, జొన్న మొక్కజొన్న, కంది పెసర, మినుములు, పసుపు తదితర పంటలకు మండలం యూనిట్‌గా అమలు చేస్తున్నారు. జిల్లాలో 5.19 లక్షల మంది రైతులు పంటలను సాగు చేస్తున్నారు. పత్తి ప్రధాన పంటగా, తరువాత ఎక్కువగా (మిగతా 7లో)

# నవోదయ క్లస్టర్ స్థాయి అథ్లెటిక్స్ పోటీల విజేతలు వీరే

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే

**కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో రెండ్రోజులుగా నిర్వహించిన తెలంగాణ విద్యాలయాల క్లస్టర్ స్థాయి అథ్లెటిక్స్ - ఎగ్జిబిషన్ 2017-18 పోటీలు మంగళవారం సాయంత్రం ముగిశాయి. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి జిల్లాలైన మహబూబ్‌నగర్, నల్గొండ, ఖమ్మం, మెదక్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, రంగారెడ్డి, ఆదిలాబాద్(కుమురంభీం)జిల్లాలకు చెందిన అథ్లెటిక్స్, సైన్స్ ఎగ్జిబిషన్‌కు దాదాపు 155 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల వివరాలను విద్యాలయం ప్రిన్సిపల్ బి.చక్రపాణి, పీఈటీలు మోహన్‌రావు, శైలజ రెడ్డి ప్రకటించారు. వివరాలిలా ఉన్నాయి.**

## అండర్-19 బాలుర విభాగంలో..

జావెలిన్ త్రో.. గౌతమ్(ఆదిలాబాద్)ప్రథమ, నిషాంత్(మెదక్)ద్వితీయ, నితిన్ నాయక్(రంగారెడ్డి) తృతీయ, షాట్‌పుట్‌లో.. సాకేత్(ఆదిలాబాద్)ప్రథమ, పరుశురాం(మహబూబ్‌నగర్)ద్వితీయ, శ్రీనాథ్(ఖమ్మం)తృతీయ, లాంగ్‌జంప్‌లో.. పి.సాయికుమార్(ఆదిలాబాద్) ప్రథమ, జగన్‌నాయక్(రంగారెడ్డి)ద్వితీయ, కె.పరుశురాం(మహబూబ్‌నగర్)తృతీయ, 200 మీటర్ల పరుగులో.. డి.గణేష్(మెదక్)ప్రథమ, ఎం.ప్రవీణ్‌కుమార్(మహబూబ్‌నగర్)ద్వితీయ, ఎం.అనిల్(ఆదిలాబాద్)తృతీయ స్థానం సాధించినట్లు చెప్పారు.

డిస్క్‌త్రో.. ఎల్.వెంకట్(వరంగల్)ప్రథమ, కె.పరుశురాం(మహబూబ్‌నగర్)ద్వితీయ, నిషాంత్(మెదక్)తృతీయ, హైజంప్‌లో.. పి.సాయికుమార్(ఆదిలాబాద్)ప్రథమ, సాయిప్రదిప్(రంగారెడ్డి)ద్వితీయ, అయిదు కిలోమీటర్ల పరుగులో.. కార్తీక్(ఆదిలాబాద్), చంద్రశేఖర్(రంగారెడ్డి) ద్వితీయ, పృథ్వీరాజ్(మెదక్)తృతీయ, అయిదు కిలోమీటర్ల నడక.. జె.ఉదయ్(వరంగల్)ప్రథమ, సాయికార్తీక్(ఆదిలాబాద్)ద్వితీయ, 800 మీటర్ల పరుగుపందెంలో వై.భార్గవ్(నల్గొండ)ప్రథమ, ఎం.ఆకాష్(మెదక్)ద్వితీయ స్థానం సాధించినట్టు వివరించారు.

## అండర్ - 19 బాలికల విభాగంలో..

లాంగ్‌జంప్ యు.స్వర్ణలత(మెదక్)ప్రథమ, బీసీ.మహేశ్వరి(మహబూబ్‌నగర్)ద్వితీయ, ఆర్.సాయిప్రసన్న(ఆదిలాబాద్)తృతీయ, డిస్క్‌త్రో డి.లిఖిత(కరీంనగర్)ప్రథమ, డి.అఖిల(మహబూబ్‌నగర్)ద్వితీయ, 800 మీటర్ల పరుగుపందెంలో టి.గౌతమి(మహబూబ్‌నగర్)ప్రథమ, ఎం.విజయలక్ష్మి(ఆదిలాబాద్)ద్వితీయ, 200 మీటర్ల పరుగుపందెంలో బి.నిహారిక(మహబూబ్‌నగర్)ప్రథమ, వి.మనుషా(ఆదిలాబాద్)ద్వితీయ, షాట్‌ఫుట్‌లో కె.పవిత్ర(మెదక్)ప్రథమ, మహేశ్వరి(మహబూబ్‌నగర్)ద్వితీయ, యు.శిరిషా(ఆదిలాబాద్)తృతీయ, ట్రిపుల్ జంప్‌లో జె.రవళి(మెదక్)ప్రథమ, మహేశ్వరి(మహబూబ్‌నగర్)ద్వితీయ, ఆర్.రాజేశ్వరి(ఆదిలాబాద్)తృతీయ, హైజంప్‌లో ఆర్.లక్ష్మిభార్గవి(నల్గొండ) ప్రథమ, 100 మీటర్ల హాడిల్స్‌లో యు.స్వర్ణలత (మెదక్) ప్రథమ, అయిదు కిలోమీటర్ల పరుగుపందెంలో డి.అఖిల (మహబూబ్‌నగర్) ప్రథమ స్థానం సాధించినట్టు చెప్పారు.

## అండర్-14 బాలుర విభాగంలో..

షాట్‌పుట్‌లో విద్వాన్ సింగ్(మెదక్)ప్రథమ, ప్రశాంత్‌నాయక్(మహబూబ్‌నగర్)ద్వితీయ, నిరూధ్(వరంగల్)తృతీయ, 600 మీటర్ల పరుగుపందెంలో ప్రశాంత్‌నాయక్(మహబూబ్‌నగర్)ప్రథమ, టి.దుర్గాకార్తీక్(ఆదిలాబాద్)ద్వితీయ, శాంతికిరణ్(మెదక్)తృతీయ, 200 మీటర్ల పరుగుపందెంలో ఎస్.శ్రీనివాస్(రంగారెడ్డి)ప్రథమ, టి.హేమంత్(నల్గొండ) ద్వితీయ, దినేష్(కరీంనగర్)తృతీయ, 80 మీటర్ల పరుగుపందెంలో చంటి (మహబూబ్‌నగర్)ప్రథమ, తేజ అక్షయ్(రంగారెడ్డి)ద్వితీయ, సాయితేజ(వరంగల్)తృతీయ, హైజంప్‌లో ఎస్.శ్రీనివాస్(రంగారెడ్డి)ప్రథమ, చింటూ (మహబూబ్‌నగర్)ద్వితీయ, దుర్గా కార్తీక్(ఆదిలాబాద్) తృతీయ, డిస్క్‌త్రోలో ఆర్.ప్రశాంత్‌నాయక్ (మహబూబ్‌నగర్)ప్రథమ, విద్వాన్‌సింగ్(మెదక్)ద్వితీయ, నైరుథ్(వరంగల్)తృతీయ, లాంగ్‌జంప్‌లో దుర్గాకార్తీక్(ఆదిలాబాద్) ప్రథమ, తేజ అక్షయ్(రంగారెడ్డి)ద్వితీయ, హేమంత్ (నలొండ)తృతీయ స్థానం సాధించినట్టు వివరించారు.

## అండర్-17 బాలుర విభాగంలో..

షాట్‌ఫుట్‌లో శివ ప్రసాద్‌రెడ్డి(మహబూబ్‌నగర్)ప్రథమ, సిద్దార్థరెడ్డి(నిజామాబాద్)ద్వితీయ, ఆశీష్ మోనో(వరంగల్)తృతీయ, ట్రిపుల్ జంప్‌లో కె.బాలాజీ(రంగారెడ్డి)ప్రథమ, దత్తు(నిజామాబాద్)ద్వితీయ, అజేయ్(మెదక్) తృతీయ, 800 మీటర్ల పరుగుపందెంలో పి.కార్తీక్(మెదక్) ప్రథమ, బి.దేవేందర్(వరంగల్)ద్వితీయ, వినిత్‌కుమార్(ఆదిలాబాద్)తృతీయ, శ్రీకాంత్(రంగారెడ్డి) నాలుగో స్థానం, హైజంప్‌లో పి.అనిల్‌కుమార్(ఆదిలాబాద్)ప్రథమ, ఎం.జగపతి నాయక్(మహబూబ్‌నగర్)ద్వితీయ, 100 మీటర్ల పరుగుపందెంలో దినేష్(మహబూబ్‌నగర్)ప్రథమ, ఎల్.ఈశ్వర్(వరంగల్)ద్వితీయ, ఎస్.దత్తు(నిజామాబాద్)తృతీయ, మూడు కిలోమీటర్ల పరుగుపందెంలో కుమార్ శంకర్(రంగారెడ్డి)ప్రథమ, జి.అఖిల్(వరంగల్)ద్వితీయ, ఎం.జగపతినాయక్(మహబూబ్‌నగర్)తృతీయ, లాంగ్‌జంప్‌లో ఎస్.దత్తు(నిజామాబాద్)ప్రథమ, ఎం.కృష్ణ(నల్గొండ)ద్వితీయ, భాయ్‌ఖాన్(రంగారెడ్డి)తృతీయ, అయిదు కిలోమీటర్ల నడకలో ఎం.నితీష్(వరంగల్)ప్రథమ, డి.అజేయ్(రంగారెడ్డి)ద్వితీయ, డిస్క్‌త్రోలో కె.శివప్రసాద్‌రెడ్డి(మహబూబ్‌నగర్)ప్రథమ, ఆశీష్(వరంగల్)ద్వితీయ, బి.సిద్దార్థ(నిజామాబాద్)తృతీయ స్థానం సాధించినట్టు చెప్పారు.

## అండర్-17 బాలికల విభాగంలో..

షాట్‌ఫుట్‌లో శ్రుతి(మెదక్)ప్రథమ, నిఖిత(మహబూబ్‌నగర్)ద్వితీయ, పి.నవ్య(ఆదిలాబాద్)తృతీయ, 800 మీటర్ల పరుగుపందెంలో రిషిత(కరీంనగర్)ప్రథమ, ఎం.కళ్యాణి(నల్గొండ)ద్వితీయ, భవ్యసాయి(రంగారెడ్డి)తృతీయ, 200 మీటర్ల పరుగుపందెంలో రక్షిత(రంగారెడ్డి) ప్రథమ, వి.వైష్ణవి(కరీంనగర్)ద్వితీయ, కె.మనిషా(ఆదిలాబాద్)తృతీయ, జావెలిల్‌త్రోలో పి.నిఖిత(మహబూబ్‌నగర్)ప్రథమ, ఆర్.శిరిషా(ఆదిలాబాద్)ద్వితీయ, హైజంప్ ఎం.కళ్యాణి(నల్గొండ)ప్రథమ, కె.ప్రణతి(రంగారెడ్డి)ద్వితీయ, మూడువేల పరుగుపందెంలో ఎస్.పూజ (మహబూబ్‌నగర్) ప్రథమ, ఎస్.శ్రీనిత్య(మెదక్)ద్వితీయ, యు.నేహారిక(ఆదిలాబాద్)తృతీయ, అయిదు కిలోమీటర్ల నడకలో ఎం.స్వాతిక(మహబూబ్‌నగర్)ప్రథమ, మూడు కిలోమీటర్ల పరుగుపందెంలో బి.రిషిత(మెదక్)ప్రథమ, లాంగ్‌జంప్‌లో కె.ప్రగతి(మెదక్)ప్రథమ, రిక్షిత(రంగారెడ్డి)ద్వితీయ, ఎ.రిక్షిత (కరీంనగర్)తృతీయ స్థానం సాధించినట్టు వివరించారు.



పోటీలను తిలకిస్తున్న విద్యాలయం విద్యార్థులు

## అండర్-14 బాలికల విభాగంలో..

లాంగ్‌జంప్‌లో బి.మేఘలత(మెదక్)ప్రథమ, పి.పుజిత(వరంగల్)ద్వితీయ, జె.మెఘన(నల్గొండ)తృతీయ, 600 మీటర్ల పరుగుపందెంలో ఎస్.వైశాలి(కరీంనగర్)ప్రథమ, పి.లావణ్య(మెదక్)ద్వితీయ, పూజిత(వరంగల్)తృతీయ, 200 మీటర్ల పరుగుపందెంలో మేఘలత(మెదక్)ప్రథమ, జె.మేఘన(నల్గొండ)ద్వితీయ, బిందుశ్రీ(రంగారెడ్డి)తృతీయ, 80మీటర్ల పరుగుపందెంలో అక్షయవాహిణి(మెదక్)ప్రథమ, వైశాలి(కరీంనగర్)ద్వితీయ, హైజంప్‌లో అక్షయ వాహిణి(మెదక్)ప్రథమ, జి.కిరణ్మయి(వరంగల్)ద్వితీయ, డిస్క్‌త్రో జి.కిరణ్మయి(వరంగల్)ప్రథమ, సీహెచ్.దీపిక(కరీంనగర్), జి.అక్షర(ఆదిలాబాద్)తృతీయ స్థానం సాధించారు.

ఓపెన్ బాలిక విభాగం మూడువేల మీటర్ల పరుగుపందెంలో వై.స్నేహా(మెదక్)ప్రథమ, ఎస్.పూజ(మహబూబ్‌నగర్)ద్వితీయ, ఎన్.శ్రీనిత్యా(మెదక్)తృతీయ, 100 మీటర్ల హాడిల్స్‌లో కె.ప్రగతి(మెదక్)ప్రథమ స్థానం సాధించింది.

ఓపెన్ బాలుర విభాగంలో అయిదువేల మీటర్ల పరుగుపందెంలో కుమార్‌శంకర్(రంగారెడ్డి)ప్రథమ, ఎ.కార్తీక్(ఆదిలాబాద్) ద్వితీయ, వి.చంద్రశేఖర్(రంగారెడ్డి)తృతీయ స్థానం సాధించినట్టు ప్రిన్సిపల్, పీఈటీలు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులకు ప్రశంసపత్రంతో పాటు, బహుమతులను అందజేశామన్నారు.



మాట్లాడుతున్న పాలనాధికారి చంపాలాల్



హాజరైన అధికారులు

# పంటకోత ప్రయోగం చేపట్టాలి

## జిల్లా పాలనాధికారి చంపాలాల్

**ఆసిఫాబాద్, న్యూస్‌టుడే:** జిల్లాలో సకాలంలో పంటల వివరాలు నమోదు చేసి పంటకోత ప్రయోగాలకు సహకరించాలని జిల్లా పాలనాధికారి చంపాలాల్ కోరారు. మంగళవారం స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిర్‌లో ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ఖరీఫ్-2017 పంటకోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ రెవెన్యూ అధికారులు సర్వే నంబర్ ఆధారంగా పంటలు నమోదు చేసి పంటల దిగుబడి ప్రయోగాలకు సిద్ధంగా ఉంచాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారులు, మండల ఏఎస్‌ఓలు, తహసీల్దార్లు, ఆర్డీఓలు సరైన పర్యవేక్షణ చేసి పంటదిగుబడుల వివరాలను పంపించాలన్నారు. ముఖ్య ప్రణాళిక అధికారి కృష్ణయ్య మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలను సకాలంలో నిర్వహించి వివరాలను జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని తెలిపారు. దీని ద్వారా బీమా చేసుకున్న రైతులకు పంటదిగుబడి ఆధారంగా నష్టపరిహారం నిర్ణయించబడుతుందన్నారు. దీనిని జాగ్రత్తగా చేపట్టాలని పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ నెల 24న ఆసిఫాబాద్ డివిజన్ స్థాయిలో, 26న కాగజ్‌నగర్ డివిజన్‌స్థాయిలో అధికారులకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త పాలనాధికారి అశోక్ కుమార్, ఆర్‌డీఓ రమేశ్ , జిల్లా వ్యవసాయ అధికారి అభిమన్యుడు తదితరులు పాల్గొన్నారు.

# కడుపు నొప్పి, వాంతులతో గిరి బాలుడు మృతి

**నార్నూర్, న్యూస్‌టుడే :** మండలంలోని కొత్తపల్లి(హెచ్) తండాకు చెందిన రాఠోడ్ విజేస్ - సాగర్ దంపతుల కుమారుడు నితీష్(2) మంగళవారం తెల్లవారుజామున కడుపునొప్పి, వాంతులు వీరేచనాలతో మృతి చెందినట్లు తల్లిదండ్రులు తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున నితీష్ నిద్ర నుంచి లేవగా కడుపు నొప్పి విపరీతంగా ఉందని అన్నారు. రెండు మూడుసార్లు వాంతులు వీరేచనాలు అయ్యాయన్నారు. చికిత్స నిమిత్తం నార్నూర్ పీహెచ్‌సీకి తీసుకొని వెళ్లారు. అక్కడ వైద్య సిబ్బంది బాలుడిని పరిశీలించి ఉట్నూర్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. ఉట్నూర్ తరలిస్తుండగా దారి మధ్యలోనే నితీష్ మృత్యువాత పడ్డారని వారు పేర్కొన్నారు.



మృత్యువాత పడిన బాలుడు

# ట్రాక్టర్ బోల్తా పడి యువకుడి మృతి

**బెల్లంపల్లి గ్రామీణం:** బెల్లంపల్లి మండలం సుబ్బారావుపల్లె గ్రామంలో మంగళవారం సాయంత్రం వ్యవసాయపొలంలో దమ్ము చేస్తున్న ట్రాక్టరు బోల్తా పడటంతో షేక్ బాజీ (25) అనే యువకుడు మృతిచెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా చందర్లపాడు మండలకేంద్రానికి చెందిన షేక్‌బాజీ ఉపాధి నిమిత్తం సుబ్బారావుపల్లెగ్రామానికి వచ్చి వ్యవసాయం చేస్తున్నాడు. గ్రామశివారుల్లో పత్తిని సాగుచేస్తున్నట్లు తెలిపారు. స్వగ్రామం నుంచి వచ్చిన బాజీ కూలీల కోసం నాట్లు వేస్తున్న పొలంలోకి వచ్చినట్లు తెలిపారు. ట్రాక్టరు దిగబడటంతో తీయడానికి ప్రయత్నించగా ప్రమాదవశాత్తు ట్రాక్టరు బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. షేక్‌బాజీ మంగళవారమే స్వగ్రామం నుంచి వచ్చినట్లు స్థానికులు పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని తాళ్లగురిజాల ఏఎస్సై అన్వేని మల్లేశం పరిశీలించారు. మృతదేహాన్ని బెల్లంపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నట్లు బంధువులు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

# ప్రణాళికతో ప్రయోజనం

## జిల్లా పాలనాధికారి ఆర్వీ కర్ణన్

**మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే:** ఉన్నత విద్య చదువుతున్న క్రమంలోనే ప్రతి విద్యార్థి భవిష్యత్తుపై ప్రణాళికలు రూపొందించుకుంటే మంచి ప్రయోజనాలు కలుగుతాయని జిల్లా పాలనాధికారి ఆర్వీ కర్ణన్ పేర్కొన్నారు. స్థానిక ఎఫ్‌సీఏ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో సివిల్స్, గ్రూప్స్, పోటీపరీక్షలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిత్యం దినపత్రికలు చదవటం వల్ల అనేక అంశాలపై పట్టు సాధించవచ్చని, అంతర్జాలంలో మరింత సమాచారం అందుబాటులో ఉంటుందని వీటిని ఎప్పటికప్పుడు అలవరుచుకోవాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావం, లక్ష్యంతో ముందుకుసాగాలని ఆయన పేర్కొన్నారు. అనంతరం నిర్మల్ అసిస్టెంట్ కలెక్టర్ క్రాంతి పరీక్షల విధివిధానాలు, ప్రశ్నపత్రాల సరళి, ప్రణాళికల తీరును అభ్యర్థులకు సూచించారు. అభ్యర్థులు అడిగిన పలు సందేహాలను ఆమె నివృత్తి చేశారు. కార్యక్రమంలో డీఐఈవో బీణారాణి, మంచిర్యాల ప్రభుత్వ, మహిళ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్ నారాయణరెడ్డి, రచన, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలను ఆవిష్కరించిన జిల్లా పాలనాధికారి ఆర్వీ కర్ణన్

### గణపతి మట్టి విగ్రహాలను వాడాలి

**మంచిర్యాల పట్టణం:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు వినాయక చవితికి గణపతి మట్టి విగ్రహాలను వాడాలని జిల్లా పాలనాధికారి ఆర్వీ కర్ణన్ అన్నారు. అభినవ స్వచ్ఛంద సంస్థ రూపొందించిన మట్టి గణతులను మంగళవారం మంచిర్యాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలను వాడవద్దని కోరారు. అనంతరం స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మాట్లాడుతూ మంచిర్యాల, బెల్లంపల్లిలో ఈ నెల 24న 600 మట్టి విగ్రహాలను, హరిత మొక్కలను పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి ప్రభాకర్, యువజన సంక్షేమ శాఖ జిల్లా అధికారులు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌కుమార్, పర్సనాలిటి డెవలప్‌మెంట్ సెంటర్ వ్యవస్థాపకులు డాక్టర్ కవిత హజం, స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు ప్రవీన్, చరణ్, రాజ్యలక్ష్మి, సాగరిక తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న పాలనాధికారి ఆర్వీ కర్ణన్, చిత్రంలో నిర్మల్ అసిస్టెంట్ కలెక్టర్ క్రాంతి

# ఆలోచన.. ఆచరణ.. ఆవిష్కరణ

## బాల మేధావులు భళా..! క్లస్టర్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన
## ప్రతిభ కనబరచిన వివిధ జిల్లాల నవోదయ విద్యార్థులు

కాగజ్‌నగర్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రంలోని వివిధ జిల్లాలోని విద్యాలయాల విద్యార్థులు చదువుతో పాటు, శాస్త్ర సాంకేతిక రంగాల్లోనూ రాణిస్తూ చిరుదివ్వెలుగా వెలుగొందుతున్నారు. సోమవారం కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో తెలంగాణ 28వ క్లస్టర్ స్థాయి అథ్లెటిక్స్, సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్(కాగజ్‌నగర్), నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాలోని విద్యాలయాల్లోని విద్యార్థులకు 'దేశ సమగ్రాభివృద్ధి సరికొత్త ఆవిష్కరణ-అంశం'పై సైన్సు ప్రదర్శన నిర్వహించారు. సైన్స్, గణితం, సాంఘిక శాస్త్రం, కంప్యూటర్, తదితర అంశాలపై ప్రతి ఒక్క విద్యాలయం విద్యార్థులు ఎనిమిది ప్రాజెక్టుల నమునాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు పలువురి మన్నలను పొందాయి. పలు జిల్లాలోని విద్యాలయం విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ప్రదర్శనలోని పలు ప్రాజెక్టు నమునాలపై 'న్యూస్‌టుడే' కథనం..



### వ్యర్థాలకు అర్థం

**- శ్రీసత్య, 8వ తరగతి, ఆదిలాబాద్(కాగజ్‌నగర్)**

కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ విద్యాలయంలో చదువుతున్న ఈ విద్యార్థిని వ్యర్థాలకు కొత్త అర్థాన్ని చెబుతోంది. సాధారణంగా ఇంట్లో పగిలిన అద్దాలు, ఇతర నిరుపయోగమైన వస్తువులన్నీ చెత్తకుండీలో వేస్తుంటాం. కాని ఈ విద్యార్థిని వ్యర్థాలన్నింటిని వినియోగించి, అలంకరణ వస్తువులను తయారీ చేసి పలువురి మన్నలను పొందుతోంది. వృథా వస్తువులతో తయారు చేసి, హ్యాండ్‌బ్యాగులు, కాగితం సంచులు, ఇంట్లో టీవీ, టేబుల్‌పై ఉంచేందుకు అలంకరణ వస్తువులు, తెల్లకాగితాలతో పూలు తయారు చేసి, వాటికి రంగులు దిద్దింది.



సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న జిల్లా పాలనాధికారి చంపాలాల్



### భూప్రకంపనల నుంచి విముక్తి

**- రస్మిత, 10వ తరగతి, రంగారెడ్డి**

రంగారెడ్డి విద్యాలయంలో చదువుతున్న ఈ విద్యార్థిని 'స్మార్ట్ పార్కింగ్ సోల్యూషన్ విత్ ఎర్త్ క్వేక్ రెసిస్టేంట్' ప్రాజెక్టును రూపొందించింది. తక్కువగా ఉండే స్థలం, భవనాల నిర్మాణాలు, అందుల్లోనూ తక్కువ స్థలంలో పార్కింగ్, భూప్రకంపనల నుంచి తప్పించుకునేందుకు వినియోగించాల్సిన అంశాలతో ప్రాజెక్టును తయారు చేసింది. పలువురు ఈ ప్రాజెక్టును తిలకించి, విద్యార్థిని మేధాశక్తిని అభినందించారు.

### సౌర విద్యుత్తు కాంతులు

**- సృజన్, 10వ తరగతి, ఖమ్మం**

ఖమ్మ జిల్లా విద్యాలయంలో చదువుతున్న ఈ విద్యార్థి సోలార్‌తో విద్యుత్తు కాంతులు అంటూ ప్రాజెక్టు రూపొందించింది. సోలార్ ద్వారా విద్యుత్తు వినియోగించడం వల్ల తక్కువ ఖర్చుతో అనేక ప్రయోజనాలున్నాయి. సౌర విద్యుత్తు ద్వారా ఫ్యాన్లు, విద్యుత్తు దీపాలను కూడా వెలిగించుకోవచ్చునంటూ ఈ విద్యార్థిని తన ప్రాజెక్టు నమునాల రూపొందించింది. ఎలా వినియోగించుకోవాలి, వాటి విధానాలను అట్టముక్కలతో తయారు చేసింది. వాటిని తిలకించిన పలువురు ఈ విద్యార్థిని అభినందించారు.



### దేశంలో జరిగిన అభివృద్ధి

**- సిద్ధు, 10వ తరగతి, మహబూబ్‌నగర్**

మహబూబ్‌నగర్ జిల్లా విద్యాలయం విద్యార్థి దేశం ప్రగతిపై ప్రాజెక్టును రూపొందించి ప్రదర్శించారు. దేశం ఏ రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్మిస్తున్న భారీ ప్రాజెక్టులు, వన్యప్రాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలు, తదితర వాటిపై సోషల్ ప్రాజెక్టును రూపొందించారు. అట్టముక్కలతో వాటిని తయారు చేసి, ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలతో ఓ పుస్తక రూపంలో తయారు చేశారు. అతి చిన్న వయస్సులో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో జరుగుతున్న అభివృద్ధి, తదితర అంశాలపై మంచిపట్టు సాధించిన ఈ విద్యార్థిని పలువురి మన్నలను పొందారు.



### హైడ్రోజన్‌తో రైలు

**- సంజన, 11వ తరగతి, మెదక్**

మెదక్ జిల్లా విద్యాలయంలో 11వ తరగతి చదువుతున్న ఈ విద్యార్థిని హైడ్రోజన్‌తో రైలు నడపవచ్చునంటూ ప్రాజెక్టును తయారు చేసింది. ఇందుకు సంబంధించిన నమునా ప్రదర్శించింది. హైడ్రోజన్‌తో రైలు నడపడం వల్ల పర్యావరణ కాలుష్యంతో పాటు, ప్రయాణికులకు రైలులోనే శుద్ధ నీరు కూడా అందించవచ్చునంటుంది. వ్యయం కూడా తక్కువ. అట్టలతో ప్రత్యేకంగా రైలును తయారు చేసింది. ఈ ప్రాజెక్టును పరిశీలించిన జిల్లా పాలనాధికారి చంపాలాల్ ఈ విద్యార్థిని ఈ సందర్భంగా అభినందించారు.





# శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలి

## ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

**ఆసిఫాబాద్, న్యూస్‌టుడే:** శాంతియుత వాతారణంలో గణేష్, బక్రీద్ పండుగలను నిర్వహించేలా ప్రజలంతా పోలీసులకు సహకరించాలని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రేమలగార్డెన్‌లో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పండగల నిర్వహణ ఇతరులు ఆచరించేలా జరుపుకోవాలన్నారు. కానీ శాంతి భద్రతలకు భంగం వాటిల్లేలా ప్రవర్తించరాదన్నారు. గణేష్ ఉత్సవాల్లో ముస్లింలు, బక్రీద్ పండుగలో హిందువులు పరస్పరం సహకరించుకోవాలన్నారు. అప్పుడే శాంతియుత వాతారణానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. మంచి వాతావరణంలో పండగలు జరుపుకొని జిల్లాను రాష్ట్రానికి ఆదర్శంగా ఉంచాలన్నారు. వేడుకల కోసం నాలుగు అంచెల భద్రత ఏర్పాటు చేస్తామన్నారు. గణేష్ నిమజ్జనం రోజు ప్రతీ ఒక్కరు ఒక సమయాన్ని ఎంచుకొని దాని ప్రకారం విగ్రహాలను ఎత్తి నీటిలో నిమజ్జనం చేసేలా నడుచుకోవాలన్నారు. ప్రతి గణేశ్ మండలి వారు మొదట ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. అన్ని పోలీస్‌స్టేషన్లలో ముద్రిత పత్రాలు అందుబాటులో ఉంచామన్నారు. వాటిలో పూర్తి వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే విద్యుత్తు కోసం కూడా అనుమతి తీసుకోవాలన్నారు. భారత అత్యున్నత న్యాయం స్థానం తీర్పు ప్రకారం గణేశ్ నిమజ్జన శోభాయాత్ర సమయంలో డీజేలు నిషేదం అన్నారు. వాటి స్థానంలో ఇతర సౌండ్ సిస్టంలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. బక్రీద్ పండగ రోజున ముస్లింలు గోవద చేయరాదన్నారు. కట్టం నిషేదించిన నేపథ్యంలో దానికి అందరూ కట్టుబడి ఉండాలన్నారు. ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. గోవులను తీసుకెళుతున్న వాహనాలను కూడా ఎవరూ అడ్డుకోవదన్నారు. వివరాలు తమ దృష్టికి తీసుకొస్తే పోలీసులే చర్యలు తీసుకుంటారన్నారు. పట్టణంలో రోడ్లు బాగు చేయించాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని, నిమజ్జన సమయంలో వాగుల వద్ద గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయించాలని, క్రేన్‌లను అందుబాటులో ఉంచేలా చూడాలన్నారు. నిమజ్జనానికి మూడు నాలుగు రోజుల ముందే మద్యం దుకాణాలు, బెల్టు దుకాణాలు మూసి ఉండేలా చూడాలని కోరారు. కొందరు ముస్లిం సోదరులు నిమజ్జనం రోజు తాగునీరు ఏర్పాటు చేస్తామన్నారు. అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహిస్తామన్నారు. స్పందించిన ఎస్పీ సమావేశంలో వచ్చిన సూచనలపై మళ్లీ పాలనాధికారి, అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి అమలు చేసేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ హబీబ్‌ఖాన్, సీఐలు, ఎస్ఐలు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గంధం శ్రీనివాస్, విద్యుత్తు శాఖ ఎస్ఈ బికం సింగ్, ఏఈ ఫెరోజ్‌ఖాన్, గ్రామ పంచాయతి కార్యదర్శి రుషి, శాంతికమిటీ సభ్యులు మారుతి, సతీష్‌బాబు, విశాల్, టి.అశోక్, గాదెవేణి మల్లేష్, తాటి ప్రసాద్, ఫయ్యాజ్, రఫీక్ జువాజి, గౌస్, మసూద్ అలీ, గణేశ్ మండళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

# ఆసిఫాబాద్

## నేడు మండల కేంద్రానికి జేసీ, ఆర్డీవో రాక

**లింగాపూర్(సిర్పూర్(యు)), న్యూస్‌టుడే :** నేడు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించతలపెట్టిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి జిల్లా సంయుక్త పాలనాధికారి అశోక్‌కుమార్, ఆర్డీవో సురేష్ రానున్నట్లు తహసీల్దార్ బాబుసింగ్ తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల విభాగానికి ఆయా మండలాల నుంచి లబ్ధిదారులు అధిక సంఖ్యలో వస్తున్నందున ఫిర్యాదులు సేకరించడంలో ఆలస్యమవుతున్నందున అధికారులు ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల విభాగానికి శ్రీకారం చుట్టి ప్రతి మండలంలో రైతుల భూ సమస్యలు, పట్టాపాసుపుస్తకాల సవరణ, పేర్ల మార్పిడి తదితర ఇబ్బందులను తక్షణమే పరిష్కారిస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కోరారు.

## 'నేటి నిరసన కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలి'

**సిర్పూర్(యు), న్యూస్‌టుడే :** ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టానికి విరుద్ధంగా గిరిజనేతరులకు పహాణీల పంపిణీకి వ్యతిరేకంగా నేడు జైనూర్ మార్కెట్ యార్డులో ఉదయం పది గంటలకు నిర్వహించతలపెట్టిన నిరసన కార్యక్రమానికి ఆదివాసీలందరూ హాజరవ్వాలని తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి పెందోర్ శంకర్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ నేడు జిల్లా పాలనాధికారి, ప్రజా ప్రతినిధులు బహిరంగ కార్యక్రమాలు నిర్వహిస్తూ పహాణీలు పంపిణీ చేయడం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. గిరిజనేతరులకు పహాణీలు పంపిణీ చేసిన పాలనాధికారి, తహసీల్దార్, ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులు పెట్టి హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. పంపిణీ చేసిన పహాణీలను వెంటనే రద్దు చేయాలని డిమాండు చేశారు. ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, బాలల హక్కుల పరిరక్షణ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు కబీర్‌దాస్, ఆదివాసీ సంక్షేమ పరిషత్తు మండలాధ్యక్షులు భూపతి, భీమన్న తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీ రుణాల కోసం అభ్యర్థి ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తున్న అధికారులు

## ఎస్సీ రుణాల మంజూరుకు మౌఖిక పరీక్ష

**తిర్యాణి, న్యూస్‌టుడే :** తిర్యాణి పంచాయతీలో మంగళవారం ఎస్సీ రుణాల మంజూరు కోసం అభ్యర్థుల నుంచి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. వారి ఎంపిక చేసుకున్న పనుల వివరాలను ఇన్‌ఛార్జి ఎంపీడీవో రఫీక్ అహ్మద్ సమాచారం తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ తిర్యాణి తెలంగాణ గ్రామీణ బ్యాంకుకు ఆరు యూనిట్లు మంజూరైనట్లు, ఈ రోజే సూంగపూర్, గడలపల్లి, గంభీరావుపేట గ్రామాల్లో ఎస్సీ అభ్యర్థుల నుంచి మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఆరు యూనిట్లకు 14 మంది దరఖాస్తులు చేసుకొని మౌఖిక పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో తిర్యాణి సర్పంచి ఆత్రం రత్నుబాయి, పశువైద్యాధికారి ప్రశాంత్, ఏపీఎం సదానందం, పంచాయతీ కార్యదర్శి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన రామాయణ పారాయణం

**జైనూరు:** శ్రావణ మాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయం ప్రాంగణంలో గత నెల రోజులుగా కొనసాగిన రామాయణ పారాయణం సోమవారం రాత్రి ముగిసింది. చివరి రోజు గైనీ మహరాజ్ ప్రజలనుద్దేశించి భక్తి ప్రవచనలు చేశారు. లోకభిరాముని విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు గిత్తె పాండురంగ్, శేఖర్, సదాశివ్, దయానంద్ తదితరులు పాల్గొన్నారు.



భక్తిప్రవచనలు చేస్తున్న గైనీ మహరాజ్

## పశువుల సంతలో క్రయవిక్రయాలు నిలిపివేత

**జైనూరు, న్యూస్‌టుడే :** జైనూరు మండల కేంద్రంలో ప్రతి గురువారం జరిగే పశువుల సంతలో రెండు వారాలు క్రయవిక్రయాలు నిలిపివేస్తున్నట్లు గ్రామపంచాయతీ ఈఓ మధుకర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గణేష్ నవరాత్రి ఉత్సవాలు, బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఈ నెల 24, 31 పశుసంత నిలిపివేసి తిరిగి యథావిధిగా సంత నిర్వహిస్తామన్నారు.

# ఇరుకు గదులే దిక్కు

**ప్రారంభం కాని పశు వైద్యశాల భవనం**

**పట్టించుకోని అధికారులు**

**ఇబ్బందులు పడుతున్న రైతులు, సిబ్బంది**

సిర్పూర్(యు),న్యూస్‌టుడే

**మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన పశు వైద్యశాల భవనం గత కొన్నేళ్లుగా ప్రారంభానికి నోచుకోక అలంకారప్రాయంగా మారి పిచ్చిమొక్కలతో పాత భవనంలా దర్శనమిస్తోంది. పశు వైద్యశాలకు సొంత భవనం లేకపోవడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసి కొత్త భవనం నిర్మించినా కొన్నేళ్లుగా పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే ఇరుకు గదిలో వైద్యులు సేవలందించాల్సిన పరిస్థితి.**





ప్రారంభం కాని కొత్త పశువైద్యశాల భవనం

మండల కేంద్రంలో రూ. 14.65 లక్షలతో నిర్మించిన భవనం నేటికి ప్రారంభించకపోవడంతో అలంకార ప్రాయంగా కనిపిస్తోంది. ప్రజల సొమ్మును మట్టిపాలు చేస్తున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనం నిర్మించి ఏళ్లు గడుస్తున్నా అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు మండి పడుతున్నారు. మండల కేంద్రంలో 90 శాతం మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. మూగ జీవులకు ఏమైనా ప్రమాదం జరిగిందంటే పశువులకు వైద్యం అందించడానికి అక్కడ కనీస మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు మందుల దుకాణాల నుంచి కొనుగోలు చేసే పరిస్థితి నెలకొంది. రైతులకు వ్యవసాయంలో ఎంతగానో ఉపయోగపడే మూగజీవులకు కనీస వైద్యం అందించాలని రైతులు కోరుతున్నారు. కొత్త భవనాన్ని ప్రారంభిస్తే అక్కడ సరిపడ మందులు నిల్వ ఉంచుకోవడానికి, మూగజీవులకు మెరుగైన వైద్యం అందించే వీలుంటుందని రైతులు కోరుకుంటున్నారు. అధికారులు స్పందించి కొత్తగా నిర్మించిన పశు వైద్యశాలను సకాలంలో ప్రారంభించి మెరుగైన వైద్యం అందించడానికి అధికారులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.



పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రస్తుతం కొనసాగుతున్న పశువైద్యశాల



### పశు వైద్యశాలను ప్రారంభించాలి

**- సర్పంచి ఆత్రం ఓంప్రకాష్**

మండల కేంద్రంలో అధిక శాతం రైతులు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రైతులకు సంబంధించిన పశువులకు ప్రమాదం జరిగితే పశు వైద్యశాల ఎంతోగానో అవసరం. గత కొన్నేళ్లుగా అలంకార ప్రాయంగా ఉన్న నూతన పశు వైద్యశాలను సకాలంలో ప్రారంభించి రైతులకు సేవలందించాలి.



### మూగజీవుల ప్రాణాలు కాపాడండి

**- పెందోర్ శంకర్, రైతు**

మూగజీవులకు చిన్నపాటి ప్రమాదం జరిగిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. రైతులకు వ్యవసాయంలో ఎంతగానో ఉపయోగపడే పశువులకు పూర్తిస్థాయి వైద్యం అందించి మూగజీవుల ప్రాణాలు కాపాడుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. పశు వైద్యానికి సంబంధించిన సామగ్రిని భద్రపరచడానికి నూతన భవనం ఎంతగానో ఉపయోగపడుతుంది. వైద్య సిబ్బందితో పాటు రైతులకు సౌకర్యంగా ఉంటుంది. అధికారులు స్పందించి నూతన భవనాన్ని ప్రారంభించాలి.

## ఆదివాసీ చట్టాలను కాలరాస్తే సహించేది లేదు

**ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మబొజ్జు**

**జైనూరు, న్యూస్‌టుడే :** రాజ్యాంగబద్ధంగా షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీల సంక్షేమం కోసం అమలు చేసిన చట్టాలను కాలరాస్తే సహించేది లేదని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. మంగళవారం ఆయన జైనూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీలోని జైనూరు, సిర్పూరు(యు), లింగాపూర్, ఉట్నూరు, నార్నూర్, ఇంద్రవెల్లి, గాదిగూడ మండలాల్లో 1/70, పీసా చట్టం వంటి చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరులకు పహాణీ పత్రాలు ఇవ్వరాదన్నారు. స్వార్థరాజకీయ లబ్ధి కోసం గిరిజనులు, గిరిజనేతరుల మధ్య చిచ్చుపెట్టేందుకు ఎమ్మెల్సీ పురాణం సతీష్, ఎమ్మెల్యే కోవలక్ష్మి ప్రయత్నం చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఆసిఫాబాద్ జిల్లా పాలనాధికారి చంపాలాల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ పురాణం సతీష్ వైఖరికి నిరసనగా ఈ నెల 24న కుమురంభీం జిల్లా జైనూరు మండల కేంద్రంలో ఉమ్మడి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున ఆదివాసీలు తరలి వచ్చి మహాధర్నా చేపడతామన్నారు. ఆదివాసీలపై తెలంగాణ ప్రభుత్వం అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరిని ప్రజల్లో తీసుకెళ్తామన్నారు. జైనూరు తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఆదివాసీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కనక భుజంగ్‌రావు, జిల్లాకార్యదర్శి విశ్వనాథ్‌రావు, తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి ఆత్రం శంకర్, ఆత్రం ఈశ్వర్, పెందూర్ శంకర్, ఉయిక చందు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు

## గిరిజన గ్రామాల్లో బొడగ పండగ

**జైనూరు:** మండలంలోని గిరిజన గ్రామాల్లో ప్రజలు మంగళవారం బొడుగ పండగను ఘనంగా జరుపుకొన్నారు. పొలాల అమావాస్య పండగతో శ్రావణమాసం ముగించడంతో మరుసటి రోజున గిరిజనులు బొడుగ పండగ నిర్వహించడం ఆనవాయితీ. కాగా రాత్రంతా భజన, కీర్తనలతో జాగరణ చేసిన గిరిజనులు వేకువజామునే జాగేయ్ మాతరి.. జాగేయ్ అంటూ ఇంటిల్లీపాధి.. పిల్లపాపలు.. పశుపక్ష్యాదలు సుఖసంతోషాలతో ఉండాలంటూ మర్రగోళ్లు చేత పట్టుకుని గ్రామశివారుకు తీసుకెళ్లారు. అక్కడ శివమార్కెయ్ దేవతకు నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంట సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ మొక్కుకున్నారు. అనంతరం గ్రామస్థులంతా కలిసి సామూహిక భోజనాలు ఆరగించారు.



శివ మార్కెయ్ దేవతకు నైవేద్యం సమర్పించేందుకు వెళ్తున్న గిరిజనులు

## ఘనంగా భవాని జాతర

**వాంకిడి, న్యూస్‌టుడే :** మండలంలోని సరాండి సమీపంలో గల భవాని గుట్టపై మంగళవారం భవాని జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉదయాన్నే భక్తులు గుట్టపైకి ఎక్కి భవాని మాతను దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు భక్తుల తాకిడి తగ్గలేదు. మండలంలోని వివిధ గ్రామాలతో పాటు ఆసిఫాబాద్, కెరమెరి మండలాల నుంచి భక్తులు తరళి వచ్చారు. గుట్ట కింది భాగంలో దుకాణలు, హోటళ్లు వెలిశాయి.

## 24న కాంప్లెక్స్ తెలుగు భాషా పండితుల శిక్షణ కార్యక్రమం

**సిర్పూరు(టి), న్యూస్‌టుడే :** నియోజక వర్గంలోని సిర్పూరు, కౌటాల, చింతలమానేపెల్లి, బెజ్జూర్ మండలాల్లోని తెలుగు భాషా భోధించే ఉపాధ్యాయులకు 24 తేదిన సిర్పూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక్క రోజు శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ మజర్ హుస్సేన్ మంగళవారం తెలిపారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కస్తూరిబా, గిరిజన ఆశ్రమోన్నత పాఠశాలలో తెలుగు భాషా బోధించే ఉపాధ్యాయులు ఉదయం 9.30కి హాజరు కావాలని సూచించారు.

# ఆసిఫాబాద్

## గణేష్ మండళ్లవారు విద్యుత్తు అనుమతి పొందాలి

**ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే:** జిల్లా కేంద్రంలోని గణేష్ మండళ్లవారు తమ మండపాల వద్ద విద్యుత్ సదుపాయం కోసం తగిన రుసుమును చెల్లించి కనెక్షన్లు పొందాలని విద్యుత్‌శాఖ పర్యవేక్షక ఇంజనీర్ బీకంసింగ్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. వినాయక మండళ్లవారు అక్రమంగా విద్యుత్‌ను వినియోగించకుండా కనెక్షన్లు పొందడంతో పాటు నాణ్యమైన సర్వీసు తీగెలను వాడి ప్రమాదాలకు తావులేకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. రూ.వెయ్యి వాట్స్ వరకు రూ.1406లు, 1500 వాట్స్ విద్యుత్తుకు రూ.2085, 200 వాట్స్ వరకు రూ.2745లు రుసుము చెల్లించి విద్యుత్‌ను వినియోగించాలన్నారు.

## విధిగా అనుమతి తీసుకోండి

**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే :** కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని పట్టణం, మండలాల్లోని గణేష్ ఉత్సవ మండపాల నిర్వహకులు విధిగా విద్యుత్తు సరఫరా నిమిత్తం అనుమతి తీసుకోవాలని డీఈ వాసుదేవ్, ఏడీఈ బాలకృష్ణ తెలిపారు. మండపాలకు తాత్కాలికంగా వినియోగించే విద్యుత్తు సరఫరా నిమిత్తం నాణ్యమైన ఎలక్ట్రికల్ తీగలను వినియోగించాలన్నారు. అక్రమంగా విద్యుత్తును వినియోగించే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్తు వినియోగానికి బట్టి డబ్బులు ముందుగానే చెల్లించాలన్నారు.

## 1న పింఛను విద్రోహ దినంగా పాటించాలి

**ఆసిఫాబాద్, న్యూస్‌టుడే:** కంట్రిబ్యూటరీ పింఛన్ అమలు చేసిన సెప్టెంబర్ 1న పింఛను విద్రోహ దినంగా పాటించాలని తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నేతలు పిలుపునిచ్చారు. మంగళవారం దీనికి సంబంధించిన గోడప్రతులను స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలు సంఘాల జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ కంట్రిబ్యూటరీ పింఛను అమలు చేసిన సెప్టెంబర్ 1వ తేదీన నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ కలెక్టరేట్ వద్ద ధర్నా చేయాలన్నారు. సీపీఎస్ విధానం అమలుతో రాష్ట్రంలో 1.20 లక్షల మంది ఉపాధ్యాయ, ఉద్యోగుల కుటుంబాల భద్రత ఆగమ్యగోచరంగా మారిందన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం తీర్పు, రాజ్యాంగ మౌలిక ధర్మాన్ని విస్మరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పింఛన్ జమలను స్టాక్ మార్కెట్ పరం చేసి కుటుంబాలకు సామాజిక భద్రత లేకుండా చేసిందన్నారు. పాత పింఛన్ విధానం పునరుద్ధరించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్నప్పటికీ నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. సీపీఎస్ అంతం కోసం అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు సంఘటితంగా పోరాటం చేయాలిని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెంటనే ఈ విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానం అమలు చేయాలన్నారు. అక్టోబర్‌లో పెద్ద ఎత్తున చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించబోతున్నట్లు పేర్కొన్నారు. సెప్టెంబర్ 1న నిర్వహించే పింఛన్ విద్రోహ దినంలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యం.ఆగాచారి, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.రమేశ్, టీఎస్పీఎస్టీటీయూ జిల్లా అధ్యక్షుడు యం.చరణ్‌దాస్, రాష్ట్ర సహ అధ్యక్షుడు జె.కేశవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తారాచంద్, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ఊషన్న, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి యం.రాజకమలాకర్‌రెడ్డి, నాయకులు హేమంత్ షిండె, టి.రమేశ్, కె.శంకర్, భీంరావు, శ్రీనివాస్, హెచ్‌ఎం ప్రమీలలు పాల్గొన్నారు.



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఆర్‌ఎంపీ వైద్యులు

## ఉచిత వైద్య శిబిరానికి స్పందన

**వాంకిడి:** మండల కేంద్రంలో తెరాస మండల అధ్యక్షుడు, ఆర్‌ఎంపీ, పీఎంపీ జిల్లా అధ్యక్షుడు అజయ్ జన్మదినం సందర్భంగా మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరానికి స్పందన లభించింది. ఈ సందర్భంగా మొదట కేకును కోసి పంచారు. అనంతరం పల్స్ క్రిటికల్ కేర్ మంచిర్యాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించగా, జనని వలంటరీ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రక్త దాన శిబిరంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ సభ్యులు పాల్గొని రక్త దానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్వర్, ఆర్‌ఎంపీ(, పీఎంపీ అధ్యక్షుడు వినోద్, మండలంలోని వైద్యులు, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న రెబ్బెన సీఐ మదన్‌లాల్

**రెబ్బెన, న్యూస్‌టుడే :** గ్రామాల్లోని అన్ని కులాలు, మతాల వారు సోదరభావంతో గణేష్, బక్రీద్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని రెబ్బెన సీఐ మదన్‌లాల్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. కులమతాలకతీతంగా మనోభావాలు దెబ్బతినకుండా పండుగను నిర్వహించి, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బాధ్యత వహించాలన్నారు. గణేష్ మండపాల నిర్వాహకులు తప్పని సరిగా నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి పెసరు వెంకటమ్మ, ఉప సర్పంచి బి.శ్రీధర్, నాయకులు కార్నాథం వెంకటేశం, మోడెం సుదర్శన్‌గౌడ్, చిరంజీవి గౌడ్, రామడుగుల శంకర్, రాపర్తి అశోక్, గంటుమేర, గజ్జెల సత్యనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, దేవాజీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

**తిర్యాణి:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని తిర్యాణి ఎస్‌ఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గణేష్ మండళ్ల నిర్వహకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా బాధ్యత వహించాలన్నారు. ఉత్సవాల్లో శాంతి భద్రతలను విఘాతం కలిగించేలా వ్యవహరిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మండళ్లలో డీజేలకు పరిమితి లేదని, శోభయాత్రలో ఎలాంటి అల్లర్లు జరగకుండా చూడాలని ఎదైన సమస్య వస్తే పోలీస్ స్టేషన్‌కు చరవాణి ద్వారా సమాచారం అందించాలని, నవరాత్రులు అయిపోయే వరకు నిర్వహకులు ప్రతి రోజు మండల వద్ద కపాల ఉండాలన్నారు. నిమజ్జనం కోసం చెలిమల వాగు ప్రాజెక్టు వద్ద పోలీసుల ఆధ్వర్యంలో రహదారి, విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు, మండలంలో 35 గణేష్ మండళ్ల పేర్లు నమోదైనట్లు ఎస్‌ఐ తెలిపారు. కార్యక్రమంలో మండళ్ల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్

**కెరమెరి:** గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై సత్యనారాయణ సూచించారు. మంగళవారం కెరమెరి ఠాణాలో ఉత్సవ శాంతి కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులమతాల మధ్య ఎలాంటి విభేదాలు రాకుండా మతసామరస్యంగా వేడుకలను నిర్వహించుకోవాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరకుండా ప్రత్యేక సహకరించాలని, ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గణేష్ మండపాల నిర్వహకులు నిబంధనలు పాటించాలన్నారు. శాంతి, భద్రతలకు విఘాతం కల్గిస్తే ఎంతటి వారైన సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈ రవీందర్, నాయకులు రాజయ్య, కోవ దేవ్‌రావు, యునీస్, జగన్నాథ్‌రావు, జగన్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.







అంపుడు దేవర వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న గ్రామస్థులు

## గ్రామాల్లో ఘనంగా పూజలు

**దహెగాం, న్యూస్‌టుడే :** మండలంలోని వివిధ గ్రామాల్లో బడుగ పండగను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. శ్రావణమాసంలో మాంసాహారాలు తీసుకోకుండా ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. శ్రావణ మాసం పూర్తి కాగానే బడుగ పండగను అనవాయితీగా నిర్వహిస్తారు. ఐనం గ్రామంలో బడుగ పండుగ సందర్భంగా అంపుడు దేవర వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## నలుగురు బైండోవర్

**దహెగాం, న్యూస్‌టుడే :** మండలంలోని ఐనం గ్రామానికి చెందిన గోమాస్ నాందేవ్, శంకర్, బోర్లకుండ గ్రామానికి డోంగ్రె ప్రవీన్, కాసర్ల సురేష్‌లను తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో అఫ్జల్‌ఖాన్ తెలిపారు. ఈ నలుగురు వ్యక్తులు నేరచరిత్ర కలిగి ఉన్నారు కనుక గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా బైండోవర్ చేసినట్లుగా తెలిపారు. సత్ప్రవర్తన నిమిత్తం సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

## ఒకరిపై కేసు నమోదు

**దహెగాం, న్యూస్‌టుడే :** మండలంలోని ఐనం గ్రామానికి చెందిన సోమన్‌కార్ రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ దీకొండ రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..అదే గ్రామానికి చెందిన రమేష్ చిన్నాన్న అయిన సోమన్‌కార్ పోచయ్యను పాతకక్షలు మనసులో పెట్టుకుని బండపట్టి తలపై బాదాడు. దీంతో పోచయ్య తల పగిలింది. పోచయ్య భార్య శాంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

## విద్యా వలంటీర్ల మండల కార్యవర్గం ఎన్నిక

**దహెగాం, న్యూస్‌టుడే :** మండలంలోని విద్యా వలంటీర్ల నూతన కార్యావర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా రాపర్తి దామోదర్, మండలాధ్యక్షులుగా నికాడి మహేష్, ఉపాధ్యక్షులుగా కంబాల నరేందర్, కోలపూరి రవి, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణగౌడ్, సహాయ కార్యదర్శి సాయిబాబు, కోశాధికారులుగా లావణ్య, రాజేష్, సమాచార అధికారి ముఖశీర్‌పాషా, రాజు, సలహాదారులుగా గంగారాం, సాగర్, తులసీరాం, శారద, రేవయ్య, తిరుపతిలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షులు నికాడి మహేష్ మాట్లాడుతూ విద్యా వలంటీర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డీఎస్సీని నూతన జిల్లాల వారీగా ఏర్పాటు చేయాలని డిమాండు చేశారు. గత సంవత్సరంలోని మార్చి, ఏప్రిల్, జూన్, జులై మాసాలకు సంబంధించిన వేతనాలు అందించాలని పేర్కొన్నారు.

## కస్తూర్బాలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు చేసుకోండి

**సిర్పూరు(టి), న్యూస్‌టుడే :** సిర్పూరు(టి) మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న 23 సీట్ల భర్తీకి అర్హులైన బాలికలు ఈ నెల 24 తేది లోగ దరఖాస్తులు చేయాలని పాఠశాల ప్రత్యేక అధికారి నాగసుధ మంగళవారం తెలిపారు. పాఠశాలలో మొత్తం 23 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 6వ తరగతిలో 4, 8వ తరగతిలో 1, 9వ తరగతిలో 4, 10 వ తరగతిలో 14 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. బడిమానిన బడికి రాని పేద బాలికలు దరఖాస్తులు చేయాలని సూచించారు.



కాలువలోకి చేరుతున్న వ్యర్థాలు

## కంపు కొడుతోంది.. బాగు చేయండి

**రెబ్బెన, న్యూస్‌టుడే :** రెబ్బెన మండలం గోలేటి ఆశ్రమోన్నత పాఠశాలలోని మరుగుదొడ్డి వ్యర్థాల నీరు రోడ్డుపైకి రావడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల ఆవరణలో నిర్మించిన మరుగుదొడ్డి కుండీలు సరిగా పని చేయకపోవడంతో, ఆ మరుగు నీరు నేరుగా రోడ్డు పక్కన ఉన్న కాలువలోకి చేరుతుంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని, ఇళ్లలో ఉండలేకపోతుట్లు వాపోతున్నారు. వర్షకాలం కావడంతో వ్యాధుల ప్రబలే అవకాశం ఉందని, కాలనీ వాసులు, గ్రామస్థులు తెలిపారు. ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎవరు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్డి మురుగు బయటికి రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఎద్దుల బొమ్మలతో పొలాల పండగ జరుపుకొంటున్న చిన్నారులు



అలంకరించిన ఎద్దులతో రైతులు..

## పొలాల పండగలో బాలల సందడి

**ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే :** జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవీధిలో మంగళవారం పొలాల పండగను పురస్కరించుకొని బాలలు సందడి చేశారు. ఎద్దుల బొమ్మలతో వీధిలో శోభాయాత్రను నిర్వహించారు. ఆలయాలకు చేరుకొని ప్రదక్షిణలు చేశారు. పెద్దలు వారిని అనుసరించారు. ఈ సందర్భంగా ఈశ్వరున్ని ప్రార్థించారు. కాగా పొలాల సందర్భంగా రైతులు తమ ఎద్దులను అలంకరించి అంకం రాజుల ఆలయం, పోచమ్మ ఆలయాల వద్దకు శోభాయాత్రగా వచ్చి మొక్కులు దీర్చుకున్నారు.

# అంగన్‌వాడీ కేంద్రాల ఆకస్మిక తనిఖీ..

● ఏడుగురికి శ్రీముఖాలు


అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలను పరీక్షిస్తున్న పీఓ సావిత్రి

**చింతలమానెపెల్లి, (కౌటాల), న్యూస్‌టుడే :** మండలంలోని వివిధ గ్రామాలలో మంగళవారం ఐసీడీఎస్ పీఓ సావిత్రి పర్యటించి, అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలోని బాబాసాగర్, చింతలమానెపెల్లి, బాలాజీ అనుకోడ గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కొందరు అద్దె భవనాలకు బదులుగా సొంత ఇళ్లలో కేంద్రాలు నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చినట్లు పీఓ సావిత్రి తెలిపారు. తప్పని సరిగా అద్దె భవనాలలోనే కేంద్రాలు నిర్వహించాలని, అందుకు ప్రతి నెల రూ.750లు అద్దె చెల్లిస్తున్నట్లు ఆమె తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఏడుగురు అంగన్‌వాడీ కార్యకర్తలకు శ్రీముఖాలు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. ఆమె వెంట సీడీపీఓ వనజ, పర్యవేక్షకులు భాగ్యలక్ష్మీ ఉన్నారు.

# ఉమ్మడి జిల్లా జోన్ స్థాయి ఫుట్‌బాల్ జట్ల ఎంపిక

**ఆసిఫాబాద్ అర్బన్, న్యూస్‌టుడే :** ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా స్థాయి స్పోర్ట్స్ జోన్ పోటీల కోసం కుమురం భీం జిల్లా ఫుట్‌బాల్ జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా పాఠశాల క్రీడ సమాఖ్య కార్యదర్శి మిట్టపల్లి రమేష్, ఎంపిక పోటీల కన్వీనర్ ఎంఈవో నారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఠాకూర్ జితేందర్‌సింగ్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. దహెగాం మండల చిన్నరాసపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో 14 ఏళ్ల లోపు, 17 ఏళ్ల వయసు లోపు విభాగాల్లో జట్లను ఎంపిక చేసినట్లు వివరించారు. ఎంపికైన జట్లు త్వరలో మంచిర్యాలలో నిర్వహించబోయే జోన్‌స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. గ్రామీణ విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ఈ ఎంపిక పోటీలను నిర్వహించామన్నారు. ఎంపికైన జట్ల వివరాలను పరిశీలిస్తే...

### 14 ఏళ్ల బాలుర విభాగంలో

ఈస్‌గామం ఉన్నత పాఠశాలకు చెందిన అంజన్‌మాల్కర్, అనూప్ సర్కార్, రాహుల్ సర్దార్, అభిజిత్ సర్దార్, ప్రేమ్‌గేన్, రాజీవ్ మండల్, నీలేష్, మాదవ్ సర్దార్, జెడ్పీఎస్ఎస్ చిన్నరాపల్లి విద్యార్థులు అంజనేయప్రసాద్, వవన్‌కుమార్, సంతోష్, వెంకటేష్, అంజన్న, పెంచికల్‌పేట్ ఉన్నత పాఠశాలకు చెందిన సాయి, మల్లేష్, బెజ్జూరుకు చెందిన ఇలియాజ్, కాగజ్‌నగర్ సెయింట్ కారెట్ పాఠశాల విద్యార్థి కిశోర్, దహెగాంకు చెందిన ఆనంద్‌లు ఎంపికైనట్లు ప్రకటించారు. దేవకర్, తరుణ్, ప్రవీణ్‌లు స్టాండ్‌బైలుగా ఎంపికయ్యారు.

### 17 ఏళ్ల బాలుర విభాగం

చిన్నరాసపెల్లికి చెందిన రవికుమార్, మల్లేష్, రజినీకాంత్, రమేష్, సాయి, సందీప్, నరేష్, ఉదయ్, ఈస్‌గాం ఉన్నత పాఠశాలకు చెందిన దీపక్‌మండల్, ప్రణయ్‌సర్కార్, కపిల్ సనా, అంజు, పెంచికల్‌పేట్ ఉన్నత పాఠశాలకు చెందిన పి.సాయి. గణేష్, కాగజ్‌నగర్‌కు చెందిన ప్రదీప్, మహేష్, ఆసిఫాబాద్ టీడబ్ల్యూఆర్ గురుకులానికి చెందిన బి.నితిన్, అగర్‌గూడకు చెందిన మహేష్‌లు ఎంపికయ్యారు. పెంటాజీ, ఉదయ్, సంతోష్‌లు స్టాండ్‌బైలుగా ఉంటారు.

### 14 ఏళ్ల బాలికల విభాగం

ఈస్‌గాంకు చెందిన త్రిష్ణా సనా, శిల్పారాయ్, మనాక్షీ బిస్వాస్, శిల్పా సర్కార్, ప్రియారాయ్, చిన్నరాసపెల్లికి చెందిన భాగ్యలక్ష్మి, డి.మమత, తేజ, సుజాత, ఈశ్వరి, అంకు, కళ్యాణి, జ్యోతి, పెంచికల్‌పేట్‌కు చెందిన సౌజన్య, గంగాపూర్‌కు చెందిన రీత, కళ్యాణి, దహెగాంకు చెందిన ఐశ్వర్యలు ఎంపికయ్యారు. స్పందన, శిరీష, మౌనికలు స్టాండ్‌బైలుగా ఎంపికయ్యారు.

### 17 ఏళ్ల బాలికల విభాగం

ఈస్‌గాంకు చెందిన సంగీత, జయంతి, బిటిక, నీత, చిన్నరాస్‌పల్లికి చెందిన సంధ్యారాణి, మాన్య, చిట్టి, లక్ష్మి, కవిత, సునిత, రజిత, కళ్యాణి, పెంచికల్‌పేటకు చెందిన శివాని, భవాని, సంకీర్తన (నంబాల, సుప్రజ(బెజ్జూరు), రజిత, ఆర్.పూజిత(కుంచవల్లి)లు ఎంపికయ్యారు. లావన్య, బన్నీ, భద్రలు స్టాండ్‌బైలుగా ఉంటారు.

# వాగు కష్టాలు..

● పురిటినొప్పులతో ఇబ్బంది పడిన నిండు గర్భిణి


ఎర్రవాగు వద్ద అంబులెన్సు నుంచి దిగిన రజిత

**దహెగాం, న్యూస్‌టుడే :** ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలని ప్రభుత్వం ప్రచారం చేయగానే గ్రామీణ ప్రాంత ప్రజల్లో అవగాహన పెరిగింది. ఆసుపత్రికి వచ్చి ప్రసవం చేయించుకుందామంటే రవాణా సౌకర్యాల లేమి వారిని అవస్థల పాలు చేస్తోంది. సోమవారం పురిటి నొప్పులతో బాధపడుతున్న దిగిడె గ్రామానికి చెందిన కుర్సింగ్ రజిత అనే మహిళను ఆసుపత్రికి తీసుకురావాల్సి వచ్చింది. గిరవెల్లి(గెర్రె) సమీపంలోని ఎర్రవాగుపై నిర్మిస్తున్న వంతెన పూర్తి కాకపోవడంతో ఆ గ్రామాలకు అంబులెన్సు కూడా వెళ్లలేని పరిస్థితి. 4 గంటలకు పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. వేరే ఊరికి వెళ్లి వాహనం తెచ్చి ఆమెను వాగు వద్దకు తీసుకొచ్చారు. ఏడు గంటలకే వచ్చిన అవ్వాల్ అంబులెన్స్ 11 గంటల వరకు ఎర్రవాగు ఒడ్డుపైనే ఉంది. అనంతరం అంబులెన్స్‌లో ఆమెను ఆసుపత్రికి తీసుకురాగానే మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యులు పేర్కొన్నారు. ప్రసవం అనంతరం ఇంటికి వచ్చే సమయంలో వాగు వరకు అంబులెన్స్‌లో వచ్చారు. అక్కడి నుంచి వాగు దాటి వేరే వాహనంలో గ్రామానికి వెళ్లారు. వంతెన నిర్మాణం పూర్తయితే ఈ అవస్థలు ఉండవని అంబులెన్సు మా గ్రామం వరకు వస్తుందని వాగవతలి గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా గుత్తేదారుపై ఒత్తిడి తీసుకు రావాలని ప్రజలు కోరుతున్నారు.

# భూముల రికార్డులను సరిచేయడానికే ఇంటింటి సర్వే


మాట్లాడుతున్న ఇన్చార్జి ఆర్డీఓ శ్యామలదేవి

**మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:** రెవెన్యూ శాఖలో భూముల రికార్డులను సరి చేయడానికి ప్రభుత్వం ఆదేశంతో ఇంటింటి సర్వే చేస్తున్నామని ఇన్చార్జి ఆర్డీఓ శ్యామలదేవి అన్నారు. మంచిర్యాలలోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో అమె మాట్లాడారు. మంచిర్యాల జిల్లాలో మొదటి దశ కింద తాండూరు, భీమిని, లక్షెట్టిపేట, భీమారం మండలాల్లో రెవెన్యూ అధికారులు భూరికార్డులపై ఇంటింటి సర్వే చేస్తున్నారని తెలిపారు. ఒక్కొక్క మండలంలో నలుగురు తహసీల్దార్లతో సర్వే చేయిస్తున్నామని తెలిపారు. భూమి యాజమానుల ఇంటికి సర్వే సిబ్బంది వచ్చినప్పుడు భూములు దస్త్రాలు, పూర్తి వివరాలు తెలపాలని కోరారు. గతంలో భూముల యాజమానులు చనిపోయిన వారి పేర్లు రికార్డుల్లో ఉంటే, రెవెన్యూ సర్వే సిబ్బందికి ఆ వివరాలు తెలిపితే చట్ట ప్రకారం వారి వారసుల పేర్లు రికార్డులో నమోదు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. మంచిర్యాల జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ అసైన్డ్, చెరువు శిఖం భూములను కొంతమంది భూఆక్రమదారులు అమ్ముతున్నట్టు తెలిసిందన్నారు. భూములు కొనుగోలు చేసే యాజమానులు ఆయా తహసీల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ రికార్డులను పూర్తి స్థాయిలో పరిశీలించుకొని అన్ని సరిగ్గా ఉంటేనే కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వ భూములు కొనుగోలు చేస్తే ఎన్నటికైనా స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. ఆ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంచిర్యాలలోని ప్రభుత్వ భూమి సర్వే నెం.345, 324లో గల అసైన్డ్ భూములు, కాలేజీరోడ్డులోని భూదాన భూములు, నస్పూర్‌లోని సర్వే నెం.42, 64లలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమును స్వాధీనం చేసుకుంటామన్నారు. జిల్లాలోని పట్టణ ప్రాంతాల్లో భూముల ధరలు పెరగడంతో కొనుగోలుదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏ భూమి కొనుగోలు చేసినా తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో 1బి రిజిస్టార్, కాస్ర పహాణీ, సేత్వార్ రికార్డులను పరిశీలించుకొని ఆ భూమికి పట్టా ఉందా లేదా అని నిర్ధరించుకున్న తర్వాతనే కొనుగోలు చేయలన్నారు. వివాదాస్పమైన భూములు కొనుగోలు చేసి ప్రజలు నష్ట పోవద్దన్నారు. భూరికార్డుల్లో తప్పులు ఉంటే రెవెన్యూ అధికారులు చేసే ఇంటింటి సర్వేలో రికార్డులను సరి చేయించుకొవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సదానందం, ఆర్ఐ సుమన్ పాల్గొన్నారు.

# పాత్రికేయులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

**మంచిర్యాల పట్టణం, న్యూస్‌టుడే:** మంచిర్యాల జిల్లాలో అర్హులైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మాధ్యమం పాత్రికేయులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వడానికి జిల్లా అధికారులు అంగీకరించారు. అర్హులందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి మంగళవారం పాలనాధికారి కార్యాలయం ముఖద్వారం ఎదుట ఆమరణ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవోల పేరుతో జిల్లా అధికారులు అక్రిడిటేషన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా పాలనాధికారి ఆర్వీ కర్ణన్ ఆదేశంతో ఇన్చార్జి ఆర్డీఓ శ్యామలదేవి, డీపీఆర్వో సంపత్‌కుమార్ దీక్ష శిబిరం వద్దకు వచ్చి అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు ఇస్తామని హామీ ఇవ్వడంతో టీయూడబ్ల్యూజే నాయకులు దీక్ష విరమించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నాయకులు సి.హెచ్. శ్రీనివాస్, చంద్రశేఖర్, కాచం సతీష్, లక్కాకుల శ్రీనివాస్, మునీర్, ఆంజనేయులు, సత్యం, దేవరాజ్, వంశీ, రమేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఆమరణ దీక్ష శిబిరానికి వివిధ రాజకీయ పార్టీల నాయకులు వచ్చి సంగీభావం తెలిపారు.

# నాటుసారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

**మంచిర్యాలనేరవిభాగం, న్యూస్‌టుడే:** స్థానిక ఎన్టీఆర్‌నగర్‌లో మంగళవారం జరిపిన దాడుల్లో విష్ణుభక్తుల రాజేశ్వరి 5 లీటర్ల నాటుసారాతో పట్టుబడినట్లు ఆబ్కారీ సీఐ నరేందర్ తెలిపారు. ఈ మేరకు ఆమెను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎస్సై శారద, సిబ్బంది పాల్గొన్నారు.

# జీవితాలను చిదిమేసింది..

(మొదటి పేజీ తరువాయి) ఒక్క వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో బాధిత కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఆసుపత్రిలో ఉన్న నర్సులు, సిబ్బందే వైద్య సేవలు అందించారు. అరగంట తరువాత ఇద్దరు వైద్యులు వచ్చి పరీక్షించారు.



మృతిచెందిన నవీన్(20)

## పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబం..

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆదె తిరుపతి(22) మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. లీమ్‌గూడకు చెందిన తిరుపతి విట్టు, పద్మాబాయిల కుమారుడు. వ్యవసాయ కుటుంబం. తిరుపతి భార్య భారతికి ఇద్దరు ఆడ పిల్లలు. ప్రస్తుతం ఆమె గర్భింతో ఉంది. భర్త మృతితో ఆమె తల్లడిల్లుతున్న వైనం అందరిని కంటతడి పెట్టించింది. తన భర్త తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో వెక్కివెక్కి ఏడుస్తోంది. కుటుంబ సభ్యుల రోదనలు చూపరుల కంటతడి పెట్టించాయి.



రోదిస్తున్న తిరుపతి కుటుంబ సభ్యులు



గాయపడ్డ రాంచందర్



రమేశ్

## మృతుల్లో చిన్నవారే అధికం..

మృతుల్లో అయిదుగురు 21 ఏళ్ల లోపు వారే ఉండటంతో ఆ కుటుంబాల్లో గుండెకోత మిగిల్చారు. ఝరికి చెందిన బాబురావు, శారద కుమారుడు లెండిగురె రమేశ్(13). 7వ తరగతి చదువుతున్నాడు. వీరికి ఇద్దరు సంతానంలో కుమారుడు మృతి చెందాడు. కూతురు ఉంది. అన్న మృతితో చెల్లె రోదిస్తూ కనిపించింది.

లీమ్‌గూడకు చెందిన మెహర్లె సాంబ, లచ్చుబాయిల కుమారుడు మొహర్లె సంతోష్(16). వీరికి అయిదుగురు సంతానం. ఒక అక్క, అన్న వివాహం అయింది. పెళ్లీడూకొచ్చిన ఇద్దరు చెల్లెలు ఉన్నారు. కుమారుని మృతితో కుటుంబంలో విషాదం నిండింది.

అగర్‌వాడకు చెందిన ఆబాజీ, సుగుణాబాయిల కుమారుడు జ్ఞానేశ్వర్(13). వీరికి ఆరుగురు సంతానం. ఒక్క కూతురు వివాహం అయింది. చిన్నతనంలోనే కుమారుడు రోడ్డు ప్రమాద రూపంలో మృతి చెందడం కుటుంబంలో తీరని దుఃఖాన్ని మిగిల్చింది.

అగర్‌వాడకు చెందిన బొజ్జు కుమారుడు వెడ్మ అంబారావు(14). తల్లి లేకపోవడంతో అమ్మమ్మ తుర్సుబాయి వద్ద ఉంటున్నాడు. రోడ్డు ప్రమాదంతో మృతి చెందడంతో కుటుంబంలో అంతులేని విషాదం చోటు చేసుకుంది.

లీంగూడకు చెందిన పుల్లయ్య, లింగమ్మల కుమారుడు ఇగురపు నవీన్(21). వీరికి నలుగురు సంతానం. నవీన్ రెండో వాడు. కుమారుని మృతి వీరికి తీరని కడుపుకోత మిగిల్చింది. చేతికందిన కొడుకు అందని లోకాలకు వెళ్లిపోయాడంటూ ఆ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు పలువురిని కంట తడి పెట్టించింది.

# ముగిసిన నవోదయ క్లస్టర్ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

**కాగజ్‌నగర్, న్యూస్‌టుడే:** కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో తెలంగాణ నవోదయ 28వ క్లస్టర్ స్థాయి అథ్లెటిక్స్- ఎగ్జిబిషన్-2017-18 పోటీలు మంగళవారం సాయంత్రం ముగిశాయి. ముగింపు సమావేశానికి హాజరైన జిల్లా రవాణా శాఖ అధికారి శ్యాంనాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో విద్యాలయాలను స్థాపించారన్నారు. సంస్కృతి, సంప్రదాయలకు విద్యాలయాలు నిలయాలన్నారు. పట్టుదల, దృఢమైన సంకల్పంతో విద్యార్థులను ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. విద్యాలయం ప్రిన్సిపల్ చక్రపాణి మాట్లాడుతూ క్లస్టర్ స్థాయి పోటీల విజయవంతానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అథ్లెటిక్స్, సైన్స్ ప్రదర్శనలో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ నర్సింగోజు పద్మసత్యనారాయణ, లయన్స్ క్లబ్ రీజినల్ ఛైర్మన్ డాక్టర్ శ్రీనివాస్, విద్యాలయం వైస్ ప్రిన్సిపల్ వసంతి కుమారి, పీఈటీలు మోహన్‌రావు, శైలజరెడ్డి, ప్రభుత్వ పీడీలు మధుసూదన్, సాంబశివరావు, జోసెఫ్, ఉపాధ్యాయులు మంజుల, భాస్కర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, రంగారెడ్డి, కాగజ్‌నగర్ విద్యాలయం విద్యార్థులు పాల్గొన్నారు. ముగింపు సమావేశానికి హాజరైన డీటీఓ, డాక్టర్ శ్రీనివాస్, తదితరులకు విద్యాలయం ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో స్వాగతం పలికారు.




హాజరైన తెలంగాణ రాష్ట్రంలోని విద్యాలయాల విద్యార్థులు



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న డీటీఓ శ్యాంనాయక్, తదితరులు

# శిక్షణతోనే లక్ష్యం సాధ్యం

**ముల్కల్ల (మంచిర్యాల గ్రామీణం), న్యూస్‌టుడే:** హాజీపూర్ మండలం ముల్కల్లలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో డీఓపీటీ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఈ లెర్నింగ్, డిజిటలైజేషన్ విధానంపై మూడు రోజుల పాటు అందిస్తున్న శిక్షణ కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిచేసేందుకు ఈ లెర్నింగ్, డిజిటల్ విధానంపై అందిస్తున్న శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగులు విధినిర్వహణలో మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం 15 అంశాలతో కూడిన ఎలక్ట్రానిక్ అభ్యసనాంశాలపై శిక్షణ ఇచ్చిందని చెప్పారు. లక్ష్యాల సాధనలో ఒత్తిడికి గురికాకుండా ఉండడంతో పాటు సమయ భావం పాటించేందుకు డిజిటల్ విధానం ద్వారా పొందిన శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. సమస్యల సాధన, నిర్ణయాధికారాలు, కమ్యూనికేషన్ సేవలు, సంస్థాగత సమర్థత, కార్యాలయ రికార్డుల నిర్వహణ, ఆర్థిక రంగ నైపుణ్యాలు, సమాచార హక్కు చట్టం, తదితర అంశాలపై ప్రతి ఉద్యోగి అవగాహన కల్గి ఉండేందుకు శిక్షణను ఇచ్చినట్లు చెప్పారు.



మాట్లాడుతున్న జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి

# బీమా సంస్థలకే ప్రయోజనం

(మొదటిపేజీ తరువాయి) సోయా, వరి పంటలను సాగు చేస్తారు. ఇతర పంటలు తక్కువ విస్తీర్ణంలో సాగవుతున్నాయి. అతివృష్టి లేదంటే అనావృష్టి వల్ల ఏటా రైతులు పంటలను నష్టపోతున్నారు. ఇలాంటి సమయంలో రైతులను ఆదుకునేందుకు వీలుగా పంట బీమా పథకం అమలవుతోంది. బ్యాంకు నుంచి రుణం పొందే రైతులకు పంట బీమా తప్పనిసరి చేశారు. రుణంతో సంబంధం లేకుండా పంటలను సాగు చేసే రైతులు మాత్రం బీమా చేయడమనేది వారి ఇష్టంపై ఆధారపడి ఉంటుంది. బ్యాంకు నుంచి ఏ పంటకయితే రుణం తీసుకుంటారో ఆ పంటకు సంబంధించి పంట బీమా ప్రీమియం రుణం ఇచ్చే సమయంలోనే మినహాయించుకొని సంబంధిత సంస్థకు చెల్లిస్తాయి. బ్యాంకుల నుంచి రుణం తీసుకొని రైతులు కూడా తాము సాగు చేసే పంటలకు బీమా చేయించుకోవచ్చు.

## వాతావరణ ఆధారిత బీమా

ఉమ్మడి జిల్లాలో వాతావరణ ఆధారిత బీమా పథకం కింద పత్తి పంటను అమలు చేస్తున్నారు. పత్తి పంటకు గతంలో గ్రామం యూనిట్‌గా అమలయ్యేది. దీంతో రైతులు నష్టపోయేవారు. ప్రభుత్వం రెండేళ్ల నుంచి పత్తి పంటను వాతావరణ ఆధారిత బీమాలో చేర్చారు. దీంతో దిగుబడులతో సంబంధం లేకుండా నిర్దేశించిన వాతావరణాన్ని ఆధారంగా చేసుకోని నష్టాన్ని లెక్కించి రైతులకు పరిహారం అందిస్తున్నారు. అయితే రైతులు చెల్లించే ప్రీమియం కంటే బీమా పరిహారం తక్కువగా వచ్చేది. 2015లో మాత్రం రైతులు రూ.16.26 కోట్లు ప్రీమియం చెల్లిస్తే పరిహారం రూపేన రూ.51 కోట్లు పొందారు. గతేడాదికి సంబంధించి ఇప్పటివరకు పరిహారం రాలేదు. రాష్ట్ర వాటా చెల్లించకపోవడంతో పరిహారం ఆగిపోయిందనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మేరకు ఇటీవల కొన్ని నిధులు విడుదల చేయగా, ఇంకా కొన్ని నిధులు సంబంధిత కంపెనీలకు చెల్లించాల్సి ఉంది.

## ఇతర పంటలకు దిక్కే లేదు

వాతావరణం ఆధారంగా పత్తి పంటకు బీమా పరిహారం చెల్లిస్తుండగా, ఇతర పంటలకు గ్రామం, మండల యూనిట్ ఆధారంతో వచ్చిన దిగుబడుల ఆధారంగా నష్టాన్ని లెక్కించి బీమా పరిహారం చెల్లిస్తున్నారు. పత్తి తరువాత అధిక విస్తీర్ణంలో సాగయ్యే సోయాబీన్ పంటకు గ్రామం యూనిట్‌గా పంట బీమాను అమలు చేస్తున్నారు. రెండేళ్లుగా రైతులు ప్రీమియం చెల్లించినా ఇప్పటి వరకు పరిహారం రాలేదు. జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటల్లో వరితో పాటు పెసర, మినుము, జొన్న, మొక్కజొన్న, కంది, మిరప, పసుపు తదితర పంటలకు మండల యూనిట్‌గా బీమా అమలవుతోంది. పంటల వారీగా ప్రీమియం వేరు వేరుగా ఉంది. ప్రణాళిక, గణాంకాల శాతం అధ్వర్యంలో ఏటా జరిగే సాధారణ ప్రయోగాల ఆధారంగానే నష్టాన్ని నిర్ధరిస్తున్నారు. పరిహారం మంజూరుకు సంబంధించి పాటించే నిబంధనలు బీమా సంస్థలకే ప్రయోజనం ఉంటుందే, తప్ప నష్టపోయిన సందర్భంలో రైతులకు పరిహారం రావడం లేదు.

## పక్కాగా లేని పంట బీమా

పంట బీమా పథకం కింద అవగాహన లేకపోవడంతో కొన్ని పరిస్థితుల్లో నష్టపోతున్నారు. నిర్బంధంగా ప్రీమియం మినహాయించుకుంటున్న రైతులకు ఏ పంటకు బీమా, ఎంత మొత్తం ప్రీమియం మినహాయించుకుంటున్నారనేది చెప్పడం లేదు. పరిహారం వచ్చిన సందర్భంలో బీమా సంస్థ నేరుగా రైతుల ఖాతాలో జమ చేస్తోంది. అది ఏ లెక్కన జమ చేస్తున్నారు, అసలు పరిహారం జమ చేస్తున్నారా.. లేదా అనే విషయాలపై రైతులకు అయోమయంగా ఉంది. జమ అయితే ఎంత మొత్తం అయింది. ఎప్పుడు జమవుతుందనే సమాచారం లేకుండా పోతోంది. బ్యాంకులో ప్రీమియం మినహాయించుకున్న సమయంలో రసీదు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు కనీసం పరిహారం ఏ లెక్కన వస్తుందనే సమాచారం కూడా ఇవ్వడం లేదు. కొంత మంది రైతులకైతే ప్రీమియం ఎంత మినహాయించుకుంటున్నారనే విషయం తెలియదు. రైతులందరికి రసీదులు ఇవ్వడం కుదరదని బ్యాంకర్లు అంటున్నారు. రుణాలు ఇచ్చే సమయంలోనే బీమా ప్రీమియంను మినహాయించుకొని రైతుల వారీగా సంబంధిత బీమా కార్యాలయానికి పంపిస్తున్నారు. ఎంత మంది రైతులు ప్రీమియం చెల్లించారు, ఎంత మందికి పరిహారం వచ్చింది అనే వివరాలు ఇటు వ్యవసాయ శాఖ వద్ద కాని అటు లీడ్‌బ్యాంకు అధికారుల వద్ద ఉండటం లేదు. రైతులకు ప్రీమియం చెల్లింపులో కానీ, పరిహారం మంజూరులో సందేహం వస్తే తీర్చే అధికారి జిల్లాలో లేరు. దీంతో పంట బీమాపై లేని పోని అపోహలతో, అవగాహన లేక ఎక్కువ మంది రైతులు సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.



2015లో అనావృష్టి వల్ల నిర్మల్ జిల్లాలో ఎండిపోయిన వరి(దాచిన చిత్రం)

## త్వరలో రైతుల ఖాతాల్లో జమవుతాయి

**- ఆశాకుమారి, డీఏఓ**

పంట బీమా పథకంలో భాగంగా గతేడాదికి సంబంధించిన పంట నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం తమ వంతు వాటాగా నిధులు విడుదల చేసింది. బీమా కంపెనీలు రైతుల ఖాతాల సేకరణలో ఉన్నాయి. పరిహారం గురించి సంబంధిత కంపెనీలకు లేఖ రాశాం. మండలాల వారీగా ఏ మేరకు, ఎంత మంది రైతులకు పరిహారం మంజూరైందనే వివరాలు పంపిస్తాం. 2017-18 సంవత్సరానికి పత్తికి వాతావరణ ఆధారిత బీమా, సోయాకు గ్రామం యూనిట్ కింద బీమా అమలు చేస్తున్నారు. ఎంత మంది రైతులు ప్రీమియం చెల్లించారనే సమాచారాన్ని సేకరిస్తున్నాం.

**నాలుగేళ్లుగా పత్తి పంటకు సంబంధించి వాతావరణ ఆధారిత బీమా వివరాలు (రూ.కోట్లలో)**

| సంవత్సరం | బీమా చేసిన రైతులు | చెల్లించిన ప్రీమియం | లబ్ధి పొందిన రైతులు | పొందిన పరిహారం |
|---|---|---|---|---|
| 2011 | 62,040 | 9.79 | 48,392 | 10.56 |
| 2012 | 83,325 | 13.96 | 80,341 | 29.99 |
| 2013 | 59,549 | 9.73 | 41,229 | 10.66 |
| 2014 | 1,773 | 0.64 | 1,773 | 2.04 |
| 2015 | 54,236 | 16.26 | 73,931 | 51.00 |
| 2016 | 56,159 | 16.84 | -- | -- |

**నాలుగేళ్లుగా రైతులు చెల్లించిన ప్రీమియం, వచ్చిన పరిహారం లెక్కలు పరిశీలిస్తే రైతులకు ఏ మేరకు ప్రయోజనం కలిగిందో తెలుస్తోంది.**

**జాతీయ వ్యవసాయ బీమా పథకం (ఎన్‌ఏఐఎస్) ఫసల్‌బీమా యోజన కింద మండల, గ్రామ యూనిట్ బీమా ప్రీమియం చెల్లింపులు, పరిహారం (రూ.కోట్లలో)**

| సంవత్సరం | బీమా చేసిన రైతులు | చెల్లించిన ప్రీమియం | లబ్ధి పొందిన రైతులు | పొందిన పరిహారం |
|---|---|---|---|---|
| 2011 | 60,888 | 4.26 | 178 | 0.60 |
| 2012 | 60,589 | 5.39 | 1878 | 0.30 |
| 2013 | 72,707 | 7.17 | 515 | 0.23 |
| 2014 | 58,097 | 8.08 | 18,340 | 3.63 |
| 2015 | 73,931 | 7.93 | --- | --- |
| 2016 | 85,337 | 7.99 | --- | --- |

# యోగాతో సమ్మోహనం..

- విల్లులా వంగుతారు.. తీగలా సాగుతారు
- జాతీయ స్థాయి యోగా పోటీలకు జిల్లావాసులు
- నిరంతర సాధన.. పతకాలు తెస్తామని ధీమా



తాండూరు – బెల్లంపల్లి పట్టణం, న్యూస్‌టుడే

యోగా.. దేశంలోనే పురుడు పోసుకున్న ఆరోగ్య సాధన యంత్రం లాంటి ఈ విద్య ఇప్పుడు ప్రపంచ దేశాలకు పాకింది. అన్ని రుగ్మతలకు, వ్యాధులకు విరుగుడు మంత్రంగా యోగాను దేశవిదేశాల్లో అనుసరిస్తున్నారు.. ఇలాంటి విద్యలో జిల్లావాసులు ఎంతో ప్రతిభ చూపుతున్నారు. మొదటి నుంచి జిల్లాలో పలువురు యోగా నిపుణులు ఈవిద్యను పలువురికి నేర్పుతూ వ్యాప్తి చెందిస్తున్నారు.. యోగాకు ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చాక, గత మూడునాలుగేళ్లుగా ఈవిద్యలో ఇక్కడి విద్యార్థులు, యువత కూడా ఆసక్తి చూపుతున్నారు. మంచి ప్రతిభ చూపి రాష్ట్ర, జాతీయ స్థాయి బహుమతులు సాధిస్తున్నారు. దేహాన్ని స్ప్రింగులా వివిధ కోణాల్లో వంచుతూ కష్టమైన ఆసనాలను సైతం అలవోకగా ప్రదర్శిస్తూ జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ యోగా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో వివిధ విభాగాల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వచ్చే నెల 1 నుంచి నాసిక్‌లో నిర్వహించే జాతీయ స్థాయి పోటీల్లో వీరు యోగా ప్రదర్శన చేయనున్నారు.. జాతీయ స్థాయిలోనూ పతకాలతో తిరిగి వస్తామని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ విజేతలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..



## పది మందికి నేర్పుతూ.. నిత్య విద్యార్థిలా సాధన చేస్తూ..

బెల్లంపల్లి పట్టణానికి చెందిన బోగే ఉమారాణి 1997లో అనారోగ్యానికి గురయ్యారు. యోగాతో ఆరోగ్యంగా ఉండవచ్చని తెలిసి ఉమారాణి మూడేళ్లు సీరియస్‌గా నేర్చుకున్నారు. ఆరోగ్యం మెరుగుపడడంతో యోగాపై మరింత దృష్టి సారించారు. 2000 నుంచి ఉమారాణి పోటీల్లో పాల్గొంటూ వస్తున్నారు. 2000లో బెంగళూరులో మూడేళ్ల డిప్లొమా ఇన్ న్యాచురోపతి యోగిన్ సైన్స్ కోర్సును పూర్తి చేశారు. అప్పటినుంచి యోగా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. బెల్లంపల్లి పట్టణంలోని పాత జీఎం కార్యాలయంలో ఉచితంగా యోగా నేర్పిస్తున్నారు. బెల్లంపల్లి పట్టణంలోనే కాకుండా మాదారం టౌన్‌షిప్‌లోను యోగా శిక్షణ ఇస్తుంటారు. ఉమారాణి యోగాలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయస్థాయిలోను సత్తాచాటారు. ఇప్పటివరకు నాలుగుసార్లు జాతీయస్థాయిలో పోటీల్లో పాల్గొని బంగారు పతకాలను సాధించారు. ఆగస్టు 6న బెంగళూరులో నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లోను బంగారు పతకాన్ని సాధించారు.

## ఉపాధ్యాయుడి పట్టుదల.. పల్లెటూర్లో వెలుగు చూసిన ప్రతిభ..



రాష్ట్రస్థాయి పోటీల్లో సాంబమూర్తి ప్రదర్శన



సాంబమూర్తి

భీమిని మండలంలో విద్యార్థులకు ఆటలంటే తెలియదు. యోగా గురించి అవగాహన కూడా లేదు. ఇలాంటి ప్రాంతంలో అక్కడి వ్యాయామ ఉపాధ్యాయుడు సాంబమూర్తి పట్టుబట్టి వారిలో ప్రతిభను బయటి ప్రపంచానికి తెలిసేలా కృషి చేశారు. కొన్నేళ్లు పోలీసు శాఖలో పని చేసి వ్యాయామ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ ఉద్యోగం సాధించిన సాంబమూర్తి మొదటి నుంచి యోగాపై ఆసక్తి చూపేవారు. తాను పని చేస్తున్న పాఠశాలలో ప్రతిరోజు సాయంత్రం ఒక గంట పాటు విద్యార్థులకు యోగా నేర్పించడంతో పాటు తాను కూడా సాధన చేస్తుంటాడు. గత ఏడాదిగా ఆయన చేస్తున్న కృషి ఈసారి మంచి ఫలితం చూపింది. ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో సీనియర్స్ విభాగంలో స్వయంగా ఆయనే జాతీయ స్థాయికి ఎంపిక కావడంతో పాటు ఆయన విద్యార్థులు అలివేలు మంగ(8వ), నానుబాయి(9వ), మనోహర్(8వ)లు అండర్-16 విభాగంలో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. పాఠశాలలో 30 మంది విద్యార్థులు ప్రతిరోజు ఆయన యోగా తరగతులకు హాజరవుతుండగా వారిలో ముగ్గురు జాతీయ స్థాయికి ఎంపికై సత్తా చాటారు. అంతకు ముందు వేసవిలో యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఇక్కడి 8వ తరగతి విద్యార్థి కార్తీక్ మంచి ప్రతిభ ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో బహుమతి సాధించాడు. ప్రస్తుతం జాతీయ స్థాయి పోటీల కోసం వారిని మరింత సాధన చేయిస్తూ సన్నద్ధం చేస్తున్నాడు సాంబమూర్తి.. "ఇక్కడ వేరే ఆటలకు అనువైన స్థలం లేదు. అయినా ఆటల సాధన చేస్తుంటారు. కానీ యోగాపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి విద్యార్థులకు నేర్పుతున్నాను. పోటీల్లో ప్రతిభతో పాటు ఆరోగ్యానికి కూడా యోగా దోహదపడుతుంది. ఏకాగ్రత కూడా పెరుగుతుంది.. అందుకే విద్యార్థులందరినీ యోగా చేయాలని సూచిస్తున్నాను.. జాతీయ స్థాయిలోనూ మా విద్యార్థులు పతకాలు తెస్తారు.." అంటూ సాంబమూర్తి తన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.





## చదువుతో పాటు సమానంగా యోగాపై శ్రద్ధ..





తాండూరు మండలం మాదారం టౌన్‌షిప్‌కు చెందిన తొంగల లచ్చయ్య, శంకరమ్మల కుమార్తె తొంగల భాగ్యలక్ష్మీ. పీజీ పూర్తి చేసిన భాగ్యలక్ష్మి 2015 సంవత్సరం నుంచి మాదారం టౌన్‌షిప్‌లో యోగా నేర్చుకుంటుంది. యోగా నేర్చుకోవడమే కాదు పదిమందికి యోగా నేర్పిస్తున్నారు. యోగా నేర్పితే ఆరోగ్యం పంచినట్లేనని ఈమె అభిప్రాయం. యోగా శిక్షకురాలిగా ఇప్పుడిప్పుడే వెలుగులోకి వస్తున్నారు. ఈమె క్వాలిటీ ఆఫ్ యోగా కోర్సును పూర్తి చేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలోను భాగ్యలక్ష్మీ సత్తా చాటింది. రాష్ట్రస్థాయిలో వెండి, జాతీయ స్థాయిలో 2017 సంవత్సరంలో బంగారు పతకాలను సాధించింది. కోల్‌కత్తాలో ఇటీవల నిర్వహించిన యోగా పోటీల్లో బంగారు పతకాన్ని సాధించారు. తాజాగా నాసిక్ పోటీలకు సన్నద్ధమవుతున్నారు. యోగా మంచి జీవనానికి ఎంతో తోడ్పడుతుందని, క్రమశిక్షణ అలవడుతుందని భాగ్యలక్ష్మీ చెప్పారు.

## చిన్న వయసులోనే అపార ప్రతిభ..



తాండూరు మండలం మాదారం టౌన్‌షిప్‌కు చెందిన శనిగారపు లక్ష్మీ, పాల్ దంపతుల కుమార్తె బి. అక్షయ. ఈమె అయిదో తరగతి చదువుతుంది. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో యోగా నేర్చుకుంటుంది. చిన్నతనంలోనే యోగాసనాలు వేస్తూ అబ్బురపరుస్తుంది. యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చనే ఉద్దేశంతో ఆమెకు తల్లిదండ్రులు యోగా నేర్పిస్తుండగా అక్షయ మాత్రం యోగా విద్యలో తన కంటూ ప్రత్యేకతను చాటుకుంటోంది, కఠినమైన ఆసనాలను అక్షయ ఇట్టే వేస్తుంది. 2015 సంవత్సరం నుంచి అక్షయ యోగా నేర్చుకుంటుంది. కోల్‌కతాలో ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి పోటీల్లో బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఓ వైపు పాఠశాలకు వెళ్తు మరోవైపు ప్రతిరోజు సాయంత్రం మాదారంలో శిక్షణ తీసుకుంటుంది. రాష్ట్ర, జాతీయస్థాయిలో వెండి పతకాలను సాధించింది. ఓ వైపు పాఠశాలలో చదువుకుంటూనే సాయంత్రం వేళలో యోగాలో శిక్షణ తీసుకుంటుంది. అబ్బురపరిచేలా యోగాసనాలు వేస్తు అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ఇటీవల నిర్వహించిన పోటీల్లో అక్షయ ప్రదర్శనకు అక్కడి నిర్ణేతలు మంత్రముగ్ధులైనారు.



అక్షయ యోగా ప్రదర్శన

## సంహిత.. నిత్య సాధన..



తాండూరు మండలం మాదారం టౌన్‌షిప్‌కు చెందిన విద్యార్థిని సంహిత తాజాగా జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైంది. యోగా శిక్షకురాలు ఉమారాణి వద్ద సంహిత మాదారంలోనే శిక్షణ పొందుతోంది. తాండూరు విద్యాభారతి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఈబాలిక సాధారణంగానే అందరితో పాటు యోగా సాధన చేస్తున్న ఈవిద్యార్థినిలోని ప్రతిభను ఉమారాణి గుర్తించారు. దీంతో ఉమారాణి ఆమెపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గత సంవత్సరం జాతీయ స్థాయి పోటీల్లో సంహిత 7వ స్థానంలో నిలవగా, రాష్ట్ర స్థాయి పోటీల్లో రెండో స్థానం సాధించింది. తాజాగా హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ప్రస్తుతం జాతీయ స్థాయి పోటీల కోసం కఠోర సాధన చేస్తోంది.. నాసిక్‌లో నిర్వహించే పోటీల్లో మంచి ప్రతిభ చూపి పతకం సాధిస్తానని సంహిత తెలిపింది..




# ఆదమరిస్తే.. మృత్యు గోదారే!

- నదిలో ప్రమాదభరితంగా స్నాన ప్రదేశాలు
- ఇసుక తవ్వకాలతో గుంతలు
- వర్షా కాలం అప్రమత్తంగా ఉండాలి

పుణ్యస్నానాలు ఆచరించేందుకు గోదావరి నదికి రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే.. ఏమాత్రం ఆదమరిచినా నిండు ప్రాణాలు నీటిలో కలిసిపోతున్నాయి.. ఇసుక తవ్వకాల కారణంగా గోదావరి నదిలో నిలువెత్తు గోతులు ఏర్పడి స్నానాలు ఆచరించే ప్రదేశాలు మృత్యు కుహరాలుగా మారాయి. దీనికి తోడు నదిలో అపరిశుభ్రత, గడ్డి, నాచు పేరుకుపోయి నీటి నిల్వలు కన్పడటం లేదు. దీన్ని గమనించని భక్తులు పుణ్యస్నానాల కోసమని వస్తూ తిరిగిరాని లోకాలకు వెళ్తున్నారు. తరచూ అనేక సంఘటనలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రధానంగా చిన్నారులు, యువకులు ఇలాంటి ప్రమాదాలకు గురవుతూ మృత్యువాత పడుతుండటంతో వారి కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపుతోంది. ఇది గోదావరి నది పరివాహక ప్రాంతాల్లో నెలకొంటున్న దురదృష్టకర పరిస్థితి. ప్రమాదభరితంగా మారిన గోదావరినది స్నాన ప్రదేశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'న్యూస్‌టుడే' కథనం..



గోదావరి, ప్రాణహిత, సరస్వతీ నదుల కలయిక (త్రివేణి సంగమం)




చెన్నూరు, చెన్నూరు గ్రామీణం న్యూస్‌టుడే

నాసిక్ త్రయంబకేశ్వర్ వద్ద ప్రారంభమైన గోదావరినది ప్రవాహం మంచిర్యాల జిల్లాలో గూడెం వద్ద ప్రారంభమవుతోంది. అక్కడి నుంచి లక్షెట్టిపేట, ఎల్లంపల్లి, ముల్కల్ల, మంచిర్యాలను తాకుతూ జైపూర్ మండలంలోని ఇందారం, వేలాల, శివ్వారం, ఎల్‌మడుగు వరకు అక్కడ నుంచి చెన్నూరు మండలంలోని బీరెల్లి, సుందరశాల, చెన్నూరు మీదుగా కోటపల్లి మండలంలోని పారుపెల్లి, దేవులవాడ గ్రామాలను తాకుతూ కాళేశ్వరంలోని త్రివేణి సంగమంలో కలుస్తుంది.

గోదావరినది ప్రవహిస్తున్న ప్రాంతాల్లోని అన్ని చోట్ల భక్తులు పుణ్య స్నానాలు చేస్తారు. పర్వదినాల సమయంలో, పితృదేవతల కర్మకాండలు తదితర కార్యక్రమాల నిర్వహణ కోసం వందలాదిగా ప్రజలు వస్తుంటారు. పవిత్రమైన నదిలో పుణ్య స్నానాలు ఆచరించే ప్రాంతాలు ప్రమాదభరితంగా ఉండటంతో పాటు సరైన స్నాన ఘట్టాలు లేకపోవడంతో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నదుల్లో గత కొంతకాలంగా ఇసుక తవ్వకాలు ఇష్టారాజ్యంగా చేపడుతుండటం కూడా ఇందుకు కారణాలవుతున్నాయి. ఇసుక తవ్వకాలు చేపట్టిన చోట నిలువెత్తు గోతులు ఏర్పడటం..ఆయా ప్రాంతాల్లో వర్షాకాలంలో ప్రవాహ ఉద్ధృతి అధికమవడంతో నీటి నిల్వలు కనిపించగా ప్రజలు లోతట్టు ప్రాంతాలకు వెళ్లి స్నానాలు ఆచరిస్తున్నారు. నది పరివాహక ప్రాంతాల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు తగురీతిలో ఏర్పాట్లు చేయాల్సి ఉండగా ఎక్కడా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. నదిలోని స్నాన ప్రదేశాల్లో సరైన సౌకర్యాలు, ఏర్పాట్లు చేయడం లేదు.



ఇది మంచిర్యాలలోని ముల్కల్ల గోదావరినదిలో నిత్యం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే ప్రదేశం. ఇక్కడ సరైన రక్షణ చర్యలు లేకపోవడం, అక్కడక్కడ లోతట్టు ప్రాంతాలుండటంతో గత శివరాత్రి రోజు స్నానాలు ఆచరించేందుకు వచ్చిన నలుగురు యువకులు నీటిమునిగి ప్రాణాలు కోల్పోయారు.



వారం రోజుల కిందట ఓ యువకుడు గోదావరిలో కొట్టుకుపోయిన ప్రదేశం ఇది. నీటి ప్రవాహ ఉద్ధృతి తక్కువగా ఉన్నప్పటికీ ఇసుక తవ్వకాలతో ఏర్పడిన గోతులతో నదిలో నీటిలోతు తెలియక నదిలోకి దిగి కొట్టుకుపోయాడు. ఇదే ప్రాంతంలో నాచు పేరుకుపోయి ప్రమాదాలు జరిగేందుకు కారణమవుతోంది. నాచుపై కాలు పెట్టడంతో జారిపడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్నారు.



చెన్నూరులో గోదావరినది ఒడ్డు వరకు ప్రవహిస్తున్న దృశ్యమిది. నీటి ప్రవాహం ఒడ్డు వరకు చేరిన సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈప్రదేశంలో ఇసుక తవ్వకాలు చేపట్టడంతో నదిలో పెద్ద గోతులేర్పడ్డాయి. నది ఒడ్డునే స్నానం చేస్తున్నప్పటికీ ఇసుక గోతుల్లో నీటి లోతు అధికంగా ఉండటంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

### ఉత్తర వాహిని తీరం ప్రమాదాలకు నిలయం

చెన్నూరు పట్టణ సమీపంలోని పంచక్రోశ ఉత్తర వాహిని తీరం ఎంతో పవిత్రమైన ప్రదేశం. ఇక్కడ ఏడాది పొడవునా భక్తులు పుణ్యస్నానాలు ఆచరిస్తారు. చెన్నూరు మండలంలోని పొక్కూరు నుంచి చెన్నూరు మీదుగా కోటపల్లి మండలంలోని పారుపెల్లి భైరవగుట్ట వరకు ఈ నది పంచక్రోశులు ఉత్తరం దిశగా ప్రవహిస్తుండటం ఇక్కడి ప్రత్యేకత. కాశీలో గంగానది ఉత్తరం దిశగా 2 కి.మీ. ప్రవహిస్తుండగా చెన్నూరులో గోదావరినది 15 కి.మీ. ఉత్తరం దిశగా ప్రవహిస్తుండటంతో ఈ ప్రాంతం ఆధ్యాత్మిక ప్రాశస్త్యం సంతరించుకుంది. స్థానికులతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఇక్కడికి పుణ్యస్నానాలు ఆచరించడం, పితృకర్మలు చేసేందుకు వస్తుంటారు. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన గోదావరినది వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటుండటం భక్తులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రెండేళ్ల కాలంలో అనేక మంది గోదావరిలో మునిగి మృత్యువాత పడ్డారు.

* నది ప్రవాహ ఉద్ధృతి తక్కువగా ఉన్నప్పటికీ ఇసుక తవ్వకాలతో నదిలో పెద్దఎత్తున గోతులు ఏర్పడ్డాయి.

* 2009లో చెన్నూరు గోదావరినదిలో సింగరేణి సంస్థ పేరుతో ప్రారంభమైన ఇసుక తవ్వకాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఇసుక తవ్విన ప్రాంతంలో నదిలో ఏర్పడిన గోతుల కారణంగా ఎందరో భక్తులు మృత్యుఒడిలోకి వెళ్లారు.

### ఇవిగో కొన్ని విషాద ఘటనలు..

- వారం రోజుల కిందట చెన్నూరు పట్టణ సమీపంలోని పంచక్రోశ ఉత్తర వాహిణి గోదావరినది తీరంలో బీమారం మండలం రెడ్డిపెల్లి గ్రామానికి చెంది ఓ యువకుడు పుణ్యస్నానాలకు వచ్చి మృత్యువాత పడ్డారు.
- ముల్కల్ల గోదావరినదిలో ఈఏడాది శివరాత్రి పర్వదినం రోజున పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చి నలుగురు యువకులు మృత్యువాత పడ్డారు.
- 2014 జులైలో చెన్నూరు గోదావరినదిలో పుణ్యస్నానాలు చేస్తూ ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు నదిలో మునిగి మృత్యువాత పడ్డారు.
- 2015లో వేసవిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు నదిలో కొట్టుకుపోయి మృతి చెందారు.
- 2016లో కాళేశ్వరం మీదుగా ద్విచక్ర వాహనంపై గోదావరినది దాటి చెన్నూరుకు వస్తుండగా నదిలోని పలుగుల రేవులో పడి ఒక్కరు మృతి చెందారు.

### ఇలా చేస్తే ప్రమాదాలను నివారించవచ్చు..

- నదీతీరాల్లో ప్రమాదకర ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు, సూచికలు ఏర్పాటు చేయాలి
- స్నానాలు ఆచరించే ప్రదేశాల్లో స్నాన ఘట్టాలను తప్పనిసరిగా నిర్మించాలి
- స్నానాలు ఆచరించేవారు లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా నదిలో కంచెలను ఏర్పాటు చేయాలి
- ఇసుక తవ్వకాలతో నదుల్లో ఏర్పడిన గోతులను ఎప్పటికప్పుడు పూడ్చి వేయాలి.
- పర్వదినాలు, ప్రత్యేక రోజుల్లో పోలీసు, రెవెన్యూ, పంచాయతీ, మత్స్యశాఖ అధికారులు నదీతీరాల్లో నిరంతరం పర్యవేక్షణ చర్యలు చేపట్టాలి

# పర్యావరణ పరిరక్షకులు

- మట్టివిగ్రహాలతో ఆదర్శం

శాంతినగర్;ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే



**ఆధునిక పోకడలతో ఆకట్టుకొనే వస్తువులను ఉపయోగిస్తూ పర్యావరణానికి హాని కలిగిస్తున్న ప్రస్తుత తరుణంలో కొంతమంది పర్యావరణ పరిరక్షకులు మట్టివిగ్రహాలు వాడుతూ సమాజ హితాన్ని కోరుతున్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు పర్యావరణానికి హాని కలిగించొద్దనే భావనతో జిల్లాకు చెందిన కొందరు కళాకారులు, వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించే మండళ్ల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు మట్టి విగ్రహాలతో పర్యావరణానికి హాని కల్గించకుండా మట్టివిగ్రహాలతో ఆదర్శంగా నిలుస్తున్నారు. పంచభూతాల్లో ఒకటైన మట్టితో వినాయక ప్రతిమలను తయారుచేస్తుండగా, మరికొందరు మట్టితో రూపొందించిన వినాయకులను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ఆధ్యాత్మికతను పెంపొందించడంలో భాగస్వాములవుతున్నారు. ఇంకొందరు మట్టివిగ్రహాలను ఉచితంగా అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న తీరుపై 'న్యూస్‌టుడే' కథనం.**

వినాయక, దుర్గా నవరాత్రుల్లో మట్టిప్రతిమలే శ్రేయస్కరమని మన పురాణాలు చెబుతున్నాయి. దేవతామూర్తుల్లో అగ్రగణ్యుడైన వినాయకుడు పంచభూతాల స్వరూపుడు. పంచభూతాల్లో ఒకటైన నేల తల్లి నుంచి తీసిన సహజమైన నల్లనిమట్టితో తయారు చేసి ఆస్వరూపానికి నవరాత్రులూ పూజలు నిర్వహించి నీటిలో నిమజ్జనం చేయడమే పవిత్రమైన పూజలుగా భావిస్తారని వేదపండితులు చెబుతున్నారు. వినాయకుడికి నవరాత్రుల్లో పూజలు ప్రకృతితో మమేకమై ఉంటాయి. వినాయకునికి ప్రీతిపాత్రమైన పత్రి, అరటిపళ్లు, మొక్కజొన్న కంకులు, పూలు, పండ్లు, తిఉండ్రాళ్లతో చేసిన పిండివంటలు నైవేద్యంగా సమర్పిస్తారు. విగ్రహాల తయారీలోనూ ప్లాస్టర్‌ఆఫ్ ప్యారిస్‌ను వాడకుండా సహజత్వం కలిగిన మట్టితో రూపొందించిన వినాయకున్ని పూజిస్తేనే పూజా ఫలం లభిస్తుంది. మట్టి నీటిలోనూ తొందరగా కరిగి జీవరాశులకు హాని కల్గించకుండా ఉంటుంది. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టివిగ్రహాలను ప్రతిష్ఠించి ఆదర్శంగా నిలువాలి.



మట్టివిగ్రహాలను పంపిణీ చేస్తున్న జోగుఫౌండేషన్ సభ్యులు

## పర్యావరణ హితం.. వీరి అభిమతం

జోగుఫౌండేషన్ ఆధ్వర్యంలో గత మూడేళ్లుగా మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తూ వారు పర్యావరణ హితాన్ని చాటుతున్నారు. ఆసంస్థ ఛైర్మన్ జోగుప్రేమేందర్ సహకారంతో ప్రతిఏటా మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్నారు. జిల్లాకేంద్రంలోని ప్రధాన కూడళ్లైన వినాయక, అంబేడ్కర్, గాంధీ, కుమురంభీం కూడళ్లలో వినాయక చవితిరోజున ఆసంస్థ సభ్యులు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా అందజేస్తున్నారు. జైనథ్, బేల, మావల ప్రాంతాల్లోనూ వీరి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పర్యావరణ అటవీశాఖ మంత్రి జోగురామన్న చేతుల మీదుగా అందజేశారు. గతేడాది వీరు ఆదిలాబాద్ నియోజకవర్గంలోసుమారు 10 వేల మట్టి వినాయక విగ్రహాలను అందించి ఆదర్శంగా నిలిచారు. మట్టి వినాయక విగ్రహాలతో ఉత్సవాలను జరపడాన్ని ప్రోత్సహించడమే కాకుండా పర్యావరణ పరిరక్షణలో వీరు భాగస్వాములవుతున్నారు.

## ప్రతిష్టించిన చోటనే నిమజ్జనం



ఉన్నచోటనే నిమజ్జనం చేసేలా ప్రతిష్టించిన లంబోదరుడు



కుమార్ జనతా గణేష్ మండలం వారు ఏర్పాటు చేసిన బద్రీనాథ్ ఆలయ సెట్టింగ్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని కుమార్ పేట్ ప్రాంతంలో కుమార్ జనతా గణేష్ మండలి సభ్యులు 30 ఏళ్లుగా మండలి నాయకుడు తోట పరమేశ్వర్ నేతృత్వంలో వినాయక నవరాత్రులను ఘనంగా నిర్వహిస్తున్నారు. మట్టి విగ్రహాన్ని కళాకారులతో మంటపం వద్దే తయారు చేయించి అక్కడే ప్రతిష్ఠించి నవరాత్రులూ ఘనమైన పూజలు నిర్వహించి ఉన్నచోటనే నిమజ్జనం చేసి పర్యావరణ పరిరక్షణాన్ని కాపాడుతున్నారు. బద్రీనాథ్, కేదారీనాథ్, కేరళలోని శబరిమల పలు ఆలయాల సెట్టింగులను రూపొందించి ప్రజల మన్ననలు పొందుతున్నారు. జిల్లాకేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన లక్షలాది మంది వీరి సెట్టింగును దర్శించుకునేందుకు ఉత్సుకత చూపుతారు. మట్టి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు వైవిధ్యమైన ఆకట్టుకునే సెట్టింగులతో ఏటా ప్రత్యేక గుర్తింపును చాటుతున్నారు.

## మట్టి గణపతుల తయారీలో 50 ఏళ్ల చరిత్ర



మట్టివిగ్రహాల తయారీలో నిమగ్నమైన వేణుగోపాల్ కుటుంబం సభ్యులు

వినాయకుని ప్రతిమల తయారీలో పెట్టింది పేరు అశోక్‌రోడ్-పత్తర్‌ఘట్టి ప్రాంతం. మట్టి వినాయక విగ్రహాలు తయారుచేసే నకాశ కులస్థులు ఇక్కడే నివసించేవారు. ఇరవై ఏళ్ల క్రితం జిల్లాతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ఆయా మండపాల వారు ఇక్కడ తయారుచేసిన విగ్రహాలే కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం అక్కడ కొన్ని కుటుంబాల వారే నివసిస్తూ మట్టి విగ్రహాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వినాయక ఉత్సవాలు సమీపిస్తున్నాయంటే రెండునెలల నుంచి ఏర్పాట్లలో నిమగ్నమవుతారు. తొలుత చెరువు గట్ల నుంచి విగ్రహాలకు అవసరమైన మట్టిని సేకరించుకుంటారు. కుటుంబ సభ్యులంతా కలిసి విగ్రహాల తయారీలో నిమగ్నమవుతారు. ఒక్కోకుటుంబం పెద్దవి, చిన్నవి కలిపి 300 వరకు వినాయక మట్టి విగ్రహాలు రూపొందించి జీవనం సాగిస్తున్నారు. మట్టి విగ్రహాలను రూపొందించి పర్యావరణ పరిరక్షణను కాపాడుతున్న ఇలాంటి కళాకారులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించి ఆదుకోవాల్సిన అవసరముంది.

## పురాణగాథలు తెలిపేలా...

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని వినాయక్‌చౌక్ ప్రాంతంలో పంట పొలాల్లో వేసే విత్తనాలు, క్రిమిసంహారక మందుల వ్యాపారులు ఆరు సంవత్సరాలుగా మట్టి వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుతున్నారు. నాగ్‌పూర్‌కు చెందిన కళాకారులతో ఉన్నచోటనే మట్టితో విగ్రహాలను తయారు చేయించి నవరాత్రుల్లో ఆకట్టుకునే వెలుగుల మధ్య కదిలే విగ్రహ దృశ్యాలతో రామాయణ, మహాభారత, భాగవత గాథల్లోని నీతికథలను వివరిస్తూ భక్తుల్లో ఆధ్యాత్మికతను పెంపొందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్, హరితహారం పథకాలను విగ్రహాల రూపంలో ప్రతిష్ఠించి ప్రచారం చేస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవుతున్నారు. ఆరేళ్లుగా మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా ఆధ్యాత్మికతను పెంపొందించడంలో వీరు ప్రత్యేకతను చాటుతున్నారు.



స్వచ్ఛభారత్, హరితహారం పథకాలను ప్రచారం చేసేలా ఏర్పాటుచేసిన మట్టివిగ్రహాలు



కిసాన్ గణేష్ మండలి వారు కదిలాడే విగ్రహాలతో ఏర్పాటుచేసిన రామాయణ ఘటాన్ని వివరించే దృశ్యం




## నాణ్యతతో సంబంధం లేకుండా ప్రోత్సాహకాలు చెల్లించాలి

**శ్రీరాంపూర్ గ్రామీణం:** సింగరేణి ఉపరితల గనుల్లో పనిచేస్తున్న కార్మికులకు బొగ్గు నాణ్యతతో సంబంధం లేకుండా ప్రోత్సాహకాలు చెల్లించాలని తెబొగకాసం నాయకులు మంద మల్లారెడ్డి, బండి రమేష్ సూచించారు. మంగళవారం వారిక్కడ మాట్లాడుతూ బొగ్గు నాణ్యత లేదని ఆగస్టులో ఉపరితల గనుల్లోని కార్మికులకు యాజమాన్యం ఇన్సెంటివ్‌ను నిలిపివేసిందన్నారు. గనుల్లో బొగ్గును తీయడమే కార్మికుల పని అని క్వాలిటీ విషయం చూసుకోవాల్సింది యాజమాన్యమేనని వారు పేర్కొన్నారు. యాజమాన్యం చేయాల్సిన పనికి కార్మికులను బాధ్యులను చేస్తు ఇన్సెంటివ్ నిలిపివేయడం సరికాదన్నారు.

# ఆధునిక హంగులతో 'అల్పాహారశాల'

**కార్మికులకు నాణ్యమైన తినుబండారాలు** **నమూనాగా నిలుస్తున్న ఎస్సార్పీ ఓసీపీ క్యాంటీన్**


శ్రీరాంపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే

***'ఒకే కుటుంబం.. ఒకే లక్ష్యం.. ఒకే గమ్యం' అనే నినాదంలో ముందుకు సాగుతున్న సింగరేణి యాజమాన్యం సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తోంది. ఇందులో భాగంగానే కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని గనులపై విశ్రాంతి గదులు, స్నానపు గదులు, అల్పాహార శాలలు, మరుగుదొడ్లు ఏర్పాటుచేసింది. విధులకు హాజరయ్యే కార్మికుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని యాజమాన్యం సింగరేణిలోని అల్పాహార శాలలను ఆధునికీకరించి నాణ్యమైన ఆహార పదార్థాలను అందజేస్తుంది. శ్రీరాంపూర్ ఉపరితల గని వద్ద ఏర్పాటుచేసిన అల్పాహారశాల ఆధునిక హంగులతో రూపుదిద్దుకొని రుచికరమైన, నాణ్యమైన తినుబండరాలను అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఏరియాలోనే ఉత్తమ అల్పాహారశాలగా పేరుపొందిన శ్రీరాంపూర్ ఉపరితల గని క్యాంటీన్‌పై 'న్యూస్‌టుడే' కథనం..***

శ్రీరాంపూర్ ఉపరితల గనిలో 470 మంది శాశ్వత, 70 మంది తాత్కాలిక ఉద్యోగులు పనిచేస్తున్నారు. సాధారణంగా సింగరేణికి సంబంధించిన అల్పాహారశాలల్లోని తినుబండారాలను శాశ్వత కార్మికులకు మాత్రమే నిర్ణయించిన ధరలకు విక్రయిస్తారు. శ్రీరాంపూర్ ఉపరితల గనిలో శాశ్వత కార్మికులతోపాటు అక్కడ పనిచేస్తున్న తాత్కాలిక కార్మికులకు అవకాశం కల్పించారు. దీంతో ఈ అల్పాహారశాల రోజుకు సుమారు 300 మంది ఉద్యోగులకు అందుబాటులో ఉంటుంది. నెలకు సుమారు రూ.2.5 లక్షలు వెచ్చించి ఉద్యోగులకు ఆహార పదార్థాలను యాజమాన్యం అందిస్తోంది. క్యాంటీన్ల ఆధునికీకరణలో భాగంగా యాజమాన్యం 2015లో ఉపరితల గనిలో క్యాంటీన్ కోసం కొత్త భవనాన్ని నిర్మించింది. కొత్త భవనంలోకి మార్చిన తర్వాత అల్పాహారశాలకు కొత్తరూపు తీసుకువచ్చేందుకు రూ.2.3 లక్షలతో కుర్చీలు, బల్లలు తదితర సామగ్రిని కొనుగోలు చేశారు. గనిలో పనిచేసే ఉద్యోగులకు తాగునీటిని అందించేందుకు క్యాంటీన్‌లో తాగు నీటి శుద్ధి యంత్రాన్ని, విధుల్లో అలసిపోయిన కార్మికులు అలసటను తొలగించేందుకు సౌండ్ సిస్టంను అందుబాటులో ఉంచారు. క్యాంటీన్ పక్కన ఉన్న స్థలంలో ఆకు కూరలు, కూరగాయలు పండిస్తూ అల్పాహారాలు వండేందుకు వినియోగిస్తున్నారు. ప్రతి రోజు రెండు షిఫ్టుల్లో సూచిక(మెనూ) ప్రకారం అల్పాహారాలు అందుబాటులో ఉంటాయి. కాలానుగుణంగా, ఉద్యోగుల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని సూచికలో మార్పులు చేస్తుంటారు. వేసవి కాలంలో పెరుగన్నం, మజ్జిగ అందిస్తారు. క్యాంటీన్ ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు ఇద్దరు పొరుగు సేవల కార్మికులను నియమించారు.



శ్రీరాంపూర్ ఉపరితల గని వద్ద క్యాంటీన్



కొత్తగా ఏర్పాటుచేసిన కుర్చీలు, బల్లా

### రుచికర టిఫిన్లు దొరుకుతున్నాయి

**- మేకల రవి, జనరల్ మజ్దూర్**



రెండేళ్లుగా శ్రీరాంపూర్ ఉపరితల గనిలో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్నాను. విధులు నిర్వహిస్తున్నప్పటి నుంచి ఇక్కడి క్యాంటీన్‌లో నాణ్యమైన టిఫిన్లు దొరుకుతున్నాయి. క్యాంటీన్‌లో తినే ఆహార పదార్థాల రుచి ఇంట్లో వండుకొని తిన్న వాటిలానే అనిస్తుంటుంది. ఇదివరకు ఎప్పుడూ చెడిపోయిన, నాణ్యత లేని టిఫిన్లను క్యాంటీన్‌లో చూడలేదు.

### తక్కువ ధరలకు లభిస్తున్నాయి

**- శీలం చిన్నయ్య, ఎస్సార్పీ ఓసీపీ**



ఇక్కడ అల్పాహారాలు చాలా తక్కువ ధరలకు లభిస్తున్నాయి. ఆహార పదార్థాల నాణ్యతలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఎప్పుడూ ఉండటం వల్ల ఉద్యోగులకు అల్పాహారాలు సకాలంలో అందుతున్నాయి.

### రాజీపడటం లేదు

**- ఎస్వీ రాజేశ్వరరావు, సంక్షేమాధికారి, ఎస్సార్పీ ఓసీపీ**



ఎస్సార్పీ ఓసీపీ క్యాంటీన్‌లో తయారుచేసే ఆహార పదార్థాల నాణ్యతలో రాజీ పడటం లేదు. నాణ్యమైన అల్పాహారాలను అందిస్తున్నందునే దీనికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. శ్రీరాంపూర్ ఉపరితల గనిలో ద్వార, ఇతర సమావేశాలు జరిగినప్పుడు సంఘాల నాయకులు ఇక్కడికి వస్తే క్యాంటీన్‌లో అల్పాహారాన్ని తప్పకుండా తింటారు.

## గాయపడిన కార్మికుడిని పరామర్శించిన ప్రభుత్వ విప్

**రామకృష్ణాపూర్:** మందమర్రి ఏరియాలోని కాసిపేట గనిలో జరిగని ప్రమాదం గాయపడిన రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముత్యం కోమురయ్యను రాష్ట్ర ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు పరామర్శించారు. మంగళవారం స్థానిక ఆసుపత్రికి విచ్చేసిన ఆయన కొమురయ్యతో పాటు వైద్యం పొందుతున్న కోలిపాక పోశం అనే వ్యక్తిని ఆయన పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యులతో మాట్లాడి బాధితులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. విప్ వెంట తెబొగకాసం, తెరాస నాయకులు పాల్గొన్నారు.



కార్మికుడిని పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, నాయకులు

## డోర్లి-1లో కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

**రెబ్బెన:** బెల్లంపల్లి ఏరియా డోర్లి-1 ఓసీపీలో కార్మికుల నుంచి సేకరించిన విరాళాలను బాధిత కుటుంబానికి అందజేశారు. డోర్లి-1లో హెడ్ఓవర్‌మెన్‌గా పని చేసే రుక్మపతి గత మే నెలలో అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం గని ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒక్కొక్క కార్మికుని నుంచి రూ.500ల చొప్పున సేకరించిన రూ.1,54,500ల మొత్తాన్ని సీనియర్ కార్మికుడు ఎం.నారాయణ చేతుల మీదుగా మృతుని భార్య పద్మవతికి అందజేశారు. గని మేనేజర్ ఉమాకాంత్ మాట్లాడుతూ రుక్మపతి సంస్థకు అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. తెబొగకాసం ఫిట్ కార్యదర్శి రవీంద్రకుమార్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి నర్సింహరావు సంక్షేమాధికారి వేణు, అధికారులు పాల్గొన్నారు.



కార్మికుని భార్యకు చెక్కును అందజేస్తున్న సీనియర్ కార్మికుడు నారాయణ

## ఎన్టీపీపీలో పెరిగిన వేతనాలను తక్షణమే అమలుచేయాలి

**జైపూర్, న్యూస్‌టుడే:** పెరిగిన వేతనాలను తక్షణమే అమలు చేయాలని కేంద్ర కనీసవేతనాల సలహామండలి ఛైర్మన్ ఆవుల గోవర్ధన్ అన్నారు. మంగళవారం ఎస్టీపీపీలో ఒప్పంద కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. ఇందులో భాగంగా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నూతన వేతన ఒప్పందం ప్రకారం జీతాలు, 19.01.2017 నుంచి పెరిగిన వేతనాల బకాయిలు చెల్లించాలని ఎస్టీపీపీ అధికారులను ఆదేశించారు. అలాగే ఈ ప్రాంతంలో ఈఎస్ఐ 100 పడకల ఆసుపత్రి వచ్చేలా కృషి చేస్తానన్నారు. పలువురు కార్మిక సంఘాల నాయకులు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని ఛైర్మన్‌కు అందజేశారు. అనంతరం సమావేశ మందిరంలో ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సంజయ్‌కుమార్ సూర్, జీఎం రాజేష్‌లను కలిసి విద్యుత్తు కేంద్రం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఎమ్ఎస్ రాష్ట్ర కార్యదర్శి పులి రాజిరెడ్డి, జాతీయ కమిటి సభ్యుడు కళ్యోలు భట్టాచార్యులు, సింగరేణి వర్కింగ్ ప్రెసిడెంట్ భూర్ల లక్ష్మినారాయణ, భాజపా జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, దళితమోర్చా రాష్ట్రకార్యదర్శి వెంకటరమణ, ఎస్టీపీపీ పర్సనల్ మేనేజర్లు పాల్గొన్నారు.

# సీఐటీయూ కార్యవర్గం ఎంపిక

### రీజియన్ నుంచి తొమ్మిది మందికి అవకాశం

### అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రాజారెడ్డి, మంద నర్సింహరావు ఎన్నిక

**మందమర్రి, న్యూస్‌టుడే:** సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రామగుండం-3 ఏరియాలోని సెంటినరీకాలనీలో నిర్వహిస్తున్న సీఐటీయూ రాష్ట్ర 14వ మహాసభల్లో భాగంగా రెండో రోజైన మంగళవారం నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. కార్యవర్గంలో బెల్లంపల్లి రీజియన్ నుంచి తొమ్మిది మందికి స్థానం దక్కింది. యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా సీనియర్ నేత పి.రాజారావును ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా తుమ్మల రాజారెడ్డి, మంద నర్సింహరావు, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా బెల్లంపల్లి రీజియన్‌కు చెందిన ఎస్.నాగరాజ్‌గోపాల్‌కు సముచిత స్థానం దక్కింది. కోశాధికారిగా జి.రాజరావు, ప్రచార కార్యదర్శిగా మెండె శ్రీనివాస్‌తో పాటు తొమ్మిది మంది ఉపాధ్యక్షులు, కార్యదర్శులుగా 9 మందిని, ఆర్గనైజర్లుగా ఎనిమిది మంది, రాష్ట్ర కమిటీ సభ్యులుగా 43 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

**మందమర్రి ఏరియా నుంచి ఇద్దరికి స్థానం..**

బెల్లంపల్లి రీజియన్‌లోని మందమర్రి ఏరియాకు చెందిన ఎస్.వెంకటస్వామిని యూనియన్ ఉపాధ్యక్షుడిగా, కార్యదర్శిగా రామగిరి రామస్వామిలను ఎన్నుకున్నారు. రీజియన్ నుంచి ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా ఎ.రమణయ్య, ఎ.శ్రీనివాస్, భూపతిరాజు, కట్ట నర్సింహరావు, శంకర్, జగన్‌మోహన్‌లను నియమించారు.



నాగరాజ్‌గోపాల్



ఎస్.వెంకటస్వామి



రామగిరి రామస్వామి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఓసీ వ్యతిరేక కమిటీ సభ్యులు

## సింగరేణి యాజమాన్యం దిష్టిబొమ్మ దహనం

**జైపూర్:** ఇందారంలో ఉపరితల గని ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం ఓసీ వ్యతిరేక కమిటీ సభ్యులు యాజమాన్యం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఓసీ వ్యతిరేక యువత అధ్యక్షుడు అరికె సంతోష్ మాట్లాడుతూ... సింగరేణి ఇందారం ప్రజల అభిప్రాయాలకు వ్యతిరేకంగా ఓసీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకోవడం అన్యాయమన్నారు. ఎట్టి పరిస్థితిలోనూ ఉపరితల గని ఏర్పాటును అనుమతించబోమని ఎన్ని ఉద్యమాలు చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. భవిష్యత్తు కార్యచరణను ప్రకటించి రోజువారీగా నిరసన తెలియజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీపతిరావు, వార్డు సభ్యుడు రేగుంట గట్టయ్య, ప్రశాంత్, సురేష్, నవిన్, కిరణ్, ఇందారం, టేకుమట్ల యువకులు పాల్గొన్నారు.

# సింగరేణి ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల ఉచిత పంపిణీ

**రెబ్బెన, న్యూస్‌టుడే:** బెల్లంపల్లి ఏరియాలో వినాయక చవితి పండగను పురస్కరించుకొని ఈ నెల 24న గోలేటిలోని సింగరేణి డిస్పెన్సరీ సమీపంలో బస్సు షెల్టర్ వద్ద ఉచితంగా మట్టితో తయారు చేసిన వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్నట్లు బెల్లంపల్లి ఏరియా అధికార ప్రతినిధి, డీజీఎం(పర్సనల్) జె.కిరణ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాయంత్రం 3.30 నిమిషాలకు వినాయక ప్రతిమలను బెల్లంపల్లి ఏరియా జీఎం కె.రవిశంకర్ చేతుల మీదుగా కార్మిక కుటుంబాలకు అందజేస్తామన్నారు. మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని కాలనీ వాసులను చైతన్యం చేసేందుకు సింగరేణి పాఠశాల విద్యార్థులు, కార్మికులు, అధికారులు, సేవా, యోగా సభ్యులచే ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించి, మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని కోరారు.

**బెల్లంపల్లి:** ఈనెల 25న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మందమర్రి ఏరియా సింగరేణి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈనెల 24న బెల్లంపల్లి పట్టణంలోని పాత జీ.ఎం.కార్యాలయం ఆవరణలో ఉన్న ఏజెంట్ కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని బెల్లంపల్లి పట్టణంలోని సింగరేణి కార్మికులు, వారి కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

**కాసిపేట గ్రామీణం:** మందమర్రి ఏరియాలోని సింగరేణి యాజామాన్యం ఆధ్వర్యంలో ఈనెల 24 న సోమగూడెం డిస్పెన్సరీలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు ఏరియా సింగరేణి అధికారి రామ్మూర్తి తెలిపారు. కార్మిక కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ నెల 24న సాయంత్రం మూడు గంటల నుంచి ఈ విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

**మందమర్రి:** మందమర్రి ఏరియా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో ఈనెల 24న సింగరేణి కార్మికవాడల్లో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణి చేస్తామని ఏరియా సింగరేణి అధికార ప్రతినిధి, డీజీఎం పి.గోవిందరాజు తెలిపారు. ఈనెల 24న సాయంత్రం 3 గంటలకు మందమర్రిలోని సీఈఆర్ క్లబ్‌లో, రామకృష్ణాపూర్‌లోని సింగరేణి ఠాగూర్ స్టేడియంలో, సోమగూడెంలోని డిస్పెన్సరీలో, బెల్లంపల్లిలోని సింగరేణి ఏజెంటు కార్యాలయంలో పంపిణి కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.


### మట్టి గణపతులనే పూజించాలి

**- సత్యనారాయణ, ఇన్చార్జి జీఎం**



**శ్రీరాంపూర్ గ్రామీణం:** పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగరేణి కార్మిక కుటుంబాలు మట్టి గణపతులనే పూజించాలని శ్రీరాంపూర్ ఏరియా ఇన్చార్జి జీఎం పీవీ సత్యనారాయణ సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మట్టితో తయారుచేసిన గణపతులను నిమజ్జనం చేస్తే అవి త్వరగా కరిగిపోయి నీటి కాలుష్యం ఏర్పడదన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం సింగరేణి సేవా భవన్‌లో ఈ నెల 24న యాజమాన్యం మట్టి గణపతులను పంపిణీ చేస్తుందని చెప్పారు.

# నిరుద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు



పాతజిల్లా ప్రాతిపదికన నియామకాలు

ఉమ్మడి జిల్లాలో గుర్తించిన ఉపాధ్యాయ పోస్టులు 1592

**పాతజిల్లా ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్న నిరుద్యోగుల అభ్యర్థన ఎట్టకేలకు కార్యరూపం దాల్చనుంది. రాష్ట్రపతి ఉత్తర్వులు అమల్లో ఉన్నందున ఉద్యోగాల భర్తీకి పాతజిల్లాలనే పరిగణలోకి తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ తాజా నిర్ణయం పట్ల నిరుద్యోగుల అభ్యర్థుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రధానంగా ఇతర ఉద్యోగాల కంటే ఉపాధ్యాయ ఎంపిక పరీక్ష(డీఎస్సీ) కోసం ఉమ్మడి జిల్లాలో 20 వేల మందికి పైగా నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. కొత్తజిల్లాలవారీగా కాకుండా ఉమ్మడిజిల్లా ప్రాతిపదికన నియామకాలు చేపట్టాలని నిరుద్యోగులు డిమాండ్‌చేస్తున్న సంగతి తెలిసిందే. ప్రభుత్వం నియామకాల విషయంలో స్పష్టతనివ్వడంతో సంబంధీకుల్లో హర్షం వ్యక్తమవుతోంది. ఈనేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఉన్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలు, డీఎస్సీ నిర్వహణ తదితర అంశాలతో కూడిన 'న్యూస్‌టుడే' కథనం.**

పాలనాప్రాంగణం,
**ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే**

## పోస్టులు తక్కువ.. పోటీ ఎక్కువ

జిల్లాలో ఒకట్రెండు పోస్టులు ఉండే ఇతర శాఖల ఉద్యోగాల కంటే వందల సంఖ్యలో భర్తీచేసే ఉపాధ్యాయుల పోస్టులపైనే నిరుద్యోగులు అత్యధికంగా ఆశలు పెట్టుకున్నారు. ఈ క్రమంలో అందుకు అవసరమయ్యే డీఎడ్, బీఎడ్ శిక్షణ పూర్తి చేసిన అభ్యర్థులు సంఖ్య ఏటేటా పెరుగుతూ పోతోంది. దీనికితోడు ప్రభుత్వం ఉపాధ్యాయ పరీక్షకు అర్హతగా టెట్ నిర్వహిస్తోంది. ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రకటన నేపథ్యంలో కిందటి నెల జులై 23న టెట్ పరీక్ష నిర్వహించింది. ఈ పరీక్షకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 23,739మంది హాజరు కాగా.. పేపర్-1 పరీక్షలో 8449 మందికి 4923మంది, అదేవిధంగా పేపర్-2 పరీక్షలో 15,290మందికిగాను కేవలం 3,262మంది మాత్రమే అభ్యర్థులు అర్హత సాధించారు. తాజాగా నిర్వహించిన టెట్ పరీక్షను బట్టి జిల్లాలో 8,185మంది ఉపాధ్యాయఎంపిక పరీక్ష రాసేందుకు అర్హులన్నమాట. అయితే గతంలో 2012లో నిర్వహించిన టెట్‌లో మరో ఐదువేల మంది అర్హత సాధించి ఉన్నారు. అందరిని కలుపుకుంటే ఉమ్మడిజిల్లావ్యాప్తంగా గతంలో, తాజాగా నిర్వహించిన టెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు 15 వేలకు మించి ఉండరని విద్యాశాఖవర్గాలు చెబుతున్నాయి. ఇందులో ఎస్జీటీ పరీక్ష రాసేవారు 6వేల మంది ఉంటే.. మిగిలిన వారంతా స్కూల్‌అసిస్టెంట్ పరీక్షకు హాజరయ్యే అవకాశముందని ఆశాఖ అధికారుల అంచనా. ఉమ్మడి రాష్ట్రంలో 2012లో అప్పటి ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. తదనంతరం రాష్ట్ర విభజన ఉద్యమాలు.. కొత్త రాష్ట్రం ఏర్పాటు తదితర కారణాల వల్ల నియామక పరీక్ష నిర్వహణకు ఆటంకాలు ఎదురవుతూ వచ్చాయి. ఇప్పటికే టీఎస్‌పీఎస్సీ ద్వారా వివిధ శాఖల్లో కొంత వరకు పోస్టులు భర్తీ చేసినప్పటికీ.. ఉపాధ్యాయ నియామకాలను చేపట్టడం లేదు. దీంతో ఐదేళ్ల కిందటి డీఎస్సీలో ఎంపిక కానివారితో పాటు తదనంతరం డీఎడ్, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులు ఈ పరీక్ష కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఆలస్యం కావడంతో అభ్యర్థుల మధ్య పోటీ తీవ్రంగా పెరిగింది. పోస్టుల సంఖ్యకు పోటీపడే అభ్యర్థుల సంఖ్యకు భారీగా తేడాలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా స్కూల్‌అసిస్టెంట్ సోషల్, బయోసైన్సులో ఒక్కో పోస్టుకు సగటున 500మంది అభ్యర్థులు పోటీపడే అవకాశముందని విద్యాశాఖ వర్గాలు గతంలో జరిగిన డీఎస్సీకి హాజరైన అభ్యర్థుల సంఖ్యను బట్టి చెబుతున్నారు. ఎస్జీటీల్లో మాత్రం పోటీ చాలా తక్కువగా ఉంటోందంటున్నారు. కిందటి డీఎస్సీలో ఒక్కో పోస్టుకు ముగ్గురు నుంచి ఐదుగురు పోటీపడగా.. ఈసారి ఆసంఖ్య పదిలోపు ఉండవచ్చని విద్యాశాఖవర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1592పోస్టులు ఖాళీగా ఉన్నట్లు విద్యాశాఖాధికారులు ప్రభుత్వానికి ఇదివరకే ప్రతిపాదనలు సమర్పించారు. ఈ పోస్టులు దక్కించుకునేందుకు పాత జిల్లాలో సుమారు 15వేల మంది వరకు పోటీపడే అవకాశం ఉంది. ఇప్పటికే శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులు కొందరు కుటుంబ బాధ్యతల రిత్యా ప్రైవేటు ఉద్యోగాలు చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతుండగా.. ఈ పోస్టులు ఎలాగైనా దక్కించుకోవాలని మరికొందరు అభ్యర్థులు చదువులోనే నిమగ్నమయ్యారు. జిల్లాల విభజన నేపథ్యంలో కొత్తజిల్లాల వారీగా నియామకాలు చేపడతారని ప్రచారం జరగడంతో పరీక్షకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమైంది. అసలే పోస్టులు తక్కువగా ఉండటం.. జిల్లాలవారీగా నిర్వహిస్తే తమకు అన్యాయం జరుగుతుందని ఆవేదన చెందారు. ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వం ఎట్టకేలకు పాతజిల్లాల ప్రాతిపదికన నియామకాలు చేపడతామని ప్రకటించడంతో ఉద్యోగ ప్రకటనే తరువాయిగా నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

**ఉమ్మడిజిల్లాలో ఇవీ ఉపాధ్యాయ ఖాళీలు..**

**జిల్లాలోని మైదాన ప్రాంతంలో**

| పోస్టుల వివరాలు | - 1014 |
|---|---|
| స్కూల్ అసిస్టెంట్లు | - 91 |
| లాంగ్వేజ్ పండిట్‌లు | - 74 |
| పీఈటీలు | - 22 |
| సెకండరీ గ్రేడ్ టీచర్లు | - 827 |

**జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో**

| పోస్టుల వివరాలు | - 578 |
|---|---|
| స్కూల్ అసిస్టెంట్లు | - 30 |
| లాంగ్వేజ్ పండిట్‌లు | - 48 |
| పీఈటీలు | - 03 |
| సెకండరీ గ్రేడ్ టీచర్లు | - 497 |



టెలీమెడిసిన్ విధానంపై అవగాహన కల్పిస్తున్న ప్రత్యేక శిక్షకుడు సతీష్

# రిమ్స్‌లో టెలీమెడిసిన్ విధానం

## సిబ్బందికి ప్రారంభమైన శిక్షణ తరగతులు

**ఎదులాపురం, న్యూస్‌టుడే:** రిమ్స్‌లో త్వరలో ప్రారంభించనున్న టెలీ మెడిసిన్ విధానం గురించి శిక్షణా తరగతులు మంగళవారం ప్రారంభించారు. హెచ్‌పీ కంపనీ నుంచి ఇక్కడకు వచ్చిన ప్రత్యేక సాంకేతిక నిపుణుడు సతీష్ రిమ్స్ సిబ్బందికి ఈ విధానంపై అవగాహన కల్పించారు. వ్యాధిగ్రస్థుడికి అవసరమైన చికిత్స చేసే వైద్యుడు అందుబాటులో లేకపోతే ఈ విధానం ద్వారా చికిత్స అందించడానికి ఇక్కడ ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కొన్ని పరికరాలు బిగించటం పూర్తి కాగా మరికొన్నింటిని ఏర్పాటు చేస్తున్నారు. రోగికి సంబంధించిన అన్ని వివరాలను అంతర్జాలం ద్వారా హైదరాబాద్‌లోని ప్రత్యేక వైద్య నిపుణుడికి అందజేస్తారు. ఆయన ప్రత్యక్షంగా తెరపై రోగిని పరిశీలించడంతో పాటు వివరాలు పరిశీలించి ఎలాంటి వైద్యసేవలు అందించాలో సూచిస్తారు. ఈ మేరకు ఇక్కడ ఉన్న సిబ్బంది చికిత్సలు అందించటానికి విధానంలో హైదరాబాద్‌లోని వైద్యుడిని ఎలా సంప్రదించాలో అవగాహన కల్పించారు. బుధవారం కూడా అవగాహన కార్యక్రమం కొనసాగనుంది. కార్యక్రమంలో రిమ్స్ సంచాలకుడు కె.అశోక్, రక్తనిధి కేంద్రం వైద్యుడు రోహిత్‌వర్మ, నర్సులు, ఇతర సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారు.

# ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

## బీఎస్ఎన్ఎల్ డీజీఎం ఎస్.నాగిరెడ్డి

**ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే:** బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు తమ సిమ్‌లను సమీప వినియోగ సేవా కేంద్రంలో ఆధార్ అనుసంధానం చేసుకోవాలని ఆ సంస్థ డీజీఎం ఎస్.నాగిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని జీఎంటీడీ బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరి లోపు సిమ్‌లను ఆధార్ అనుసంధానం చేసుకోవాలని, పరిమితి దాటితే సిమ్‌లు డిస్‌కనెక్ట్ అవుతాయన్నారు. ఈ ప్రక్రియ ఉచితంగా చేస్తారని, ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే ఈనెల 28 నుంచి 30 తేదీల్లో ఉమ్మడి జిల్లాల్లోని ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం, మంచిర్యాల జిల్లాల్లో ల్యాండ్‌లైన్ మేళాలు నిర్వహిస్తున్నామని, ఇందులో తమ సిబ్బంది ఇంటింటికెళ్లి ల్యాండ్‌లైన్, బ్రాడ్‌బ్యాండ్ గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తారని చెప్పారు. ల్యాండ్‌లైన్ కనెక్షన్‌కు ఎలాంటి ఇన్స్టాలేషన్ ఛార్జీలు ఉండవని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని పేర్కొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న పుర అధ్యక్షురాలు రంగినేని మనీష



పోటీల్లో తలపడుతున్న వివిధ పాఠశాలల జట్లు

# హోరాహోరీగా జోనల్‌స్థాయి కార్ఫ్‌బాల్ పోటీలు

## రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలి: పుర అధ్యక్షురాలు మనీష

**ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.1లో 17, 19 ఏళ్ల విభాగం జోనల్‌స్థాయి కార్ఫ్‌బాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. రాష్ట్రస్థాయి ఎంపికే ధ్యేయంగా క్రీడాకారులు ఆడారు. ఆదిలాబాద్, నిర్మల్, కుమురంభీం, మంచిర్యాల జిల్లాలకు చెందిన విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. ప్రారంభోత్సవానికి పుర అధ్యక్షురాలు రంగినేని మనీష హాజరై మాట్లాడారు. ఈ పోటీల్లో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలని ఆకాంక్షించారు. పాత ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ప్రతినిధ్యం వహిస్తున్న క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చాలని తెలిపారు. అనంతరం క్రీడాకారులతో పరిచయం చేసుకొని పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య నిర్వాహక కార్యదర్శి జక్కుల శ్రీనివాస్, పోటీల నిర్వాహకుడు ఎన్.హరిచరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు దయానంద్‌రెడ్డి, రాష్ట్రపాల్, జె.సాయికుమార్, విఠల్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీవిద్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సలీమొద్దిన్, సిబ్బంది పిల్లి కిషన్, లక్ష్మణ్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించాలని వీధినాటిక ద్వారా ప్రదర్శనలిస్తున్న కళాజాత బృందం

# మట్టి విగ్రహాలే ప్రతిష్ఠించండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి..

## రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో కళాజాత

**ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే:** పర్యావరణాన్ని పరిరక్షించాలంటే మట్టి విగ్రహాలే ప్రతిష్ఠించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి కళాజాత ద్వారా ప్రచారం నిర్వహిస్తోంది. మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జనసమూహ కేంద్రాల్లో వీధి నాటిక కళాజాత బృందం పద్మారావు, వి.కుమార్, రాజా, వి.ప్రశాంత్‌లు పీఓపీ విగ్రహ ప్రతిష్ఠాపనతో కలిగే అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. పీఓపీ విగ్రహానికి విషపూరిత రసాయన రంగులు ఉంటాయని, ఇవి నీటిలో కరగకుండా పైకి తేలుతాయని, తద్వారా నీటిని సేవించిన పశుపక్ష్యాదులు మరణిస్తాయని, ప్రజలు ఉదరకోశ తదితర రుగ్మతలకు గురవుతారని వివరిస్తున్నారు. వినాయక చవితి సందర్భంగా ప్రతిఒక్కరూ మట్టి విగ్రహాలు మాత్రమే ప్రతిష్ఠించాలని, నిమజ్జనం చేసేటప్పుడు మట్టి వినాయకుడు నీటిలో తేలికగా కరిగిపోతుందన్నారు.

క్లిక్... క్లిక్



నాలుగు వరుసల రహదారి పక్కన ప్రమాదకరంగా పోసిన మట్టి, రాళ్లకుప్పలు

# రహదారి 'ప్రమాద' భరితం!

**జాతీయ రహదారి పక్కన మట్టితో పాటు బండరాళ్ల కుప్పలు ప్రమాదకరంగా వేశారు. ఆ మార్గంలో రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశముంది. అధికారులు స్పందించి మట్టి, రాళ్ల కుప్పలను తొలగించాలని వాహనదారులే కాకుండా అటుగా వెళ్తోన్న గ్రామస్థులు కోరుతున్నారు.**

**- ఈనాడు ఆదిలాబాద్**

# పదోతరగతి

## సాంఘికశాస్త్రం

# ప్రతిభ

★ పాఠ్యపుస్తకంలో అభ్యాసాల్లో ఇచ్చిన ప్రశ్నలను ఉన్నవి ఉన్నట్లుగా పబ్లిక్ పరీక్షల్లో ఇవ్వరు. వాటిలో చాలా తక్కువ శాతం ప్రశ్నలు మాత్రమే రావచ్చు. కాబట్టి ఇచ్చిన ప్రశ్నల స్వభావం తెలుసుకుని, జవాబులు రాయాలి.

★ ఒకే ప్రశ్నను వివిధ రూపాల్లో అడిగే అవకాశం ఉంది. జవాబు చదివే సమయంలోనే దానిపై రకరకాల ప్రశ్నలను తయారు చేసి పెట్టుకుంటే ఉపయుక్తంగా ఉంటుంది.

★ ఏ ప్రశ్నకు ఏ జవాబు రాయాలో, ఎలా రాయాలో తెలుసుకుని వాటిపై పట్టు సాధిస్తే పరీక్షలో ఎలాంటి ప్రశ్నకైనా తేలికగా జవాబు రాయగలుగుతారు.

## భారతదేశం - భౌగోళిక స్వరూపాలు

### ఒక మార్కు ప్రశ్నలు

★ కింది పటాన్ని గమనించి ఇచ్చిన ప్రశ్నకు జవాబివ్వండి.




ప్ర: దక్కన్ పీఠభూమి సరిహద్దులను రాయండి.

జ. ఉత్తరాన: సాత్పురా పర్వతాలు, దక్షిణాన: నీలగిరి పర్వతాలు, తూర్పున: తూర్పు కనుమలు; పశ్చిమాన: పశ్చిమ కనుమలు దక్కన్ పీఠభూమికి సరిహద్దులుగా ఉన్నాయి.

★ కింది పటాన్ని గమనించి ఇచ్చిన ప్రశ్నకు జవాబివ్వండి.

**హిమాలయాలు - సమాంతర శ్రేణులు**

| | హిమాద్రి శ్రేణి | నిమ్న హిమాలయాలు | శివాలిక్ శ్రేణి |
|---|---|---|---|
| ఎత్తు | 6100 మీ. | 3700–4500 మీ. | 900 – 1100 మీ. |
| ఉనికి | హిమాలయాల్లో అన్నిటి కంటే ఉత్తరాన ఉంది. | హిమాద్రి, శివాలిక్ శ్రేణుల మధ్యలో ఉంది. | అన్నింటి కంటే దక్షిణాన ఉన్న శ్రేణి |

ప్ర: హిమాలయాల్లో ఎత్తయిన పర్వత శ్రేణి ఏది? దానికి ఉన్న మరో పేరేమిటి?

జ. 'హిమాద్రి శ్రేణి' హిమాలయాల్లో ఎత్తయిన పర్వత శ్రేణి. దీనికి మరోపేరు 'ఉన్నత హిమాలయాలు.'

# దేశంలో అత్యంత పొడవైన కాలువ..?



రచయిత
బొమ్మిడి నారాయణరావు
విషయ నిపుణులు

ప్ర: దేశంలో అత్యంత పొడవైన కాలువ ఏది? ఇది ఏ రాష్ట్రానికి నీరు అందిస్తుంది?

జ. దేశంలో అత్యంత పొడవైన కాలువ ఇందిరా గాంధీ కాలువ. ఇది ముఖ్యంగా రాజస్థాన్‌కు నీరు అందిస్తుంది.

ప్ర: శివాలిక్ పర్వతాలకు వివిధ ప్రాంతాల్లో ఉన్న పేర్లను తెలపండి.

జ. జమ్మూ ప్రాంతంలో జమ్మూ కొండలనీ, అరుణాచల్ ప్రదేశ్‌లో మిష్మి కొండలనీ, అసోంలో కచార్ అనీ పిలుస్తారు.

ప్ర: డూన్ అంటే ఏమిటి? ఉదాహరణ ఇవ్వండి.

జ. నిమ్న హిమాలయాలు, శివాలిక్ శ్రేణుల మధ్య ఉండే లోయలను స్థానికంగా 'డూన్'లు అంటారు

ఉదా: డెహ్రాడూన్.

ప్ర: 'భారతదేశం ద్వీపకల్పం' అనే పదాన్ని తరచూ ఎందుకు ఉపయోగిస్తారు?

జ. భారతదేశానికి మూడువైపులా నీరు ఉన్న కారణంగా, దక్షిణ భారతదేశాన్ని ఉద్దేశించి 'ద్వీపకల్పం' అనే పదాన్ని తరచూ ఉపయోగిస్తారు.

ప్ర: అండమాన్ నికోబార్ దీవుల్లో అగ్ని పర్వతాల వల్ల ఏర్పడిన దీవులేవి?

జ. నార్కొండం, బారెన్ దీవులు అగ్ని పర్వతాల వల్ల ఏర్పడ్డాయి.

ప్ర: ప్రపంచ పటంలో భారతదేశాన్ని గుర్తించాలంటే ఏయే అక్షాంశ, రేఖాంశాలు మనకు తెలియాలి?

జ. $8^\circ4' – 37^\circ6'$ ఉత్తర అక్షాంశాలు, $68^\circ7' – 97^\circ25'$ తూర్పు రేఖాంశాలు మనకు తెలిస్తే, ప్రపంచ పటంలో భారతదేశాన్ని సులభంగా గుర్తించవచ్చు.

ప్ర: రెండు నదుల మధ్య ప్రాంతాన్ని ఏమని అంటారు?

జ. రెండు నదుల మధ్య ప్రాంతాన్ని 'అంతర్వేది' అని అంటారు.

ప్ర: గోవా వెళితే మనకు తారసపడే తీర ప్రాంతమేది?


జ. గోవా వెళితే మనకు కొంకణ తీరం తారసపడుతుంది.

ప్ర: పూర్వాంచల్ పర్వతాలు అని వేటిని పిలుస్తారు?

జ. భారతదేశానికి తూర్పు సరిహద్దుగా ఉన్న హిమాలయాలను పూర్వాంచల్ పర్వతాలు అంటారు.

ప్ర: కింది చిత్రంలో పేర్కొన్న పగటి సమయాలను పరిశీలించి, వాటికి సంబంధించిన నగరాలను (ఢిల్లీ, లండన్) గడుల్లో రాయండి.

జ.




### నాలుగు మార్కుల ప్రశ్న

ప్ర: 'భారతదేశంలోని మైదాన ప్రాంతాలు వ్యవసాయానికి దోహదపడినంతగా పీఠభూమి ప్రాంతాలు తోడ్పడవు' - ఈ వాక్యాన్ని ఎలా సమర్థిస్తారు?

జ. హిమాలయ నదులైన గంగా, సింధూ, బ్రహ్మపుత్ర వాటి ఉప నదుల వల్ల విశాల ఉత్తర మైదానం ఏర్పడింది. హిమాలయాల నుంచి వచ్చే ఈ నదులు తెచ్చిన రకరకాల ఒండ్రుమట్టి వల్ల ఇది క్రమేపీ పూడుకుంటూ వచ్చింది. అందువల్ల ఇక్కడి నేలలు అధిక భూసారంతో ఉండి, ఎక్కువ దిగుబడిని ఇస్తాయి.

- పీఠభూమి ప్రాంతాలు అగ్నిపర్వత శిలలతో ఏర్పడ్డాయి. ఇవి ఉత్తర మైదాన ప్రాంతాలంత సారవంతమైనవి కావు.
- ఉత్తర మైదాన ప్రాంతంలో ప్రవహించే నదులు జీవ నదులు. ఇవి ఎప్పుడూ నీటితో ఉంటాయి.
- దక్కన్ పీఠభూమి ప్రాంతంలో ప్రవహించే నదులు జీవ నదులు కావు. ఇక్కడ రెండో పంటకు సాగు నీటి కోసం చెరువులు, బోరు బావులపై ఆధారపడవలసి వస్తుంది.
- మైదాన ప్రాంతాల్లో ఉన్న సౌకర్యాలు పీఠభూమి ప్రాంతాల్లో ఉండవు. అందువల్ల 'భారతదేశంలోని ఉత్తర మైదాన ప్రాంతాలు వ్యవసాయానికి దోహదపడినంతగా పీఠభూమి ప్రాంతాలు తోడ్పడవు' అనే వాక్యాన్ని నేను సమర్థిస్తాను.

### ముఖ్యమైన ప్రశ్నలు

1) తూర్పు, పశ్చిమ తీర మైదాన ప్రాంతాల మధ్య పోలికలు, తేడాలను రాయండి.

2) హిమాలయాలు భారతదేశానికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయి?

3) భాబర్, టెరాయిల మధ్య తేడాలను రాయండి.

# BANK EXAMS

## General Awareness

# Sovereign Gold Bonds issued by..



Writer:
A. Veeraswami
Subject Expert

**1.** Sovereign Gold Bond 2017 – 2018 Series II issued as per the announcement of RBI on 6 July 2017. These bonds issued by RBI on behalf of .......
1) SBI 2) World Bank
3) Muthoot Finance
4) Government of India 5) SEBI

**2.** The SGB (Sovereign Gold Bond) issued to the buyers on .......
1) 23 July 2) 31 July 3) 1 August
4) 13 July 5) 28 July

**3.** The RBI sold the SGB to buyers through .....
1) banks 2) designated Post Offices
3) recognized Stock Exchanges
4) Stock Holding Corporation of India Limited (SHCIL) 5) All of above

**4.** The person / entity eligible to buy SGB Bonds is / are ........
1) Individuals 2) HUFs 3) Trusts
4) Universities and Charitable Institutions
5) All of above

**5.** SGB will be denominated in multiples of gram(s) of gold with a basic unit of ........
1) 3 grams 2) 8 grams 3) 10 grams
4) 1 gram 5) 12 grams

**6.** Under the Sovereign Gold Bond 2017 - 18 Series II, instead of buying physical gold, Indian residents can buy the Gold Bonds. These Bonds would be issued for the term of 8 years with exit option from ........
1) 5th year 2) 1st year 3) 4th year
4) 2nd year 5) 3rd year

**7.** Maximum amount of gold that can be subscribed by person / HUF per fiscal year under SGB scheme as announced on 26 July 2017 is ........
1) 100 gms 2) 1000 gms 3) 4000 gms
4) 2000 gms 5) 250 gms

**8.** Maximum amount of gold that can subscribe by trust and similar entities in SGB scheme as per the notification given by the government is ........
1) 50 kgs 2) 80 kgs 3) 20 kgs
4) 40 kgs 5) 30 kgs

**9.** Wrong statement regarding SGB (Sovereign Gold Bond) scheme is ........
1) Bonds are eligible for conversion into DEMAT form
2) Bonds will be tradable on stock exchanges
3) the interest accrued on Gold Bonds shall not be taxable under Income Tax Act,1961
4) Capital gains tax arising on redemption of SGB to an individual has been exempted
5) KYC (Know Your Customer) compulsory to buy

**10.** Under the Sovereign Gold Bonds 2017-18 Series Scheme, investors earn interest rate up to ........ payable semi-annually on the initial value of investment.
1) 2.50 % per annum 2) 1.50 % per annum
3) 8.50 % per annum 4) 4.50 % per annum
5) 7.50 % per annum

**11.** SGB can be used as collateral for loans and for this purpose LTV ratio is to be set equal to ordinary gold loan mandated by the RBI from time to time. In this context, LTV stands for ........
1) LIBOR-to-value 2) linked-to-value
3) liability-to-value 4) loan-to-value
5) locker rent-to-value

**12.** On 6 July 2017, RBI released Compendium of Guidelines for Small Finance Banks - Financial Inclusion and Development. As per it, Small Finance Banks required to open at least ........ of its branches in unbanked rural centers
1) 5% 2) 40% 3) 50% 4) 15% 5) 25%

**13.** Small Finance Banks required to extend 75% of its ANBC to priority sector. In this context, ANBC stands for ........
1)Average Net Bank Credit
2)Adjusted Net Batch Credit
3) Adjusted Nil Bank Credit
4) Adjusted Net Bank Credit
5) Allotment Net Bank Credit

**14.** Total Agricultural advances must be ........ of ANBC given by Small Finance Banks
1) 24% 2) 60% 3) 15% 4) 32% 5) 18%

**15.** Within the 18 percent target for Agriculture, a target of ........ of ANBC is prescribed for Small and Marginal Farmers by Small Banks.
1) 4% 2) 6% 3) 8% 4) 2% 5) 1%

**16.** Advances to weaker sections is the part of Priority Sector holding. What percentage of ANBC must be given to weaker section people by the Small Finance Banks (SFB)?
1)10% 2) 20% 3) 25% 4) 15% 5) 12%

**17.** A target of ........ percent of ANBC must be given to micro enterprises as part of Priority Sector Lending by SFBs.
1) 7.5% 2) 10.5%
3) 6.8% 4) 8.2% 5)10.5%

**18.** Operating Guidelines for Small Finance banks issued by RBI on 6 October 2016. The guidelines for Licensing of Small Finance Banks earlier passed by RBI on...
1) 1 June 2016 2) 26 February 2016
3) 1 February 2014 4) 21 December 2015
5) 27 November 2014

**19.** Minimum Capital Requirement for Small Finance Banks is ........ as per the guide lines issued on 6 October 2016.
1) 9% 2) 10% 3) 15% 4) 21% 5) 11.5%

**20.** Tier 1 common capital ratio is a measurement of a bank's core equity capital compared with its total risk-weighted assets that signifies a bank's financial strength. As per operating guidelines, for Small Finance Banks, the Common Equity Tier 1 is ........ ?
1) 7% 2) 8.5% 3) 10% 4) 9.8% 5) 6%

**21.** The Minimum paid-up equity capital for small finance banks shall be.....?
1) Rs.1,000 crore
2) Rs.5,000 crore 3) Rs.500 crore
4) Rs.10 crore 5) Rs.100 crore

**Key**

| | | | | |
|---|---|---|---|---|
| 1-4 | 6-1 | 11-4 | 16-1 | 21-5. |
| 2-5 | 7-3 | 12-5 | 17-1 | |
| 3-5 | 8-3 | 13-4 | 18-5 | |
| 4-5 | 9-3 | 14-5 | 19-3 | |
| 5-4 | 10-1 | 15-3 | 20-5 | |

# ఉద్యోగాలు Jobs



### భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్

బెంగళూరులోని భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ టెక్నికల్ అప్రెంటిసెస్ (డిప్లొమా హోల్డర్లు) పోస్టుల భర్తీకి వాక్- ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనుంది.

- ✦ ఖాళీలు: టెక్నీషియన్ అప్రెంటిసెస్ - 310.
- ✦ వ్యవధి: ఏడాది.
- ✦ విభాగాలు: ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్/ మెకానికల్ ఇంజినీరింగ్/ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్/ సివిల్ ఇంజినీరింగ్/ మెకానికల్ ఇంజినీరింగ్.
- ✦ అర్హత: సంబంధిత విభాగంలో (2015 తర్వాత) డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- ✦ వయసు: 1 ఆగస్టు 2017 నాటికి 18 నుంచి 27 సంవత్సరాల మధ్య ఉండాలి. ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు వయోపరిమితిలో మినహాయింపు లభిస్తుంది.
- ✦ స్టయిపెండ్: నెలకు రూ.4000 చెల్లిస్తారు.
- ✦ ఎంపిక: 21 ఆగస్టు నుంచి 31 ఆగస్టు వరకు నిర్వహించే ఇంటర్వ్యూల ఆధారంగా.
- ✦ ఇంటర్వ్యూ వేదిక: భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, ఎలక్ట్రానిక్స్ డివిజన్, మైసూరు రోడ్, బెంగళూరు - 560026.
- ✦ అర్హులైన అభ్యర్థులు పూర్తి వివరాలతో ఇంటర్వ్యూకి హాజరుకావొచ్చు.

చివరి తేదీ: **31 ఆగస్టు**

వెబ్‌సైట్: **www.bheledn.com**

### ఇస్రోలో ఖాళీలు

మహేంద్రగిరి (తమిళనాడు)లో ఇస్రోకి చెందిన ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ ట్రేడ్ అండ్ టెక్నీషియన్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ మొత్తం ఖాళీలు: 139 (ట్రేడ్ అప్రెంటిస్ - 80, టెక్నీషియన్ అప్రెంటిస్ - 59)
- ✦ అర్హత: పదోతరగతితోపాటు సంబంధిత ట్రేడ్/ బ్రాంచ్‌లో ఐటీఐ/ ఇంజినీరింగ్ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- ✦ వయసు: 35 ఏళ్లకు మించకూడదు.
- ✦ ఎంపిక: అకడెమిక్ మెరిట్ ఆధారంగా.
- ✦ దరఖాస్తు: వెబ్‌సైట్‌లో సూచించిన నమూనాలో పూర్తి వివరాలు జత చేసి పంపాలి.
- ✦ చిరునామా: ఇస్రో ప్రొపల్షన్ కాంప్లెక్స్ (ఐపీఆర్‌సీ), మహేంద్రగిరి, తిరునల్వేలి జిల్లా, తమిళనాడు

✦ చివరి తేదీ: **2 సెప్టెంబరు**

✦ వెబ్‌సైట్: **www.iprc.gov.in**

### ఐఐటీ, మద్రాస్

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ మొత్తం ఖాళీలు: 32.
- ✦ రిజిస్ట్రార్ - 1.
- ✦ సిస్టమ్స్ ఇంజినీర్ - 1.
- ✦ సెక్యూరిటీ ఆఫీసర్ - 1.
- ✦ జూనియర్ ఇంజినీర్ - 3.
- ✦ స్టాఫ్ నర్స్ - 4
- ✦ జూనియర్ టెక్నీషియన్ - 12.
- ✦ జూనియర్ అసిస్టెంట్ - 10.
- ✦ దరఖాస్తు: ఆన్‌లైన్ దరఖాస్తులు 8 సెప్టెంబరు వరకు అందుబాటులో ఉంటాయి.
- ✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: 15 సెప్టెంబరు

వెబ్‌సైట్: **www.iitm.ac.in**

**మరింత విద్యా ఉద్యోగ సమాచారం కోసం చూడండి..**

**www.eenadupratibha.net**

### ముఖ్యమైన తేదీలు

- ★ హార్టిసెట్ - 2017కు దరఖాస్తు చేయడానికి: *31 ఆగస్టు*
- ★ ఇస్రోలో అప్రెంటిస్ ఖాళీలకు దరఖాస్తు చేయడానికి: *2 సెప్టెంబరు*
- ★ దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డులోని ఖాళీలకు: *15 సెప్టెంబరు*
- ★ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తు చేయడానికి: *4 సెప్టెంబరు*

# ప్రతిభ

# ఇస్రోలో అప్రెంటీస్‌లు...

### దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు

దిల్లీ సబార్డినేట్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డు పలు విభాగాల్లో ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ మొత్తం ఖాళీలు: 15116
- ✦ జూనియర్ ఇంజినీర్ (సివిల్ - 70, మెకానికల్ - 15)
- ✦ పట్వారీ - 140
- ✦ లీగల్ అసిస్టెంట్ - 13
- ✦ స్పెషల్ ఎడ్యుకేటర్ - 1540
- ✦ ప్రైమరీ టీచర్ - 4366
- ✦ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ - 496
- ✦ అసిస్టెంట్ టీచర్ (నర్సరీ - 320, ప్రైమరీ - 1394)
- ✦ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ - 919
- ✦ డ్రాయింగ్ టీచర్ - 295
- ✦ డొమెస్టిక్ సైన్స్ టీచర్ - 199
- ✦ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ): హోమ్‌సైన్స్ - 114, ఫిజికల్ ఎడ్యుకేషన్ - 160, ఫైన్ ఆర్ట్స్ - 30, మ్యూజిక్ - 1, బయాలజీ - 15, కెమిస్ట్రీ - 21, కామర్స్ - 28, ఎకనామిక్స్ - 32, ఇంగ్లిష్ - 156, హిందీ - 179, హిస్టరీ - 205, పొలిటికల్ సైన్స్ - 203, సంస్కృతం - 48, జాగ్రఫీ - 69, మ్యాథ్స్ - 20, ఫిజిక్స్ - 18, పంజాబీ - 3, ఉర్దూ - 2, అగ్రికల్చర్ - 1, సోషియాలజీ - 83.
- ✦ ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (టీజీటీ): ఇంగ్లిష్ - 678, మ్యాథ్స్ - 610, నేచురల్ సైన్స్ - 416, సోషల్ సైన్స్ - 603, బెంగాలీ - 1, హిందీ - 422, పంజాబీ - 214, సంస్కృతం - 254, ఉర్దూ - 213.
- ✦ ఎడ్యుకేషనల్ అండ్ ఒకేషనల్ గైడెన్స్ కౌన్సెలర్ - 432
- ✦ మ్యూజిక్ టీచర్ - 46
- ✦ దరఖాస్తు: 25 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
- ✦ ఎంపిక: రాతపరీక్ష (టైర్ - 1, టైర్ - 2) ఆధారంగా.

✦ చివరి తేదీ: *15 సెప్టెంబరు*

వెబ్‌సైట్: **dsssonline.nic.in**

### బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ ఖాళీలు: రిస్క్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్స్ - 7 (క్రెడిట్ రిస్క్ - 3, ఆపరేషనల్ రిస్క్ - 2, మార్కెట్ రిస్క్ - 2)
- ✦ అర్హత: ఏదైనా డిగ్రీతోపాటు ఎంబీఏ/ సీఏ/ ఐసీడబ్ల్యూఏ
- ✦ వయసు: 30 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలి.
- ✦ **బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర కింది పోస్టులను కూడా భర్తీ చేయనుంది.**
- ✦ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్‌వో) - 1. సీఏ ఉత్తీర్ణతతోపాటు 15 ఏళ్ల అనుభవం అవసరం.
- ✦ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ (సీటీవో) - 1. ఇంజినీరింగ్ డిగ్రీ లేదా ఎంసీఏ ఉత్తీర్ణులైనవారు అర్హులు. అనుభవం ఉండాలి.
- ✦ ప్రిన్సిపల్ - స్టాఫ్ ట్రెయినింగ్ కాలేజ్ - 1. ఎకనామిక్స్/ కామర్స్‌లో పీజీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంబీఏ (ఫైనాన్స్)/ పీహెచ్‌డీ ఉన్నవారికి ప్రాధాన్యం లభిస్తుంది.
- ✦ దరఖాస్తు: ఆన్‌లైన్ దరఖాస్తులు 2 సెప్టెంబరు వరకు అందుబాటులో ఉంటాయి.
- ✦ ఎంపిక: రాతపరీక్ష/ పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.
- ✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: 12 సెప్టెంబరు
- ✦ చిరునామా: ది అసిస్టెంట్ జనరల్ మేనేజర్ (ఐఆర్ అండ్ హెచ్‌ఆర్‌డీ), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర లోక్‌మంగల్, 1501, శివాజీ నగర్, పుణె - 411 005

✦ వెబ్‌సైట్: **www.bankofmaharashtra.in**

### టీచింగ్ పోస్టులు

టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ (టిస్) టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ మొత్తం ఖాళీలు: 16
- ✦ టీచింగ్ - 9. ప్రొఫెసర్ - 1, అసోసియేట్ ప్రొఫెసర్ - 3, అసిస్టెంట్ ప్రొఫెసర్ - 5

అర్హత: 55 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో పీజీతోపాటు పీహెచ్‌డీ, బోధన/ రిసెర్చ్‌లో అనుభవం అవసరం.

**నాన్ టీచింగ్ పోస్టులు: 7**

- ✦ సైకియాట్రిక్ సోషల్ వర్కర్ - 1, డేటా ఎంట్రీ ఆపరేటర్ - 1, స్టెనోగ్రాఫర్ - 5.
- ✦ ఎంపిక: రాతపరీక్ష/ ఇంటర్వ్యూ ఆధారంగా.
- ✦ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.

✦ చివరి తేదీ: *31 ఆగస్టు*

వెబ్‌సైట్: **www.tiss.edu**

### మేనేజ్‌మెంట్ ట్రెయినీలు

నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ మేనేజ్‌మెంట్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✦ ఖాళీలు: 36
- ✦ మేనేజ్‌మెంట్ ట్రెయినీ (హెచ్‌ఆర్) - 12. అర్హత: 60 శాతం మార్కులతో ఎంబీఏ/ పీజీ డిగ్రీ లేదా పర్సనల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇండస్ట్రియల్ రిలేషన్స్/ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్/ హెచ్‌ఆర్ లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
- ✦ మేనేజ్‌మెంట్ ట్రెయినీ (మార్కెటింగ్) - 24. అర్హత: 60 శాతం మార్కులతో ఎంఎస్సీ (అగ్రికల్చర్) లేదా తత్సమాన అర్హత అవసరం. లేదా మార్కెటింగ్/ అగ్రిబిజినెస్ మార్కెటింగ్/ ఇంటర్నేషనల్ మార్కెటింగ్/ రూరల్ మేనేజ్‌మెంట్‌లో ఎంబీఏ/ పీజీడీబీఎం ఉత్తీర్ణులై ఉండాలి.
- ✦ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.
- ✦ ఎంపిక: ఆన్‌లైన్ రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా.

✦ చివరి తేదీ: *6 సెప్టెంబరు*

వెబ్‌సైట్: **www.nationalfertilizers.com**


# అసిస్టెంట్ ప్రొఫెసర్లు

**హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 224 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.**

- ✦ అగ్రికల్చర్ - 186 (6 లైబ్రరీ సైన్స్ పోస్టులతో కలిపి). అర్హత: అగ్రికల్చరల్ ఎకనామిక్స్/ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్/ అగ్రికల్చరల్ మైక్రోబయాలజీ/ ఆగ్రోనమీ/ క్రాప్ ఫిజియాలజీ/ ఎంటమాలజీ/ జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్/ హార్టికల్చర్/ ప్లాంట్ పాథాలజీ/ ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ/ సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చరల్ కెమిస్ట్రీ/ స్టాటిస్టిక్స్ అండ్ మ్యాథమెటిక్స్‌లో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ, కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)లో అర్హత సాధించి ఉండాలి. లైబ్రరీ సైన్స్ పోస్టులకు లైబ్రరీ సైన్స్/ ఇన్ఫర్మేషన్ సైన్స్/ డాక్యుమెంటేషన్ సైన్స్‌లో 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హత అవసరం.
- ✦ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ - 22, హోమ్‌సైన్స్ - 16.
- ✦ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో 20 సెప్టెంబరు వరకు.

✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: **29 సెప్టెంబరు**

- ✦ **హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ బ్యాక్‌లాగ్ (ఎస్సీ, ఎస్టీ) పోస్టులను కూడా భర్తీ చేయనుంది.**
- ✦ ఖాళీలు: అగ్రికల్చర్ - 10, అగ్రికల్చర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ - 5, హోమ్ సైన్స్ - 3
- ✦ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో 12 సెప్టెంబరు వరకు.



✦ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: *29 సెప్టెంబరు*

వెబ్‌సైట్: **www.pjtsau.ac.in**

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.**

- ✦ ఖాళీలు: అసిస్టెంట్ ప్రొఫెసర్లు (బ్యాక్‌లాగ్ - 178, రెగ్యులర్ - 20)
- ✦ విభాగాలు: అనాటమీ, ఫిజియాలజీ, ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్.
- ✦ అర్హత: సంబంధిత విభాగంలో ఎండీ, ఎంఎస్, ఎండీఎస్, డీఎం, ఎంసీహెచ్, డీఎన్‌బీ, పీహెచ్‌డీ లేదా తత్సమాన అర్హత అవసరం.
- ✦ వయోపరిమితి: 1 జులై 2017 నాటికి 40 సంవత్సరాలకు మించకూడదు.
- ✦ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

✦ చివరి తేదీ: **4 సెప్టెంబరు**

వెబ్‌సైట్: **dme.ap.nic.in**

# ప్రవేశాలు

### హార్టిసెట్ - 2017

హైదరాబాద్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర హార్టికల్చరల్ యూనివర్సిటీ 2017 - 18 విద్యాసంవత్సరానికి బీఎస్సీ హార్టికల్చర్ డిగ్రీలో ప్రవేశానికి నిర్వహించే 'హార్టిసెట్ - 2017' కు నోటిఫికేషన్ విడుదల చేసింది.


- ✦ సీట్ల సంఖ్య: 23.
- ✦ అర్హత: హార్టికల్చర్ డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- ✦ వయసు: 31 డిసెంబరు 2017 నాటికి 17 నుంచి 25 సంవత్సరాల మధ్య వయసున్నవారై ఉండాలి.
- ✦ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- ✦ పూర్తి చేసిన దరఖాస్తుకు కంప్ట్రోలర్, ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ, రాజేంద్రనగర్, హైదరాబాద్ పేరిట చెల్లేలా తీసిన రూ.750 డీడీ (ఎస్సీ/ ఎస్టీ/ పీహెచ్ అభ్యర్థులు రూ.350) జత చేసి పంపాలి.
- ✦ పరీక్ష తేదీ: 18 సెప్టెంబరు

✦ చివరి తేదీ: 31 ఆగస్టు

వెబ్‌సైట్: **www.skltshu.ac.in**

# హాయ్! బుజ్జీ!!

# 2034లో మీ దగ్గరా చూడొచ్చు!



◆ హాయ్... సూర్యుడు గారూ! నాపేరు కిట్టూ! హాయ్‌బుజ్జీ తరఫున మిమ్మల్ని సరదాగా పలకరిద్దామని వచ్చా. 'నా గురించి తెలియనిదేముందబ్బా?' అనుకుంటున్నారేమో కానీ మరేమీ లేదు.. రెండు మూడు రోజులుగా అంతా మీ సంగతులే మాట్లాడుతున్నారు... అమెరికాలో, ప్రసార మాధ్యమాల్లో సంపూర్ణ సూర్యగ్రహణం అంటూ హల్‌చల్ నడిచింది. అవునుగానీ ఇంతకీ మీరు మా దగ్గర ఇలా ఎప్పుడు కనిపిస్తారేంటి?

▶▶ నన్ను కలవడానికి వచ్చినందుకు చాలా సంతోషం కిట్టూ. మీ దగ్గర నా సంపూర్ణ సూర్యగ్రహణం చూడాలంటే 2034 వరకు ఆగాల్సిందే. లేదంటే 2019లో దక్షిణ అమెరికా దేశాల దగ్గర కనిపిస్తానిలా. అప్పటిలోగా నా గ్రహణం గురించి మీ శాస్త్రవేత్తలేమైనా కొత్త విషయాలు తెలుసుకుంటారేమో చూద్దాం.

◆ అవును నాకూ ఉత్సాహంగానే ఉంది. అది సరే... మరి ఇప్పటి సూర్యగ్రహణం సంగతులు ఏంటి?

▶▶ ఆ విషయానికే వస్తున్నా. కానీ ఇంకాస్త దూరంగా నిలబడు! లేదంటే నా వేడిని తట్టుకోలేవు. భూమికీ, నాకూ మధ్య చంద్రుడు వచ్చినప్పుడు, మీ భూమిపై కొంత భాగంలో నేను కనిపించను. దాన్నే సూర్యగ్రహణం అంటారని వినే ఉంటావుగా. అత్యంత ప్రకాశవంతంగా వెలిగే నేను చంద్రుడి ఛాయ వల్ల ఒక సన్నటి అంచులా కనిపిస్తా. అప్పుడు ఆ ప్రదేశంలో మాత్రం సూర్యగ్రహణం కనిపిస్తుంది. ఇప్పుడు అమెరికాలో జరిగింది అచ్చంగా ఇదేనన్నమాట.

◆ అయితే ఈసారి వచ్చిన సంపూర్ణ గ్రహణం దాదాపు 99 ఏళ్ల తర్వాత ఏర్పడిందటగా. పసిఫిక్ తీర ప్రాంతం నుంచి అట్లాంటిక్ తీరం వరకు మీ గ్రహణం వల్ల చీకటి పడటం చాలా అరుదైన విషయమంటూ మా శాస్త్రవేత్తలూ చెబుతున్నారు. ఎప్పుడో 1918లో ఇలాంటి గ్రహణం కనిపించిందట. మళ్లీ ఇన్నాళ్లకు ఇలా. అందుకే దీనికి 'గ్రేట్ అమెరికన్ ఎక్లిప్స్' అంటూ పేరూ పెట్టేశారు.

▶▶ అవును కిట్టూ. అమెరికా ఒరెగాన్ నుంచి దక్షిణ కరోలినా వరకు 14 రాష్ట్రాల మీదుగా 98 కిలోమీటర్ల నుంచి 113 కిలోమీటర్ల మేర నాకు చంద్రుడు అడ్డొచ్చాడు. ఈ తతంగమంతా 2 గంటల 40 నిమిషాల పాటు జరిగింది. అందుకే ఆ ప్రాంతమంతా పట్టపగలే రెండు మూడు నిమిషాలు చీకటయ్యింది. అప్పుడు నా గ్రహణాన్ని చూడ్డానికి భారీ ఏర్పాట్లే జరిగాయనుకుంటా!

◆ అవునవును. సోమవారం అమెరికాలో అన్ని చోట్లా ఒకటే సందడి. అమెరికాలో కొన్ని చోట్ల పాక్షికంగా కనిపిస్తే కొన్ని రాష్ట్రాల్లో మాత్రం సంపూర్ణంగా గ్రహణం కనిపించింది. నేను నేరుగా చూడలేదు కానీ నాసా వాళ్లు అందించిన ప్రత్యేక ప్రసారాల్లో చూశా. విద్యార్థులకు అంతరిక్షం విషయాలు పుస్తకాల్లోనే తప్ప నిజంగా చూపించడానికి కుదరదు కదా. కానీ ఈ సందర్భంగా ఆరిజోనా స్టేట్ యూనివర్సిటీ, నేషనల్ ఇన్‌ఫార్మల్ స్టెమ్ ఎడ్యుకేషన్ నెట్‌వర్క్ లాంటివి పిల్లల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. కళ్లకు హాని జరగకుండా ఉండేందుకు కళ్లజోళ్లు ఇచ్చి నేరుగా సూర్యగ్రహణాన్ని దగ్గరుండి చూపించాయి. కొన్ని మ్యూజియాల్లో వారి కోసం గ్రహణంపై తరగతులు నిర్వహించాయి. టెలిస్కోపులిచ్చి, దాంట్లోంచి గ్రహణాన్ని చూపిస్తూ వివరాలు చెప్పుకొచ్చాయి. ఇదంతా భలేగా సాగిపోయింది.

▶▶ శాస్త్రవేత్తలు కూడా చాలా ఆసక్తి చూపినట్టున్నారే!

◆ అవును మరి. అమెరికా అంతరిక్ష పరిశోధనా కేంద్రం నాసా వారైతే మరీనూ. ఏదో రాకెట్ ప్రయోగానికి కౌంట్‌డౌన్ పెట్టినట్లు మీ గ్రహణానికీ పెట్టి ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇక చాలామంది శాస్త్రవేత్తలైతే ఆ సమయంలో మిమ్మల్నీ, చంద్రుడినీ టెలిస్కోపుల ద్వారా ఎంతో పరీక్షగా చూశారు. దాన్నుంచి వాళ్లు నేర్చుకునే విషయాలు మీపై చేసే పరిశోధనల్లో ఎంతో ఉపయోగపడతాయని చెబుతున్నారు వాళ్లు.

మరో విషయం చెప్పడం మరిచా. మీ గ్రహణాన్ని నేల మీద నుంచే కాదు. విమానాల్లోంచి, సముద్రంలో ఓడల మీద నుంచి కూడా చూశారు కొంత మంది. ఇక వస్తా సూర్యుడు గారూ! ఈ కబుర్లన్నీ మా వాళ్లకీ చెప్పాలి కదా!

▶▶ సరే కిట్టూ. బైబై మరి!

అందం చూసే కళ్లలో ఉండదు, సాయం చేసే చేతుల్లో ఉంటుంది

- అబ్దుల్ కలాం

## పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- Protection = రక్షణ
- మనోజ్ఞం = అందం

## నవ్వుల జల్లులు!



**టీచర్:** కళ్లు, ముక్కు, చెవులు ఎందుకు ఉపయోగపడతాయి?
**బిట్టు:** కళ్లద్దాలు పెట్టుకోవడానికి టీచర్!

- జి. వెంకట రమణ, తూర్పునాయుడుపాలెం



**టీచర్:** రాముా! పిల్లుల జాతికి చెందిన జంతువుల పేర్లు చెప్పు?
**రాము:** తల్లి పిల్లి, తండ్రి పిల్లి, పిల్లి పిల్లలు టీచర్!

- పి. నారాయణ, అనంతపురం

## ప్రశ్నలోనే సమాధానం!

ఇక్కడున్న ఆంగ్ల పదాల్లోనే దాని పక్కనున్న తెలుగు పదాల సమానార్థకాలు ఉన్నాయి. అవేంటో కనిపెట్టండి.

1. Boxలో ఎద్దు ☐☐
2. Beatలో తిను ☐☐☐
3. Teamలో తేనీరు ☐☐☐
4. Stageలో వయసు ☐☐☐
5. Priceలో మంచు ☐☐☐
6. Partలో కళ ☐☐☐
7. Phoneలో ఒకటి ☐☐☐
8. Earthలో చెవి ☐☐☐

- ఎస్. మణెమ్మ, కాజీపేట

## పట్టికలో పదాలు

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| P | F | I | E | S | P | D | T | B | N | L | P |
| C | E | T | U | J | T | H | R | I | I | N | Q |
| J | K | N | A | R | D | H | A | E | B | H | J |
| H | E | F | M | S | A | T | U | R | N | B | I |
| V | I | M | M | L | F | N | E | M | A | U | I |
| Y | G | F | E | N | O | T | U | H | N | Z | K |
| U | I | I | R | E | I | W | T | S | P | M | G |
| M | S | Q | C | P | H | C | R | W | M | E | F |
| A | P | L | U | T | O | A | M | S | E | L | A |
| S | O | J | R | U | M | M | D | E | A | R | M |
| D | I | A | Y | N | R | X | H | G | M | D | X |
| R | E | E | P | E | O | F | B | N | H | O | O |

ఇక్కడి పదాలు పట్టికలో ఉన్నాయి. కనుక్కోండి

MERCURY, VENUS, EARTH, MARS, JUPITER, SATURN, URANUS, NEPTUNE

## చుక్కలు కలపండి



**చిలిపి ప్రశ్న**

నూతిలో ఉన్న పది కప్పల్లో తొమ్మిది చచ్చిపోతే ఇంక ఎన్ని ఉంటాయి?

- జి. రమేష్, పెనుబర్తి

జవాబులు: బొమ్మలో ఉన్నవే: Xantus, Xerus, Xray, Xiphias, X ray fish చిలిపి ప్రశ్న: పదీ అందులోనే ఉంటాయి! ప్రశ్నలోనే సమాధానం: 1. Ox 2. Eat 3. Tea 4. Age 5. Ice 6. Art 7. One 8. Ear



## బొమ్మలో ఉన్నవే

బొమ్మలో X ఆంగ్ల అక్షరంతో మొదలయ్యే అంశాలున్నాయి. అవేంటో పట్టుకుని గడుల్లో రాయగలరా?

X

## అపహరణ కేసులో ఇద్దరు మహిళలకు జైలు శిక్ష

**బేల, న్యూస్‌టుడే:** యువతిని ఇతర రాష్ట్రాలకు అపహరణ చేసిన కేసులో ఇద్దరు మహిళలకు జైలు శిక్ష విధిస్తూ మంగళవారం న్యాయమూర్తి తీర్పునిచ్చారు. బేల ఎస్సై కోల నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బేల మండలంలోని సదల్‌పూర్ గ్రామానికి చెందిన ఓ యువతిని అదే గ్రామానికి చెందిన దడాంజే రంజన, కొడప తుకీబాయి కలిసి 2014లో పెళ్లిచేస్తానంటూ మాయమాటలు చెప్పి రాజస్థాన్‌కు తీసుకెళ్లి విక్రయించారు. దీనిపై కేసు నమోదైంది. మంగళవారం కేసు పూర్వాపరాలను పరిశీలించి 13 మంది సాక్షులను విచారించిన అనంతరం అసిస్టెంట్ సెషన్ జడ్జి జె.జీవన్‌కుమార్, అడిషనల్ పీపీ జె.మల్లికార్జున్ రెండు సెక్షన్‌లలో జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారని తెలిపారు. పదేళ్లు, ఏడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున జరిమానా విధించారని ఎస్సై తెలిపారు.

## ఉరివేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

**ఇచ్చోడ:** ఇచ్చోడ మండల కేంద్రంలోని అయ్యప్ప గుడి సమీపంలో గుర్తు తెలియని వృద్ధ వికలాంగుడు(60) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై డి.మోహన్ తెలిపారు. మంగళవారం ఆలయం వైపుగా వెళ్లిన వారు సమాచారం తెలియజేయడంతో సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించినట్లుగా ఆయన పేర్కొన్నారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉంది. దాదాపు నెల రోజుల కిందట ఉరివేసుకుని ఉండొచ్చన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లుగా ఎస్సై పేర్కొన్నారు.

## 24న జడ్పీ సమావేశ మందిరంలో జాబ్‌మేళా

**శాంతినగర్, న్యూస్‌టుడే:** జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఈనెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి జగత్ జ్యోతి తెలిపారు. మార్కెటింగ్ రంగంలో పనిచేసేందుకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్ లీడర్స్‌గా పనిచేయడానికి 150 మందిని ఎంపిక చేస్తారన్నారు. టీమ్ లీడర్స్‌కు రూ.12 వేల వేతనంతో పాటు ఉత్తమ పనితీరుకు అదనంగా ప్రోత్సాహక నగదు అందిస్తారన్నారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్‌కు రూ.8వేల వేతనంతో పాటు ప్రోత్సాహక నగదు ఉంటుందన్నారు. పదో తరగతి ఆపై ఉత్తీర్ణులైన వారు జాబ్‌మేళాకు హాజరు కావచ్చన్నారు. నిరుద్యోగులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఈటీవీలో ఈనాడు

**ఉదయం**

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: వ్యాపారాభివృద్ధికి బుధవారం గణపతిని ఎలా పూజించాలి?, చిత్రపటాలు అదృష్టాన్నిస్తాయా?, 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: సామాన్యుడు (జగపతిబాబు, కామ్నజెత్మాలని).

**మధ్యాహ్నం**

12-00: అభి'రుచి': మసాలా వంటలు 'చికెన్ మంచూరియా', 'కీమాఫ్రై', కారం కారంగా 'క్రాబ్స్‌పెప్పర్‌ఫ్రై', చెఫ్స్ స్పెషల్ 'ప్రాన్స్‌పకోడీ' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి-2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

**సాయంత్రం**

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ (రిపీట్), 05-30: ఎక్స్‌ట్రా జబర్దస్త్ జల్సాటైం (రిపీట్), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్).

**రాత్రి**

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతి చినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: ఢీ 10: సూపర్ డాన్సుల సుప్రీమ్ షో...

### ఈటీవీ ప్లస్

**ఉదయం** 11:00 కిక్ రిపీట్

**మధ్యాహ్నం** 12:00 జబర్దస్త్ రిమిక్స్

01:00 మహాతల్లి రిపీట్

01:15 ఫ్రూట్స్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్

03:30 పోవే..పోరా రిపీట్

**సాయంత్రం**

04:30 నా షో నా ఇష్టం

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

**రాత్రి**

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 నా షో నా ఇష్టం

09:00 పటాస్

09:30 అల్లరే అల్లరి

10:00 సరదాగా కాసేపు

10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్

11:00 పటాస్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

### ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ.6:00, సా. 6.00, రా. 11.00)
- ★ డా. ఈటీవీ (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.5:30, రా. 11:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
- ★ అమృతం (ఉ.8:00, మ.12:30, రా.8:00)
- ★ హెల్దీ & టేస్టీ – (ఉ.8:30, మ.01:00, రా.8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ.09:00, 10:30, మ.3:00, రా.09:00)
- ★ జీవనరేఖ – విమెన్స్ హెల్త్ (ఉ.9:30, సా.4:00)
- ★ బాడీ మైండ్ & సోల్– అంతరంగం (ఉ.10:00)
- ★ విహారి (మ.12:00, సా.6:30, రా.10:00)
- ★ హెల్దీ డయాబెటిక్ (మ.1:30)
- ★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (మ.2:00, రా.7:00)
- ★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (మ.2:30, రా.09:30).

### ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: జీవనజ్యోతి (జయసుధ), 10-00: మార్నింగ్ షో: భార్యాభర్తల బంధం (బాలకృష్ణ, రజని), మధ్యాహ్నం: 1-00: మాట్నీ: ముద్దుగోపాలుడు (బాలకృష్ణ, విజయశాంతి), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: జనం (సాయికుమార్), రాత్రి: 7-00: ఫస్ట్‌షో: పెద్దలు మారాలి (కృష్ణ, జమున), 10-00 సెకండ్ షో: అగస్టు 15 రాత్రి (అర్జున్, గౌతమి).

### ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - చికెన్ మసాలా ఇడ్లీ శాండ్విచ్ & హార్స్‌గ్రామ్ ఫ్రైడ్ రైస్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – స్పినాచ్ బేసిల్ క్రేప్స్ & సొరకాయ తెలగపిండి రైస్, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – వెన్న చెక్కలు & మొక్కజొన్న బూరెలు, ఉ.11.00, రా.10.45: గోరు ముద్దలు – టమోట కోకోనట్ సూప్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ (వృద్ధ వయసు వారికోసం) – క్యాబేజి చట్నీ, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - వంకాయ పప్పు & వంకాయ రోటి పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా - పటిస్టప (బెంగాలీ క్యూసైన్), మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – ఆలూ పన్నీర్ బైట్స్, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - దొండకాయ చట్నీ అవకాడో చపాతీ రోల్, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - బట్టర్ గార్లిక్ పెప్పర్ ప్రాన్స్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (జపాన్ స్పెషల్)– జపనీస్ ఫిష్ సూప్ & ప్రాన్స్ అండ్ ఫిష్ క్యాబేజి, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - స్ప్రౌట్స్ గోకరకాయ కూర, మ.1.45, రా.7.30: ట్రెండీ ట్రీట్స్ – చాక్లెట్ కప్ కేక్స్ & ఫిష్ ఫింగర్స్, మ.2.15, రా.10.30: ఛెఫ్స్ స్పెషల్ – సెజ్వాన్ చిల్లీ నూడుల్స్, మ.2.30: చోటా షెఫ్ – చికెన్ విత్ ఎగ్ ఫ్రై, మ.3.00: పదండి విందుకు – ప్రముఖ రెస్టారెంట్‌లో, మ.5.15: స్నాక్స్ - బ్రెడ్ దహీ వడ.

### ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ పద్మనాభ స్వామి ఆలయం, పద్మనాభం, విశాఖపట్నం, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి(రిపీట్)

### ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

**ఉదయం:** 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30తీర్థయాత్ర: శ్రీహరిహరక్షేత్రం, కర్మన్‌ఘాట్, హైదరాబాద్, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీ భవ, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

## ఏ ఛానల్లో ఏముంది.. 23-08-2017

**SVBC** — **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (సహస్ర కలశాభిషేకం), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - వినాయకుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు-కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కళ్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రిపీట్), **సాయంత్రం:** 04-30 అష్టగణపతితత్వం, 05-00 లైవ్ ఎస్.డి.సేవ + ప్రత్యేక వార్తలు + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 భక్తి చైతన్యం, 08-30 ధర్మసోపానాలు - చాగంటి, 09-00 ఆలయదర్శనం - త్రివిక్రమాలయం, 09-30 దేవీసప్తసతి - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనిక పర్వం.

**భక్తి TV** — **ఉదయం:** 06-00 శ్రీవిష్ణు సహస్రం, 06-30 గోవింద నామాలు, 7-00 అర్చన, 7-30 శ్రీవేంకటేశ్వరస్తోత్రం, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 వినాయక వైభవం, 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రీవేంకటేశ్వరస్తోత్రం, 05-30 గోవిందనామాలు, 06-00 శ్రీవిష్ణుసహస్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 గణేశాయ నమః, 09-30 వినాయక వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తి విశేషాలు.

**జీ తెలుగు** — **ఉదయం:** 07-30 గోపురం, 08-00 సినిమా: భీమవరం బుల్లోడు, 11-00 కామెడి ఖిలాడీలు రిపీట్, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం రిపీట్, 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడి ఖిలాడీలు, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా.., **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 పున్నాగ, 09-00 కళ్యాణ వైభోగం, 09-30 ముత్యాలముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: జై చిరంజీవా.

**మా** — **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 రాశి ఫలాలు - దిన ఫలం, 08-30 శ్రీవినాయక చరితం, 09-00 సినిమా: సీతారామరాజు, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 కుంకుమపువ్వు, 01-30 బిగ్ బాస్ రిపీట్, 03-00 సినిమా: పెళ్ళిసందడి, **సాయంత్రం:** 05-30 ఓకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్.

**GEMINI** — **ఉదయం:** 06-00 టెలిషాపింగ్ 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: శీను, 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి 02-30 నాగిని 2 రిపీట్, 03-00 సినిమా: గోలిమార్, 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని 2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు, 10-00 సినిమా: కరెంట్ తీగ.

**HBO** — **ఉదయం:** 06-16 ప్యాసింజర్ 57, 07-43 ఫైనల్ డెస్టినేషన్ 5, 09-25 ఫూల్స్ గోల్డ్, 11-28 స్టెప్ అప్, **మధ్యాహ్నం:** 01-21 ది తక్సెడో, 03-03 జాక్ ది జయింట్ స్లేయర్, **సాయంత్రం:** 05-11 ఘోస్ట్ రైడర్: స్పిరిట్ ఆఫ్ వెంగెన్స్, 06-55 10000 బీసీ, **రాత్రి:** 09-00 గెట్ స్మార్ట్, 11-03 ఘోస్ట్ షిప్.



# అధిక వర్షాలు - పైర్లలో జాగ్రత్తలు

రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా వివిధ పంటల్లో రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, అపరాల పంటలకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండి కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని ఖమ్మం ఏరువాక సెంటర్ సమన్వయకర్త డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు.

**పత్తి పంటలో... :** ★ సాధ్యమైనంత వరకు చేలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు నీటిని మురుగు కాల్వలు ఏర్పాటు చేసుకొని తీసివేయాలి.

★ వర్షాలు తగ్గిన వెంటనే భూమిలో తేమను తగ్గించుకోటానికి అంతర సేద్యం చేయాలి. ★ అంతర సేద్యం చాలా రోజుల వరకు వీలుకాకపోతే కలుపు సమస్య ఎక్కువగా ఉంటే విత్తిన 45-60 రోజుల పైరులో ఎకరాకు 400 మి.లీ. క్విజలోపాప్ ఇథైల్ + పైరిథయోబాక్ సోడియం 250 మి.లీ. కలిపి పిచికారీ చేసి కలుపును నివారించుకోవాలి.



★ వర్షాలు తగ్గిన వెంటనే బురద పదునులో ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేసుకోవాలి. విత్తేటప్పుడు భాస్వరం వేయని రైతులు ఎకరానికి 50 కిలోల డీఏపీని విత్తిన 20-25 రోజుల సమయంలో వేసుకోవాలి. ★ అధిక వర్షాలకు వేరుకుళ్లు తెగులు ఆశిస్తే 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి, మొక్క మొదళ్లు తడిచేలా పిచికారీ చేయాలి.

**మొక్కజొన్నలో...:** ★ మొక్కజొన్న అధిక తేమను తట్టుకోలేదు. సాధ్యమైనంత త్వరగా అంతరకృషి చేయటం ద్వారా తేమను తగ్గించుకోవాలి. ★ చేలో నిల్వ వర్షపు నీటిని కాల్వలు బోదెల ద్వారా ఎప్పటికప్పుడు తీసివేయాలి. ★ తేమ ఎక్కువగా ఉన్న మొక్కజొన్న పొలంలో ఎకరాకు 25 కిలోల యూరియా + 10 కిలోల పొటాష్ ఎరువులను మొక్కల మొదళ్ల దగ్గర వేసుకుంటే కొంతవరకు తేమ ఒత్తిడిని తట్టుకుంటుంది. ★ మొక్కజొన్నలో అంతరకృషి ఆలస్యమైతే, కలుపు నివారణకు టిమ్‌బొట్రియాన్(లాడిన్) కలుపు మందును ఎకరాకు 115 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

**అపరాలు, మిరపలో...:** ★ పెసర, మినుము పైర్లలో పేనుబంక, లద్దెపురుగు ఆశించే అవకాశం ఉన్నందున, ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ★ 20-25 రోజుల దశలో ఉన్న పెసర, మినుము పైర్లలో కలుపు అధికంగా ఉంటే.. అంతరసేద్యం వీలుకానప్పుడు ఇమజిథాపిర్ అనే కలుపు మందును 200 లీటర్ల నీటిలో 200 మి.లీ. కలిపి ఎకరా విస్తీర్ణంలో పిచికారీ చెయ్యాలి. ★ వర్షాలకు అపరాల పంటలకు ఆకుమచ్చ తెగులు ఆశించే ప్రమాదం ఉంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలి. ★ మిరప నారుమళ్లలో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

★ అధిక వర్షాలకు మిరప నారుకు నారుకుళ్లు ఆశిస్తే 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో 2, 3 సార్లు నారుమళ్లను తడపాలి.

–న్యూస్‌టుడే, ఖమ్మం (వ్యవసాయం)

## సీతాఫలం సాగు వివరాలు

సీతాఫలం ఎక్కువ వర్షపాతాన్ని, వర్షాభావ పరిస్థితులను తట్టుకుంటుంది. చౌడు, క్షార నేలల్లో తప్ప అన్ని నేలల్లో సాగు చేయవచ్చు. మురుగునీరు పోయే సదుపాయం కలిగిన చల్కా, గరప, ఎర్ర నేలలు, రాళ్లతో కూడిన కంకర నేలలు కూడా అనుకూలమే.

✦ 60×60×60 సెం.మీ. పరిమాణంలో 5×5 మీటర్ల దూరంలో గుంతలు తవ్వాలి. ఒక్కో గుంతకు 20 కిలోల పశువుల ఎరువు, కిలో సూపర్‌ఫాస్ఫేట్, 100 గ్రా. ఫాలిడాల్‌ను పొడిగుంత నుంచి తీసిన పైపొర మట్టిలో కలిపి గుంతను నింపాలి. అంటు మొక్కలను గుంత మధ్యలో నాటాలి. నాటేటప్పుడు అంటుభాగం భూమికి 15-20 సెం.మీ. పైకి ఉండేలా నాటి, మొక్కకు ఊతంగా కర్రను ఏర్పాటు చేయాలి. అంటు మొక్కల వేరుమూలంపై వచ్చే చిగుళ్లను ఎప్పటికప్పుడు కత్తిరించాలి. సీతాఫలంలో లేత కొమ్మల మీద పూత వస్తుంది. కనుక తక్కువ స్థాయిలో కొమ్మల కత్తిరింపు చేస్తే లేత కొమ్మలు, పూత బాగావచ్చి ఎక్కువ దిగుబడి వస్తుంది. కత్తిరింపు జనవరి-మార్చి మాసాల్లో, ఆకురాల్చే సమయంలో చేయాలి.

✦ మొక్కలు నాటిన తర్వాత అవసరాన్ని బట్టి 2-3 రోజులకు ఒకసారి నీరు పారించాలి. నీరు తక్కువైతే కాయలు గట్టిగా మారి త్వరగా పండుబారతాయి. బెట్టలో మొక్కల మొదళ్లలో వరిపొట్టు, వేరుసెనగ పొట్టులాంటివి వేసి పాదుల్లో తేమను నిలుపుకోవచ్చు.


✦ కాపులో ఉన్న ఒక్కో చెట్టుకు 50 కిలోల పశువుల ఎరువు, కిలో ఆముదపు పిండి, కిలో ఎముకల పొడిని మొదళ్ల చుట్టూ గాడిచేసి జూన్-జులై మాసాల్లో వేయాలి. వీటితోపాటు 250 గ్రా. నత్రజని, 125 గ్రా. భాస్వరం, 125 గ్రా. పొటాష్ వేసుకోవచ్చు.

# పుస్తకాల బరువు... భారంగా చదువు

## పిల్లల ఆరోగ్యంపై ప్రభావం...

మంచిర్యాలఅర్బన్, న్యూస్‌టుడే

**బాల్యం ఓ మధురం.. బుడిబుడి అడుగులతో ఇళ్లంతా అల్లరి చేసే చిన్నారులు బడులకు వెళ్లాలంటే బరువులు మోయాల్సి వస్తోంది. తరగతి పెరిగినకొద్ది పుస్తకాల మోత.. బరువులున్న సంచుల్ని మోసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి. ఉమ్మడి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల్లో 90 శాతం నిర్మాణాలు మూడు, నాలుగు అంతస్థులు కలిగినవే. బరువైన పుస్తకాల సంచులతో విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గతంలో తీసుకొచ్చిన సంస్కరణలు, ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కథనం.**



**'బడి పిల్లలపై పుస్తకాల భారం తగ్గించాలని, హోంవర్క్ ఒత్తిడిని కట్టడి చేయాలని బాలల హక్కుల సంఘం ఈనెల 16న రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు దాఖలు చేసింది'**



చెన్నూరు పట్టణంలో తన బిడ్డ పుస్తకాల సంచిని భుజంపై వేసుకుని సైకిల్ తొక్కుతున్న తండ్రి

### గతంలో తెచ్చిన సంస్కరణలు...

#### ప్రభుత్వ విద్యలో....

2013-14, 2014-15 విద్యాసంవత్సరాల్లో రూపొందించిన నూతన పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు బరువు భారాన్ని తగ్గించే విధంగా రూపకల్పన చేశారు. సీసీఈ విధానంలో భాగంగా ఉపవాచకాలను అచ్చుపుస్తకాల్లో భాగం చేశారు. సీబీఎస్ఇ తరహాలో పాఠ్యాంశాలు రూపకల్పన, పాఠ్యాంశాల్లో అవసరమున్న భావనలు మాత్రమే అమలుచేయటం. విద్యార్థుల భావ వ్యక్తీకరణ, సొంత ఆలోచనల విధానం దిశగా పాఠ్యాంశాల రూపకల్పన. తరగతి గదిలో ఉపాధ్యాయుడి పాత్ర పెంచే విధంగా పాఠ్యప్రణాళిక.

#### సీబీఎస్ఈలో....

1-5 తరగతుల విద్యార్థులు పుస్తకాలను పాఠశాలలోనే ఉంచేవిధంగా చర్యలు తీసుకున్నారు. నోటు పుస్తకాలను వందపేజీలకే పరిమితం చేశారు. సెమిస్టర్ విధానంతో సిలబస్ తక్కువగా ఉంటుంది. ప్రతి ఆరునెలలకు సరిపడా పుస్తకాలు మాత్రమే తీసుకురావాల్సి ఉండటంతో బరువు భారం కొంత తగ్గుతుంది. పుస్తకాల బరువు తగ్గించేలా జాతీయ విద్యాహక్కు చట్టం ఆదేశాల మేరకు పాఠ్యప్రణాళికలో మార్పులు తీసుకువచ్చారు.

#### ప్రైవేటు విద్యలో...

ప్రైవేటు విద్యలో విద్యార్థుల పుస్తకాల బరువు ప్రభావం అధికం. వ్యాపార ధోరణిగా మారడంతో అధిక పుస్తకాలను విద్యార్థులతో కొనుగోలు చేయిస్తున్నారు. ఎల్‌కేజీ స్థాయికే పుస్తకాలు రూ.1000 నుంచి రూ. 1500 వరకు వసూలు చేస్తున్న పరిస్థితి. పాఠ్యపుస్తకాలకు తోడు అదనపు పుస్తకాల భారం అధికంగా ఉంది. డ్రాయింగ్, పర్యావరణం, ఆంగ్లం, కంప్యూటర్ బుక్, వర్క్ బుక్, హోంవర్క్స్ పుస్తకాలని ఇలా 10 నుంచి 12 రకాల పుస్తకాలు పిల్లలు రోజు బడికి తీసుకెళ్లాల్సి వస్తోంది.

### ఇలా చేస్తే మేలు..

రెండు సెట్ల పుస్తకాలను అందుబాటులో ఉంచి ఒకటి ఇంటి వద్ద.. మరొకటి పాఠశాలలో ఉండేలా చర్యలు తీసుకోవాలి. గతేడాది విద్యార్థులు వాడిన పుస్తకాలను తీసుకుంటే డబ్బులు అనవసరంగా వెచ్చించే వీలు ఉండకపోవచ్చు.

పాఠ్యాంశాలను తగ్గించాలి. నెలవారీ పాఠ్యాంశాలుగా చిన్న పుస్తకాలు ముద్రణ చేయాలి.

పూర్వ ప్రాథమిక తరగతులు ఆట పాటలతో నిర్వహించాలి.

మొదటి మూడు తరగతులకు పరీక్షలు, హోంవర్క్ ఉండకూడదు. మిగిలిన తరగతులకు హోంవర్క్స్ ఇంటి దగ్గర, పాఠ్య పుస్తకాలు పాఠశాలల్లో ఉండాలి.

ప్రతి తరగతి గదికి పుస్తకాలను భద్రపరిచే విధంగా రాక్స్ ఏర్పాటు చేయాలి.

పుస్తకాల బరువును తగ్గించేలా తరగతి ప్రణాళిక

నోట్‌పుస్తకాలు 40 కిలోలకు మించి ఉండకూడదు.

భారీ బ్యాగ్‌లు స్థానంలో చేతిసంచులను ప్రోత్సహించాలి.

తరగతి బయట నుంచి ఎక్కువగా నేర్చుకునేలా విద్యార్థులను ప్రోత్సహించాలి.

గ్రంథాలయం, తరగతి గదిలో ఉపాధ్యాయుడు అదనపు సిలబస్‌ను అందించగలగాలి.

వర్క్ బుక్స్, ఆల్ఇన్‌వన్, గైడ్స్, కొశ్చన్ బ్యాంకులు వంటి పుస్తకాలను దూరం చేయాలి. అప్పుడే విద్యార్థులు బోధన పట్ల ఆసక్తి చూపుతారు.

### తరగతులవారీగా ఇలా ఉండాలి..

వైద్యుల సూచన మేరకు 1,2 తరగతుల విద్యార్థులు ఒక కిలో, 3,4 తరగతులవారు రెండు కిలోల బరువును మాత్రమే మోయాలి. 5,6,7 తరగతులకు నాలుగు, ఎనిమిది దాటిన తరగతులకు 5 కిలోలు ఉండాలి. అయతే విద్యార్థులు సగటున మోస్తున్న బరువు ఇలా ఉన్నాయి. కేంద్రీయ విద్యలో 5.4 కేజీలు, సీబీఎస్ఈలో 5.5 కేజీలు, ప్రైవేటులో 5.6, ప్రభుత్వంలో 3.7 కేజీలు ఉంటున్నాయి.

### విద్యార్థులు మోస్తున్న బరువు (కేజీల్లో) ఇలా ఉంది

| తరగతి | కేంద్రీయ | సీబీఎస్ఈ | ప్రైవేటు | ప్రభుత్వం |
|---|---|---|---|---|
| ఒకటి | 2.2 | 3.7 | 3.2 | 1.8 |
| ఐదు | 4.3 | 5.3 | 7.6 | 3.8 |
| ఎనిమిది | 6.1 | 6.5 | 6.7 | 4.9 |
| పది | 8.0 | 5.7 | 6.7 | 5.5 |



మంచిర్యాలలోని హమాలివాడకు చెందిన ఈ విద్యార్థి శ్రావణ్. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. ఈ విద్యార్థి మోస్తున్న పుస్తకాల బరువు 7.5 కిలోలు. వాస్తవానికి 4 కిలోలకు మించి మోయొద్దు

### అనారోగ్య సమస్యలు..

**- ఆడే అరవింద్, వైద్యులు, మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రి**



పిల్లలకు అధిక బరువులతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. నరాలు, కండరాలు, ఎముకల సమస్యలు వస్తాయి. వెన్నుముకపై ప్రభావం ఉంటుంది. వయస్సు పెరిగిన కొద్ది వారిలో అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. వన్ను నొప్పి, మెడనొప్పి, భుజం, నడుం, తలనొప్పి వంటి సమస్యలకు మూలమవుతుంది. ఈ సమస్యలతో ఆసుపత్రులకు వస్తున్న చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. ప్రత్యామ్నాయమార్గాలు చూపి పిల్లలను పుస్తకాలభారం నుంచి విముక్తి చేయాలి.

### విద్య అంటే భయం ఏర్పడుతుంది

**- విశ్వేశ్వరరావు, మనస్తత్వ నిపుణుడు, మంచిర్యాల**



ప్రస్తుతం పిల్లలు ఇంట్లో, పాఠశాలల్లో నాలుగు గోడల మధ్య గడుపుతున్నారు. దీంతో పాటు వాహనాల్లో వెళ్లటం, భవంతుల్లో మెట్లను బరువుతో ఎక్కడం ద్వారా మానసిక పెరుగుదల తగ్గుతుంది. సహజసిద్ధమైన వాతావరణానికి దూరమవుతున్నారు. రోజువారీగా తీసుకుంటున్న ఆహారం పుస్తకాల బరువు మోయటానికే సరిపోవడం లేదు. విద్యలో ఆటపాటలకు అనుకూలంగా లేకపోతే బాల్యం అనుభూతులకు దూరమవుతారు. పుస్తకాల బరువుతో విద్యపట్ల భయం ఏర్పడుతుంది.

### తెర పాఠాలతో కొంత మేలు

**- మంచిర్యాల జిల్లా విద్యాధికారి రవికాంత్**



ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తెర పాఠాలు మొదలయ్యాయి. ఈ విధానంతో కొంతమేర పుస్తకాల భారం తగ్గుతోంది. ఈ పద్ధతి ద్వారా పుస్తకాల బరువును తగ్గించవచ్చు. ఇ-లెర్నింగ్‌తో తక్కువ సమయంలో ఎక్కువ విజ్ఞానం కలుగుతుంది. పూర్తిస్థాయిలో అన్ని పాఠశాలల్లో ఇ-లెర్నింగ్ విధానం అమలుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.



## ఎడ్లబండే 108

మారుమూల గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న దుస్థితికి ఈ చిత్రమే నిదర్శనం. సిరికొండ మండలం తుమ్మల్‌పాడ్ గ్రామానికి చెందిన మహిళ పేరు దేవుకాబాయి. మూడు రోజుల నుంచి ఎడమ కాలు లేవలేని పరిస్థితి ఏర్పడింది గ్రామానికి రాకపోకలు లేకపోవడంతో తప్పని పరిస్థితిలో మంగళవారం ఆమె భర్త మూన్‌సింగ్ ఎడ్లబండిపై సిరికొండకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి ఇంద్రవెల్లి ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడగా మరో మహిళ జానాబాయికి సోమవారం రాత్రి విద్యుత్తు షాక్‌కు గురవడంతో చిన్నపాటి గాయాలయ్యాయి. కానీ ఆసుపత్రికి వెళ్లే పరిస్థితి లేకపోవడంతో ఇలా ఎడ్లబండిలోనే వెళ్లాల్సి వచ్చిందని వాపోయారు. గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో నిత్యం ఇలాంటి కష్టాలు పడుతున్నామని వాపోతున్నారు.

**– సిరికొండ(ఇచ్చోడ గ్రామీణం), న్యూస్‌టుడే**